
'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 347

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

శుక్రవారం 8-3-2024



● నేడు మహిళా దినోత్సవం

జోగిని వ్యవస్థపై పోరాటం చేస్తూ..

మహిళల భద్రతలో ఎవరెక్కడ?

తల్లిదండ్రులకూ తల్లిలా నిలిచి..

ఎలక్ట్రీషియన్‌గా.. పనిచేస్తూ..

'డిజిటల్' దారి ఇస్తే.. డెవలప్‌మెంట్

- వివరాలు 16లో



ఆర్టికల్ 370 రద్దుతో స్వేచ్ఛ

ఆర్టికల్ 370 రద్దు తర్వాత అభివృద్ధిలో జమ్మూకశ్మీర్ నూతన శిఖరాలకు చేరుకుంటోందని ప్రధాని మోదీ చెప్పారు.

- వివరాలు 6లో



ప్రాణాలతో బయటపడడం అద్భుతమే

జైలు నుంచి ప్రాణాలతో బయటపడతానని ఏనాడూ అనుకోలేదని ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా చెప్పారు.

- వివరాలు 6లో



బీజేపీలోకి గంగోపాధ్యాయ్

కలకత్తా హైకోర్టు జడ్జి పదవికి రాజీనామా చేసిన జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ్ గురువారం కాషాయ కండువా కప్పుకున్నారు.

- వివరాలు 6లో

ప్రతి రంగంలో ప్రతిభ

పర్యావరణ దీపికలు..

విశ్వంభర గీతికలు..

- వివరాలు 13,14లో

4 రోజుల్లో 850 ఎకరాలా!

ఐఎంజీ భారత్‌తో ఒప్పందంపై సీబీఐ విచారణ జరిపిస్తారా?

మమ్మల్నే ఆదేశించమంటారా? ● రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు ప్రశ్న

- వారం రోజుల గడువు ఇచ్చిన ధర్మాసనం
- 2003 నాటి చంద్రబాబు ప్రభుత్వాన్ని తప్పుబట్టిన హైకోర్టు
- ఆపద్ధర్మ ప్రభుత్వంలో 400 ఎకరాలకు సేల్ డీడ్ చేస్తారా?
- అత్యంత ఖరీదైన ప్రాంతంలో వేల కోట్ల విలువైన భూములను కారు చౌకగా ధారాదత్తం చేస్తారా?
- గతంలో ఏ కంపెనీకీ 4 రోజుల్లోనే వందల ఎకరాలు అప్పగించినట్టుగా, నిర్వహణ ఖర్చులు, బిల్లుల మాఫీకి అంగీకరించినట్టుగా లేదు
- విస్తృత ప్రజా ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకునే వైఎస్ ప్రభుత్వం ఆ భూములు వెనక్కి తీసుకుంటూ చట్టం చేసింది
- పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదు.. ఆ ఒప్పందాన్ని ఏ రకంగానూ సమర్థించలేం
- 18 ఏళ్ల సుదీర్ఘ విచారణ తర్వాత చీఫ్ జస్టిస్‌తో కూడిన బెంచ్ స్పష్టమైన తీర్పు
- ఐఎంజీ భారత్ పిటిషన్ కొట్టివేత.. పిల్‌పై విచారణ వచ్చే వారానికి వాయిదా
- 2003 ఆగస్టు 5న ఏర్పాటైన ఐఎంజీ భారత్..9న బాబు ప్రభుత్వం ఎంవోయూ



సాక్షి, హైదరాబాద్: ఐఎంజీ అకాడమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎంజీబీపీఎల్) కంపెనీ ఏర్పాటైన 4 రోజుల్లోనే 850 ఎకరాలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్న 2003 నాటి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు తీవ్రస్థాయిలో తప్పుబట్టింది. కనీస విచారణ లేకుండా, అంతర్జాతీయ కంపెనీతో సంబంధాలు ఉన్నాయో లేదో తెలుసుకోకుండా, అత్యంత ఖరీదైన ప్రాంతంలో వేల కోట్ల విలువైన భూములను కారు చౌకగా ధారాదత్తం చేసేందుకు ఒప్పందం కుదుర్చుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. స్పోర్ట్స్ అకాడమీ నిర్వహణ కోసం అంటూ ఏటా కోట్లాది రూపాయలు ముట్టజెప్పేందుకు, విద్యుత్, నీటి, సీవేజ్, డ్రైనేజీ సౌకర్యాలు 100 శాతం ఉచితంగా కల్పించేందుకు అంగీకరించడం గతంలో ఎప్పుడూ, ఎక్కడా చూడలేదంటూ విస్మయం వ్యక్తం చేసింది. గతంలో ఏ కంపెనీకీ అది ఏర్పాటైన 4 రోజుల్లో వందల ఎకరాలు అప్పగించినట్టుగా, నిర్వహణ ఖర్చులు, బిల్లుల మాఫీకి అంగీకరించినట్టుగా లేదని అభిప్రాయపడింది. 2007లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం విస్తృత ప్రజా ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకునే సదరు భూమిని వెనక్కు తీసుకుంటూ చట్టం చేసిందని స్పష్టం చేసింది. రాజ్యాంగంలో ఉన్న అధికారాల మేరకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్తి (పరిరక్షణ, రక్షణ, పునఃప్రారంభం) చట్టాన్ని తీసుకొచ్చిందని.. ఇది ఎంతమాత్రం ఆక్షేపణీయం కాదని తేల్చిచెప్పింది. ఐఎంజీ భారత్ (పిటిషనర్) పేర్కొంటున్నట్లుగా ఆర్టికల్ 14 ఉల్లంఘన ఎక్కడా జరగలేదని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ కనిపించలేదని, ఆ ఒప్పందాన్ని ఏవిధంగానూ సమర్థించలేమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటిల ధర్మాసనం 18 ఏళ్ల సుదీర్ఘ విచారణ తర్వాత గురువారం తీర్పు ఇచ్చింది. దీనిపై మీరు సీబీఐ విచారణ జరిపిస్తారా? లేక మమ్మల్నే ఆదేశించమంటారా? అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ అంశంపైనే దాఖలైన ఓ పిల్ విచారణ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై వారం రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పింది.

యువతను క్రీడల్లో తీర్చిదిద్దడం కోసం అంటూ..

ఐఎంజీ అకాడమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎంజీబీపీఎల్) 2003, ఆగస్టు 5న ఏర్పాటైంది. కంపెనీ ఏర్పాటైన 4 రోజులకే అంటే ఆగస్టు 9నే చంద్రబాబు నేతృత్వంలోని నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,

మిగతా 12వ పేజీలో ▶



ఎమ్మెల్సీలపై మళ్లీ నిర్ణయం

దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణల పేర్లను గవర్నర్ తిరస్కరించిన తీరు సరికాదు

'గవర్నర్ కోటా ఎమ్మెల్సీ'ల వివాదంలో హైకోర్టు సీజే ధర్మాసనం తీర్పు

కేబినెట్ సిఫార్సుల మేరకే గవర్నర్ వ్యవహరించాలి

అభ్యంతరాలు ఉంటే పునఃపరిశీలనకు పంపాల్సింది

కానీ సిఫార్సులను పూర్తిగా రద్దుచేసే అధికారం మాత్రం లేదు

దీనిపై సెప్టెంబర్‌లో గవర్నర్ ఇచ్చిన ఆదేశాలను రద్దుచేసిన హైకోర్టు

కోదండరామ్, అలీఖాన్‌లను ఎమ్మెల్సీలుగా నియమించిన ప్రభుత్వ గెజిట్ కూడా రద్దు

గవర్నర్‌కు న్యాయస్థానాలు కూడా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేవని వ్యాఖ్య

అయితే నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నదే తమ అభిప్రాయమని వెల్లడి

ఎమ్మెల్సీల అంశంపై కేబినెట్ మళ్లీ నిర్ణయం తీసుకోవాలని సూచన

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణలను నియమించాలంటూ రాష్ట్ర కేబినెట్ చేసిన సిఫార్సులపై గవర్నర్ వ్యవహరించిన తీరు సరికాదని రాష్ట్ర హైకోర్టు పేర్కొంది. సదరు సిఫార్సులను తిరస్కరిస్తూ 2023 సెప్టెంబర్ 19న గవర్నర్ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసింది. దీంతోపాటు గవర్నర్ ఆదేశాల మేరకు కోదండరామ్, ఆమెర్ అలీఖాన్‌లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ఈ ఏడాది జనవరి 27న ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా రద్దు చేసింది. మళ్లీ కొత్తగా ఎమ్మెల్సీల నియామకం చేపట్టాలని.. మరోసారి ఎమ్మెల్సీల పేర్లను కేబినెట్‌లో ప్రతిపాదించి గవర్నర్‌కు పంపాలని స్పష్టం చేసింది. ఈ మేరకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామక వివాదంపై దాఖలైన పిటిషన్‌లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటిల ధర్మాసనం గురువారం కీలక తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 (5) ప్రకారం.. కేబినెట్ సాయం, సలహా మేరకు గవర్నర్ వ్యవహరించాల్సి ఉంటుందని పేర్కొంది. కేబినెట్ సిఫార్సు చేసిన వ్యక్తుల అర్హత, అనర్హత అంశాలను పరిశీలించడానికి గవర్నర్‌కు అధికారం ఉంటుందని.. కావాలంటే అవసరమైన పత్రాలు, సమాచారం కోరవచ్చని తెలిపింది. కేబినెట్ సిఫార్సులను పునఃపరిశీలనకు పంపే అధికారం కూడా ఉంటుందని

మిగతా 8వ పేజీలో ▶

న్యూస్‌రీల్

రాహుల్ 'యువ న్యాయ్'



కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పలు నూతన హామీలను ప్రకటించారు. ''మేం అధికారంలోకి వస్తే కేంద్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 30 లక్షల ఉద్యోగాలను భర్తీచేస్తాం'' అని చెప్పారు.

- వివరాలు 6లో

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ 4 శాతం పెంపు



లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ బేసిక్ పే/పెన్షన్‌పై మరో 4 శాతం పెంచింది.

- వివరాలు 6లో

ఎమ్మెల్యే మర్రి కళాశాల భవనం కూల్చివేత



మేడ్చల్ జిల్లా దుండిగల్‌లో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ (ఐఏఆర్‌ఈ) కళాశాల భవనాన్ని కూల్చివేశారు.

- వివరాలు 7లో

15 నుంచి ఒంటిపూట బడులు



రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు ఈ నెల 15 నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు నిర్వహించాలని చెప్పింది.

- వివరాలు 3లో



అన్ని 'వేషాలు' వేశారు... ఇంకా వేయని వేషం ఏదయినా మిగిలిందేమోనని ఆలోచిస్తున్నారు!



శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం విద్యుద్దీప కాంతుల్లో తళుకులీనుతున్న నల్లగొండ పట్టణం పానగల్లులోని ఛాయా సోమేశ్వరాలయం

అభివృద్ధి కోసమే సఖ్యత

కేంద్రం సహకరించకపోతే కొట్లాడతాం: సీఎం రేవంత్



భూమి పూజ చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం

- రాజీవ్ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్‌కు భూమి పూజ
- రాజకీయాలు, అభివృద్ధి రెండూ వేరని సూత్రీకరణ
- బీఆర్‌ఎస్ ఘర్షణ ధోరణితో ఆలస్యమైందని వ్యాఖ్య
- 'కేటీఆర్ చచ్చుడో.. జీహెచ్‌ఎంసీకి నిధులు వచ్చుడో' అంటూ దీక్ష చేయాలని సూచన

7 లో

10 మందితో కాంగ్రెస్ తొలి జాబితా!

- ఢిల్లీలో సమావేశమైన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ
- సర్వేలు, సమీకరణాలు పరిగణనలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక

12 లో



మళ్లీ వయనాడ్ నుంచే రాహుల్ పోటీ

6 లో

నీకే నల్లగొండ, ఖమ్మం మానవ బాంబుల ముప్పు!



- సీఎం రేవంత్ మానవ బాంబులా పేలాల్సిన అవసరం లేదు
- కరీంనగర్ కదనభేరి సన్నాహక భేటీలో కేటీఆర్ వ్యాఖ్య
- ముఖ్యమంత్రికి కత్తెర్లు, లంకె బిందెలతో ఏం పని?
- మా నుంచి ఏ హానీ ఉండదు.. ఐదేళ్లూ పరిపాలించు
- మగాడివైతే మల్కాజిగిరికి రా.. ఎంపీగా పోటీ చేద్దాం
- పార్లమెంటు ఎన్నికల తరువాత ఏక్‌నాథ్ షిండేలా రేవంత్

- వివరాలు 8లో

క్లుప్తంగా...

76,382 ధరణి దరఖాస్తుల పరిష్కారం

రెవెన్యూ మంత్రి పొంగులేటి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్‌కి సంబంధించి గత ప్రభుత్వంలో వచ్చిన 2,46,536 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, ఈ నెల 1 నుంచి చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం నాటికి 76,382 దరఖాస్తులను పరిష్కరించినట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ స్థాయిలో ఈ దరఖాస్తులను పరిష్కరించినట్టు గురువారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. రోజుకు 15 వేలకు పైగా దరఖాస్తులను పరిష్కరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందికి మంత్రి అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వం ఎలాంటి అధ్యయనం లేకుండా ధరణి పోర్టల్‌ను తీసుకురావడంతో ప్రతి గ్రామంలో సమస్యలు ఉత్పన్నమయ్యాయని చెప్పారు. తమ ప్రభుత్వం ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచండి

ఆర్.కృష్ణయ్య డిమాండ్



సంక్షేమ భవన్ ముందు వంట చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్.కృష్ణయ్య

విజయనగర్ కాలనీ (హైదరాబాద్): పెరిగిన ధరల ప్రకారం 8 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్, గురుకుల పాఠశాల, కాలేజ్ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం మాసబ్‌ట్యాంక్ బీసీ సంక్షేమ భవన్‌లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ, ఆరు సంవత్సరాల క్రితం ఆ నాటి ధరల ప్రకారం నిర్ణయించిన మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లు ఇప్పటికీ కొనసాగిస్తున్నారని, ఇటీవల నిత్యావసర వస్తువుల ధరలు రెండు నుంచి మూడు రెట్లు పెరిగాయని చెప్పారు. హోటల్‌లో ఒకపూట భోజనం రూ.80 ఉండగా హాస్టల్ విద్యార్థుల భోజనం పూటకు రూ.10 ఎలా సరిపోతాయని ఆయన ప్రశ్నించారు. యూనివర్సిటీ విద్యార్థుల మెస్ బిల్లు రూ. 2,800 వస్తుంటే, స్కాలర్‌షిప్ రూ.1,500 మాత్రమే మంజూరు చేస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కళాశాల హాస్టల్ విద్యార్థుల మెస్ ఛార్జీలను రూ.1,500 నుంచి రూ.3 వేలకు, పాఠశాల హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను రూ.950 నుంచి రూ.2 వేలకు, కాస్మొటిక్ చార్జీలు నెలకు రూ.500 వరకు పెంచాలని డిమాండ్ చేశారు.

ఆస్తుల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి

బిల్డాక్స్‌కు గుండ్లపోచంపల్లిలో మాత్రమే అనుమతి : 'రెరా' కార్యదర్శి యాదిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: పట్టణాభివృద్ధి సంస్థలు, స్థానిక సంస్థల అనుమతులతో పాటు 'రెరా'లో రిజిస్టర్ అయిన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులలో మాత్రమే స్థలాలు, ఫ్లాట్లు కొనుగోలు చేయాలని రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) ఒక ప్రకటనలో తెలిపింది. 'రెరా'లో రిజిస్టర్ కాని ప్రాజెక్టులలో రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోరాదని పేర్కొంది. బిల్డాక్స్ కంపెనీ హఫీజ్‌పేటలోని సర్వేనెం. 80 లోగల స్థలంలో ఫ్లాట్ల అమ్మకం కొరకు ప్రతిపాదించిందని, దానిపై దరఖాస్తుదారు ఫిర్యాదు మేరకు ఈ నెల 6, 7 తేదీలలో బిల్డాక్స్ ప్రతినిధులను, ఫిర్యాదుదారులను విచారణ కోసం పిలిపించామని 'రెరా' కార్యదర్శి పి.యాదిరెడ్డి తెలిపారు. ఈ విచారణలో కేవలం భువి/వాసవి బిల్డాక్స్ ప్రాజెక్టు గుండ్లపోచంపల్లి (సర్వే నెం. 509/పార్ట్) నందు పీవో 2200007044 నెంబరుతో బిల్డాక్స్ కంపెనీ 'రెరా' రిజిస్ట్రేషన్ కలిగి ఉందని తేలిందన్నారు. ఇతర ప్రాంతాలలో బిల్డాక్స్ కంపెనీకి ఎలాంటి అనుమతులు లేవని, కొనుగోలుదారుల నుంచి ఫిర్యాదులు అందుతున్నందున అప్రమత్తంగా ఉండాలని, ఆయా ప్రాజెక్టులలో ఎలాంటి కొనుగోళ్లు జరపరాదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా 'విట్' వైబ్రెన్స్-24

సాక్షి, హైదరాబాద్: చెన్నైలోని వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) తన 8వ అంతర్జాతీయ సాంస్కృతిక కార్యక్రమం 'వైబ్రెన్స్-24'ను ఘనంగా నిర్వహించింది. 'లింగ సమానత్వం' ఇతివృత్తంతో మినీ మారథాన్‌గా ప్రారంభించి అనేక కార్యక్రమా లు నిర్వహించారు. కార్యక్రమంలో వేయి మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. 'విట్' వైస్ ప్రెసిడెంట్ శేఖర్ విశ్వనాథన్ కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ప్రఖ్యాత క్రికెటర్ దినేశ్ కార్తీక్ ప్రారంభ వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో తన అనుభవాలు పంచుకు న్నారు. ప్రఖ్యాత గాయని శ్రేయా ఘోషల్ తన గానామృతంతో కార్యక్రమాన్ని ఉర్రూత లూగించారు. వీఐటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వీఎస్ కాంచన భాస్కరన్, వీఐటీ చెన్నై అదనపు రిజిస్ట్రార్ డాక్టర్ పీకే మనోహరన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

త్వరలో నైపుణ్య విశ్వవిద్యాలయం

- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- ఉద్యోగ అవకాశాలపై రౌండ్ టేబుల్ సమావేశం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో బుర్రా వెంకటేశం, లింబాద్రి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో త్వరలో నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని (స్కిల్ యూనివర్సిటీ) ఏర్పాటు చేస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సహచరులు, అధికారులు చిత్తశుద్ధితో ఉన్నట్లు ఆయన వివరించారు. విద్యా శాఖ, ఉన్నత విద్యామండలి, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ''తెలంగాణలో ఉద్యోగ–ఉపాధి అవకాశాలు, ఇంటర్న్‌షిప్, ఉద్యోగాల కల్పన, విద్యార్థుల అభివృద్ధి''అనే అంశంపై గురువారం అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రం విద్య, ఐటీ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా ఉందని అన్నారు. తెలంగాణలోని ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునే ఏ విద్యార్థి కూడా నైపుణ్య లేమితో ఉపాధి అవకాశాలు కోల్పోరాదని, ఆ దిశగా ఉన్నత విద్యా మండలి, విద్యా శాఖ అధికారులు కృషి చేయాలని సూచించారు. డిగ్రీ స్థాయిలో విద్యాభ్యాసం చేస్తున్నప్పుడే విద్యార్థులు రాష్ట్రంలోని ప్రఖ్యాత పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల్లో చదువుకునే విద్యార్థులకు ఆయా కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధి కోసం ప్రత్యేక శిక్షణను ఇచ్చేలా ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని చెప్పారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ తెలంగాణలో ఉన్నత విద్య స్థూల నమోదు జాతీయ స్థాయి సగటు కంటే ఎక్కువగా ఉందని, రాష్ట్ర విద్యారంగంలో అమలు అవుతున్న కార్యక్రమాలు ఉన్నతమైన గుర్తింపు పొందాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు ప్రొ. వెంకట రమణ, ప్రొ. ఎస్.కె. మహమూద్ తదితరులు ప్రసంగించారు.

విత్తనాభివృద్ధి సంస్థ ఎండీపై విచారణ

- బాధ్యతల నుంచి తప్పించిన తుమ్మల
- అన్ని కార్పొరేషన్లపై సమగ్ర నివేదికలకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేశవులు మీద వచ్చిన ఆరోపణలపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూర్తి స్థాయి విచారణకు ఆదేశించారు. కేశవులును ఎండీగా తప్పించి ఐఏఎస్ అధికారి హరితకు ఆ బాధ్యతలు అదనంగా అప్పగించారు. గురువారం మంత్రి తుమ్మల.. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, సహకార శాఖలు, వాటి అనుబంధ కార్పొరేషన్లపై సమీక్ష నిర్వహించారు. కొన్ని కార్పొరేషన్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే కేశవులుపై విచారణకు ఆదేశించారు. అన్ని కార్పొరేషన్ల నిర్వహణపై 10 రోజుల్లోగా సమగ్ర నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. ఈ మేరకు విచారణాధికారులను నియమించారు.

సీఎం సోదరునికి గుండెపోటు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి గురువారం గుండెపోటుకు గురయ్యారు. దీనితో ఆయన్ను కుటుంబసభ్యులు వెంటనే మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నట్లు సమాచారం.

కరెంట్ వినియోగంలో రికార్డు

- ఈనెల 6న 298.19 ఎంయూల కరెంట్ వినియోగం... గతేడాది గరిష్ట వినియోగం 297.89 ఎంయూలు

సాక్షి, హైదరాబాద్: వేసవి తీవ్రత పెరగడంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగి కొత్త రికార్డు నెలకొ ల్పింది. రాష్ట్రంలో రోజువారీ గరిష్ట విద్యుత్ వినియోగం గతేడాది(ఇప్పటివరకు) 297.89 మిలియన్ యూనిట్లు (ఎంయూ) కాగా, బుధవారం రోజు 298.19 ఎంయూలకు ఎగబాకింది. జీహెచ్ఎంసీ పరిధిలో గతేడాది గరిష్ట విద్యుత్ వినియోగం 59.53 ఎంయూలు ఉండగా, బుధవారం 69.31 ఎంయూలకు పెరిగింది. సగటు రోజువారీ విద్యుత్ వినియోగం గతేడాది జనవరిలో 227.42 ఎంయూలు కాగా, ఈ ఏడాది జనవరిలో 243.12 ఎంయూలకు, గతేడాది ఫిబ్ర వరిలో 263.48 ఎంయూలు కాగా ఈ ఏడాది ఫిబ్రవరి లో 272.86 ఎంయూలకు పెరిగిందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో మరి కొన్ని రోజుల్లో రోజూ వారీ విని యో గం 300 ఎంయూలను దాటే అవకాశాలు ఉన్నాయి.

15 నుంచి ఒంటిపూట బడులు

- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు
- ఏప్రిల్ 23 చివరి పనిదినం
- ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు ఈ నెల 15 నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు నిర్వహించాలని చెప్పింది. ప్రభుత్వ పాఠశాలలతోపాటు ఎయిడెడ్, ప్రైవేటు యాజమాన్యాలన్నీ ఈ నిబంధనలు తప్పకుండా పాటించాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని 12.30 గంటల నుంచి అమలు చేయాలని, పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని అందించిన తర్వాతే ఇంటికి పంపించాలని నిర్దేశించింది. పదోతరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానుండటంతో పరీక్షా కేంద్రాలుగా ఉన్న స్కూళ్లను మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 5 గంటల వరకు నిర్వహించాలని చెప్పింది. 2023–24 విద్యా సంవత్సరానికి ఏప్రిల్ 23వ తేదీ పాఠశాలలకు చివరి పని దినంగా విద్యాశాఖ నిర్దేశించింది. దీంతో అప్పటివరకు ఒంటిపూట బడులే నిర్వహిస్తారు. రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ఈ సమాచారాన్ని పంపాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.


వెబ్‌సైట్‌లో టెన్త్ విద్యార్థుల హాల్‌టికెట్లు

- ఈనెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు
- రాష్ట్రవ్యాప్తంగా 2,676 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- హాల్‌టికెట్లలో తప్పులుంటే సరిచేస్తామన్న ప్రభుత్వ పరీక్షల విభాగం

సాక్షి, హైదరాబాద్: ఈనెల 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీవరకు జరిగే పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్లను ప్రభుత్వ పరీక్షల విభాగం సంబంధిత పాఠశాలలకు పంపించింది. పూర్తి స్థాయిలో హాల్‌టికెట్లను పంపించడంతో పాటు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. బీఎస్ఈ. తెలంగాణ. జీఓవీ. ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ స్పష్టం చేశారు. హాల్‌టికెట్లలో ఏవైనా అక్షరదోషాలు, ఇతర తప్పులుంటే తక్షణమే పాఠశాల ప్రిన్సిపాళ్ల ద్వారా సమాచారాన్ని పంపాలని, వాటిని సరిచేస్తామని ప్రభుత్వ పరీక్షల విభాగం స్పష్టం చేసింది. ఈ నెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. కాంపోజిట్ కోర్సు పరీక్ష మాత్రం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు, సైన్స్ సబ్జెక్టు పరీక్షలు రెండు భాగాలుగా నిర్వహిస్తారు. పార్ట్–1 ఫిజికల్ సైన్స్, పార్ట్–2 బయోసైన్స్ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు వేర్వేరు రోజుల్లో నిర్వహిస్తారు. పదోతరగతి పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 5,08,385 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో బాలురు 2,57,952 మందికాగా, బాలికలు 2,50,433 మంది ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,676 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, క్యాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. పరీక్షలు రాసే విద్యార్థులు, విధులు నిర్వహించే సిబ్బంది పరీక్షా కేంద్రాలను ముందస్తుగా పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. విద్యార్థులంతా పాఠశాల యాజమాన్యం నుంచి హాల్‌టికెట్లను తీసుకోవాలని సూచించారు.

గ్రూప్-2, గ్రూప్- 3 ఖాళీల గుర్తింపునకు కసరత్తు షురూ!

శాఖల వారీగా సమాచారాన్ని కోరిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్–2, గ్రూప్–3 ఉద్యోగ ఖాళీల కసరత్తు ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. శాఖల వారీగా గుర్తించిన గ్రూప్–2, గ్రూప్–3 ఖాళీల వివరాలను నిర్దేశిత ఫార్మాట్‌లో సమర్పించాలని అన్ని ప్రభుత్వ శాఖాధిపతులను ఆదేశించింది. ఈమేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్ని ప్రభుత్వ శాఖలకు మెమో జారీ చేశారు. 2022 ఆగస్టు 30వ తేదీ నాటికి గుర్తించిన ఖాళీలకు అనుగుణంగా భర్తీకి అప్పట్లో ప్రభుత్వం అనుమతించిన సంగతి తెలిసిందే. ఈమేరకు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2022 డిసెంబర్‌లో ఉద్యోగ ప్రకటనలు జారీ చేసింది. ఆగస్టు 2022 తర్వాత నుంచి గుర్తించిన ఖాళీలు, మంజూరై ఖాళీగా ఉన్న పోస్టులతో పాటు రానున్న ఏడాది కాలంలో ఖాళీ కానున్న గ్రూప్–2, గ్రూప్–3 ఉద్యోగాల వివరాలను గురువారం సాయంత్రం 5గంటల్లోగా సమర్పించాలని ఆర్థిక శాఖ ఆదేశించింది. ఇందుకు సంబంధించి ప్రత్యేక ఫార్మాట్‌ను ఇప్పటికే ప్రభుత్వ శాఖలకు ఆర్థిక శాఖ అధికారులు పంపించారు.

కొత్త పోస్టులతో కొత్త ప్రకటనలు...

ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీ గ్రూప్–2, గ్రూప్–3 ఉద్యోగ ప్రకటనలు జారీ చేసి వాటి భర్తీ ప్రక్రియకు సంబంధించిన చర్యలు వేగ వంతం చేసింది. గ్రూప్–2 కేటగిరీలో 783 ఖాళీలుండగా... వీటికి సంబంధించి అర్హత పరీక్షలను ఆగస్టు 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. అదేవిధంగా గ్రూప్–3 కేటగిరీలో 1388 ఖాళీల భర్తీకి గాను ఈ ఏడాది నవంబర్ 17, 18 తేదీల్లో అర్హత పరీక్షలను నిర్వహించనుంది. తాజాగా ఈ రెండు కేటగిరీల్లో ఖాళీల గుర్తింపునకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కింద ఖాళీలను గుర్తిస్తే వాటి భర్తీకి ప్రత్యేకంగా నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉద్యోగ ప్రకటనలు జారీ చేసి పరీక్షలు నిర్వహిస్తుండగా... కొత్త ఖాళీలకు కొత్త నోటిఫికేషన్లు ఇవ్వాలా? లేక ఇప్పటికే ప్రకటించిన నోటిఫికేషన్లలో పోస్టుల సంఖ్యను పెంచాలా? అనే కోణంలో ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది.

సెలవు దినాల్లో పనిచేయమంటే ఎలా?

తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆవేదన

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా తమతో పని చేయించడం దారుణమని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం పేర్కొంది. శివ రాత్రి పండుగ, రెండవ శనివారం, ఆ తర్వాత ఆదివారం కలిపి మొత్తం 3 సెలవు దినాలు తమను కచ్చితంగా పనిచేయాలని ఇబ్బంది పెట్టడం సరికాదని తెలిపింది. గత సర్కార్ తీరు బాగాలేకనే ప్రజా ప్రభుత్వం తెచ్చుకున్నామని, ఈ ప్రభుత్వంలో కూడా గతంలో మాదిరిగానే సెలవు రోజుల్లో పనిచేయించడం సరికాదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికీ ప్రభుత్వపరంగా ఏ పని అయినా కేవలం పంచాయతీ కార్యదర్శి మాత్రమే చేస్తున్నారని, అన్ని శాఖల్లో పంచాయతీ కార్యదర్శి మాత్రమే కీలకంగా వ్యవహరి స్తున్నారని తెలిపారు. అయినప్పటికీ తమను సెలవులు ఉపయోగించుకోకుండా వ్యవహరించడం సరికాదన్నారు. గత నెల పంచాయతీరాజ్ శాఖలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి అప్పుడు కూడా ప్రభుత్వ సెలవు దినాలను వాడుకోకుండా చేశారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సెలవులను వాడుకునే విధంగా చూడాలని, తమ హక్కులను కాలరాయవద్దని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.



పురుషుల కంటే స్త్రీల రాజకీయ, పారిశ్రామిక అవసరాలు తక్కువ వాస్తవికమా? ఈ మూర్ఖపు, ఏకపక్ష, ఏకస్వామ్య ఏర్పాటుకు అంతం పలికి, అందరికీ ఓటు హక్కు కల్పించాలి – ప్రతి ఒక్కరినీ పరిగణనలోకి తీసుకునే ఓటుహక్కు. ఏమైనా, ప్రతి మంచి పురుషుడి, మంచి స్త్రీ లక్ష్యం న్యాయమే!

– హెలెన్ కెల్లర్

సాక్షి

శుక్రవారం, 8 మార్చి 2024

ఆలస్యంగా దక్కిన న్యాయం

మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న ఆరోపణతో చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద అరెస్టయిన ఢిల్లీ విశ్వవిద్యాలయ అధ్యాపకుడు ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా పదేళ్ల సుదీర్ఘ కారాగారవాసం నుంచి గురువారం నిర్దోషిగా విడుదలయ్యారు. ఇదే అభియోగాలతో ఆయనతోపాటు అరెస్టయిన మరో అయిదుగురికి కూడా విముక్తి లభించింది. ఒకరు విచారణ సమయంలో మరణించారు. అభియోగాలను రుజువు చేయటంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని చెబుతూనే, అసలు తగిన అనుమతులు లేకుండా సాగించిన ఈ కేసు చెల్లుబాటు కాదని బొంబాయి హైకోర్టు నాగపూర్ ధర్మాసనం వ్యాఖ్యానించటం మన నేర న్యాయవ్యవస్థ పనితీరును పట్టిచూపుతోంది. యూఏపీఏ కింద ప్రాసిక్యూషన్ చర్యలు ప్రారంభించాలంటే నిబంధనల ప్రకారం ఉన్నతాధికారుల ముందస్తు అనుమతులు తప్పనిసరి. నిందితులపై పకడ్బందీ సాక్ష్యాధారాలున్నాయని వారు విశ్వసించాకే ప్రాసిక్యూషన్‌కు అనుమతించాలి. కానీ ఈ కేసులో ప్రొఫెసర్ సాయిబాబాను 2014లో అరెస్టు చేయగా ఏడాది తర్వాతగానీ అనుమతులు రాలేదు. ఇతర నిందితులు వాస్తవానికి 2013లోనే అరెస్టయ్యారు. ఈ సంగతి పట్టని మహారాష్ట్రలోని గఢ్‌చిరోలి సెషన్స్ కోర్టు కేసును పరిగణనలోకి తీసుకుని ఈలోగా ఒక సాక్షిని కూడా విచారించింది! చివరకు 2017లో వీరిని దోషులుగా పేర్కొంటూ యావజ్జీవ శిక్ష విధించింది. అటు ప్రభుత్వ యంత్రాంగం సరే... ఇటు న్యాయవ్యవస్థ సైతం ఇంత యాంత్రికంగా పనిచేయటం సరైందేనా? బొంబాయి హైకోర్టు 2022లో ఈ అవకతవకలను గుర్తించి కేసు కొట్టేసింది. కానీ ఆ వెంటనే సుప్రీంకోర్టు ధర్మాసనం మహారాష్ట్ర అప్పీల్‌ను స్వీకరించి బొంబాయి హైకోర్టు తీర్పును నిలుపుదల చేయటం, తిరిగి దీన్ని విచారించాలంటూ ఆదేశాలు జారీచేయటంవల్ల సాయిబాబా తదితరులకు స్వేచ్ఛ లభించటానికి మరికొన్ని నెలలు పట్టింది. ఇలా కనీస సాక్ష్యాధారాలు కొరవడిన, ముందస్తు అనుమతులు తీసుకోని కేసులో నిందితులను పదేళ్లపాటు జైలు గోడలమధ్య బంధించి వుంచారంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇది వ్యవస్థల సమష్టి వైఫల్యం కాదా? ఇందుకు జవాబుదారీతనం వహించాల్సిందెవరు? తెలుగు రాష్ట్రాల్లోనే కాదు... ఈయూ కమిషన్, అమెరికన్ కాంగ్రెస్, ఐక్యరాజ్యసమితి మానవహక్కుల విభాగంలో ఈ కేసు ప్రస్తావనకొచ్చింది. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాల్లోని వివిధ సంస్థల వరకూ అందరికందరూ ఇది అన్యాయంగా బనాయించిన కేసు అనీ, వెంటనే ఉపసంహరించుకోవాలనీ డిమాండ్ చేస్తూ వచ్చారు. టీఆర్ఎస్ సభ్యుడు కె. కేశవరావు 2015లో జీరో అవర్‌లో దీన్ని రాజ్యసభలో ప్రస్తావించే ప్రయత్నం చేశారు. అప్పటి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ కూడా రాశారు. అయినా ప్రయోజనం లేకపోయింది. కనీసం కేసు తేలేవరకూ నిందితులను బెయిల్‌పై విడుదల చేసివుంటే కొంతలో కొంతైనా న్యాయం చేసినట్టయ్యేది. బెయిల్ అనేది హక్కు, తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే జైలుకు పంపాలన్నది మౌలిక న్యాయసూత్రం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఈమధ్యకాలంలో కూడా పదే పదే ఈ సంగతిని గుర్తుచేస్తున్నారు. అయినా ఆచరణకొచ్చేసరికి జరిగేది వేరుగా వుంటోంది.

నిందితులు హింసాత్మక కార్యకలాపాల్లో పాల్గొన్నారని ప్రాసిక్యూషన్ ఆరోపించలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపట్ల విరోధభావాన్ని వ్యాప్తిచేసేందుకు కుట్రపన్నారని తెలిపింది. ఆ విషయంలో సమర్పించిన ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ఇతర పత్రాలువంటి సాక్ష్యాధారాలు అత్యంత బలహీనమైనవని బొంబాయి హైకోర్టు వ్యాఖ్యానించింది. ఏదైనా వెబ్‌సైట్ నుంచి వీడియోలు, ఇతర సమాచారం డౌన్‌లోడ్ చేసుకోవటం దానికదే నేరమెలా అవుతుందన్నది ధర్మాసనం సందేహం. ఫలానా ఉగ్రవాద చర్యకూ, దానికీ సంబంధం వున్నదని నిరూపిస్తే తప్ప ఆ సాక్ష్యానికి ఎలాంటి విలువా వుండదని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ సాయిబాబా అభిప్రాయాలు ఎవరికీ తెలియనివి కాదు. ఆయన వృత్తిరీత్యా ఇంగ్లిష్ అధ్యాపకుడు. కవి, రచయిత కూడా. ఆదివాసీ ప్రాంతాల్లో సహజవనరులను బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో రచనలు చేశారు. అరెస్టయిన సమయానికి విప్లవ ప్రజాస్వామిక వేదిక (ఆర్‌డీఎఫ్) బాధ్యుడు. ఆయన హింసాత్మక కార్యకలాపాల్లో పాలుపంచుకుంటే, విధ్వంసానికి పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చు. కానీ 90 శాతం అంగవైకల్యం వున్న సాయిబాబా మరొకరి సాయం లేనిదే తన పని తాను చేసుకోవటం కూడా అసాధ్యం. బయటకు వెళ్లాలంటే చక్రాల కుర్చీ తప్పనిసరి. అటువంటి వ్యక్తిని ఉగ్రవాదిగా జమకట్టడం సబబేనా?

కేవలం అసమ్మతిని వ్యక్తం చేయటమే ఒక మనిషిని పదేళ్లపాటు జైల్లోకి నెట్టడానికి కారణం కావటం మనం నమ్మే ప్రజాస్వామిక విలువలను ప్రశ్నార్థకం చేస్తోంది. ఉగ్రవాద చర్యలు సమాజ క్షేమానికి ముప్పుగా పరిణమిస్తాయనటంలో సందేహం లేదు. అటువంటివారిని అదుపు చేయాలంటే యూఏపీఏ వంటి కఠిన చట్టాల అవసరం వుందని ప్రభుత్వాలు భావిస్తే తప్పుబట్టనవసరం లేదు. కానీ మన రాజ్యాంగమే అనుమతించిన సహేతుకమైన అసమ్మతిపై లేనిపోని ముద్రలేసి దాన్ని తుంచివేయాలనుకోవటం, భావప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్లు వేయాలనుకోవటం ఏరకంగా చూసినా సబబు కాదు. ఇప్పుడు సాయిబాబా కోల్పోయిన విలువైన పదేళ్ల కాలాన్ని ప్రభుత్వం వెనక్కివ్వలేదు. కనీసం ఉద్యోగమైనా చేసుకోనివ్వాలి. ఇతర క్రిమినల్ కేసుల మాట అటుంచి యూఏపీఏ వంటి దారుణ చట్టాలకింద అరెస్టయి నిర్దోషులుగా తేలినవారికైనా తగిన పరిహారం చెల్లిస్తే కాస్తయినా ఉపశమనం ఇచ్చినట్టవుతుంది. పాలకులు ఆలోచించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** బ.త్రయోదశి రా.8.15 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** శ్రవణం ఉ.8.34 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** ప.12.20 నుండి 1.48 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.37 నుండి 9.25 వరకు తదుపరి ప.12.35 నుండి 1.23 వరకు, **అమృతఘడియలు:** రా.9.23 నుండి 10.53 వరకు, మహాశివరాత్రి.

సూర్యోదయం: 6.18
సూర్యాస్తమయం: 6.04
రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు

సాధికారత ఇంకెంత దూరం?

ప్రతి ప్రజా పోరాటంలోనూ మహిళలు ఎన్నో త్యాగాలు చేశారు. అయినా తమకు న్యాయంగా రావాల్సిన హక్కులు, అధికారాలను ఇప్పటికీ సంపూర్ణంగా అందుకోలేక పోతున్నారు. అన్ని అర్హతలున్నా పురుషులతో సమానంగా అవకాశాలు ఇవ్వని లింగ వివక్ష ఏదో రూపంలో కొనసాగుతూనే ఉంది. బాధితుల తరఫున వేసే ప్రశ్నని నేరంగా చూసే పరిస్థితులే ఇంకా కొనసాగుతున్నాయి. స్త్రీ దేహాల చుట్టూ అవరించివున్న దుర్భ్రమలు పోవాలి. మహిళల శకం మొదలయ్యేలా సంస్థాగత చర్యలు చేపట్టాలి.

పరువు, ప్రతిష్ఠ – స్త్రీల భద్రత



కె. ఎస్. మల్లీశ్వరి

ఇటీవల ఝార్ఖండ్ పర్యటన కోసం వచ్చిన ఒక విదేశీ మహిళ సామూహిక అత్యాచారానికి గురైన విషయం అనేక చర్చలకి దారితీసింది. బాధితుల తరఫున వేసే ప్రశ్నని నేరంగా చూసే కర్మభూమి మనది. ఈసారి బాధ్యతని జాతీయ మహిళా కమిషన్ చైర్ విమన్ రేఖా శర్మ తీసుకున్నారు.

అర్ధరాత్రి, అటవీ ప్రాంతంలో గుడారం వేసుకుని పడుకున్న స్పానిష్, బ్రెజిలియన్ జంటమీద ఏడుగురు వ్యక్తులు దాడిచేసి వారిని కొట్టి, కత్తి చూపి చంపుతామని బెదిరించి, వారి విలువైన వస్తువులు దోచుకుని, మహిళని సామూహికంగా రేప్ చేశారు. ఆసియా పాత్రికేయ రంగంలో పదిహేనేళ్లుగా పని చేస్తున్న డేవిడ్ జోసెఫ్ వోలోజ్కో అనే జర్నలిస్ట్ తన అనుభవాల మేరకి భారతదేశంలో విదేశీ మహిళలు ఒంటరిగా ప్రయాణించడం మంచిది కాదని చెప్పాడు.

ఇది వైరల్ అయి రకరకాల కామెంట్స్ మొదలయ్యాయి. అందులో రేఖా శర్మ వేసిన రీట్వీట్– జాతీయ మహిళా కమిషన్ వైఖరిని స్పష్టం చేసింది. 'ఇటువంటి ఘటనల మీద మీరెప్పుడైనా పోలీసు రిపోర్ట్ ఇచ్చారా? ఒకవేళ ఇవ్వకపోతే మీరు పూర్తిగా బాధ్య తారహితమైన మనిషి. కేవలం సోషల్ మీడియాలో రాసుకుంటూ దేశ పరువుని తీయాలనుకోవడం మంచిది కాదని' హితవు పలికారు. పాతకాలపు సినిమాల్లో, సాహిత్యంలో స్త్రీలమీద అత్యాచారం జరిగిన ఘటనలు చూపించాల్సి వచ్చినపుడు కొన్ని విచిత్రాలు జరిగేవి. 'ప్రాణం కన్నా మానం విలువైనదని' చెప్పి ఆ స్త్రీపాత్రని చంపేయడమో, జీవితాంతం కుళ్ళి కుళ్ళి చావమని సూచించడమో లేదా అత్యాచారం చేసినవాడు పెద్దమనసు చేసు కుని పెళ్లికి సిద్ధపడడమో చూపించేవారు. పరువు ప్రతిష్ఠలన్నీ స్త్రీల శరీర శీలం చుట్టూ కమ్ముకుని ఉంటాయనీ, శీలంపోతే పరువుపోతుందనీ నమ్మేవారు కనుక మూతముప్పిడి వ్యవహారాలు నడిచేవి. కాలం మారింది. స్త్రీల మీద లైంగికహింస తగ్గకపోయినా, కనీసం అత్యాచారాన్ని ఎలా చూడాలన్న దృష్టికోణంలో కొన్ని మార్పులయితే వచ్చాయి. అత్యాచారానికి గురైన ఆ విదేశీ మహిళ కూడా, 'వారు నన్ను చంపకుండా వదిలి పెట్టారు. థాంక్ గాడ్ అన్నది. దాడికి గురైన వాస్తవం తప్ప ఇందులో పరువు గోల లేదు.

భారతదేశంలో విదేశీ స్త్రీలకే కాదు, స్వదేశీ స్త్రీలకి కూడా రక్షణ లేకపోవడం వాస్తవం. ఇటువంటి వర్తమానం ఉన్నచోట భారత మహిళల భద్రత కన్నా దేశపరువు గురించి ఆలోచించే రేఖా శర్మ లాంటివారు 'కొత్త స్త్రీలు'. వీరు మహిళలని మధ్యయుగాలకి నడిపించుకు వెళ్లగల సమర్థులు.

ఈ ఘటన అటవీప్రాంతంలో జరిగింది. లైంగికంగా వేధించడం, అత్యాచారం చేయడం వంటి హింసాపద్ధతులని ప్రేరేపించే బైటి ప్రభావాలకి అక్కడ ఆస్కారం తక్కువ. అటువంటిది మారుమూల ప్రాంతాల్లోకి కూడా కల్చరల్ పొల్యూషన్ వ్యాపించడమనేది జాగ్రత్త పడాల్సిన విషయం. ఈ ఘటనలో ముగ్గురిని అరెస్ట్ చేసి స్టేషన్ కి తీసుకువచ్చి, వారిని చూపించిన తీరుని బట్టి నిందితులు బహుశా స్థానికులు, అట్టడుగువర్గాల వారయ్యే అవకాశం ఉంది. బాధితురాలు విదేశీ మహిళ, అందునా ధైర్యంగా రిపోర్ట్ చేసిన మహిళ అని సంకోచం ఉన్నట్లుంది గానీ లేకపోతే ఈపాటికే 'ఎన్‌కౌంటర్ న్యాయం' డిమాండ్ ఎల్లెడలా వూపు అందుకునేదే. నేరానికి కూడా కులమూ, వర్గమూ ఉంటుంది కనుక, అనువుగా దొరికే నేరస్థుల విషయంలో నేరాన్ని మించిన శిక్షలను విధించి ప్రజాగ్రహాన్ని చల్లార్చే ప్రయత్నం చేస్తారు కనుక, నిందితుల నేరానికి తగినశిక్ష మాత్రమే పడాలన్న మాటని పదేపదే ఇపుడు గుర్తు చేసుకోవాలి.

వ్యాసకర్త ప్రరవే (ఏపీ శాఖ) కార్యదర్శి



నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

త్యాగాలు, కష్టాలు – స్త్రీల పరిస్థితి



రావి ప్రతిభారెడ్డి

స్వాతంత్ర్య పోరాటంలో ఖమ్మం జిల్లా కేంద్రానికి వచ్చిన మహాత్మాగాంధీకి రావి నారాయణరెడ్డి సతీమణి రావి సీతాదేవి తన నగలన్నీ స్వరాజ్య ఉద్యమానికి ఇచ్చేసిన త్యాగం ఒక వైపు ఉంటే... అదే రావి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణా రైతాంగం సాయుధులై పోరాడుతున్న సమయాల్లో అదే సీతాదేవి సాయుధ దళాలకు వంట వార్పు చేసి చేయూతనిచ్చింది. ఇలా రావి సీతాదేవి ఒక్కరే కాదు... ఆనాడు అనేక మంది మహిళలు దేశ స్వాతంత్ర్యం కోసం, తెలంగాణాలో భూర్జువా పాలన కుప్పకూలడం కోసం ఎవరి స్థాయిలో వారు ఎదురొడ్డి పోరాడారు. ఆపై జరిగిన ప్రతి ప్రజా పోరాటాల్లో మహిళల త్యాగాలు ఎన్నో. అయినా మహిళలు తమకు న్యాయంగా రావాల్సిన హక్కులు, అధికారాల విషయంలో ఇప్పటికీ అడుక్కోవాల్సిన పరిస్థితే ఉంది. పనికి సమానవేతనం దక్కకపోవటం, అన్ని అర్హతలున్నా పురుషులతో సమానంగా అవకాశాలు ఇవ్వకపోవడం రూపంలో లింగ వివక్ష కొనసాగుతూనే ఉంది. పని ప్రదేశాల్లో భద్రత కల్పించడంలోనూ, పనికి అనుకూలమైన వాతావరణం పెంపొందించటంలోనూ వెనకబడే ఉన్నాము.


సమాజ వైవిధ్యాన్ని ప్రతిబింబించే సమ్మిళిత నాయకత్వ ఆవశ్యకత కోసం, నిర్ణయాత్మక పాత్రలలో స్త్రీ ప్రాతినిధ్యాన్ని పెంచాలన్న నినాదం ఇంకా నిజం కావాల్సే ఉంది. రాజకీయాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో గట్టెక్కినా... అది వచ్చేందుకు ఇంకో ఐదేళ్ల సమయం పట్టనుంది. ఇప్పటికే స్థానిక సంస్థల్లో మహిళల కోటా అమలవుతున్నా, చాలా చోట్ల భార్యల స్థానే భర్తల పెత్తనం సాగుతూనే ఉంది. ఆ దిశగా చట్ట సభల్లోనూ బహునాయకత్వం పునరావృతం కాకుండా, మహిళల స్వయం నిర్ణయాధికారం దిశగా అన్ని స్థాయిల్లో కార్యాచరణ మొదలు కావాల్సి ఉంది.

స్త్రీ నిర్ణాయక శక్తిగా మారాలంటే చదువు ముఖ్యం. చదువు కావాలంటే ఆర్థిక భారం తప్పనిసరి. దీంతో అట్టడుగు వర్గాల్లో అమ్మాయిని చదువు మాన్పించి పనులకు పంపటం ఇంకా సాగుతూనే ఉంది. ఉదాహరణకు తెలంగాణలో నారాయణ పేట జిల్లా మహిళల అక్షరాస్యత లెక్కలే ఇందుకు నిదర్శనం. ఇక్కడ పనికి వెళ్లే బాలికల సంఖ్య దేశంలోనే ఎక్కువగా ఉండటం విచారకరం. ఒక్క నారాయణ పేటలోనే కాదు, పేదరికం ఉన్న అన్ని ప్రాంతాల్లో పాఠశాల చదువు మధ్యలో మానేస్తున్న బాలికల సంఖ్య భారీగా ఉంటోంది. దీంతో ప్రతి అమ్మాయి కలలు, ఆకాంక్షలకు భిన్నంగా వాళ్ల జీవితాలు దారి మళ్లుతున్నాయి.

ఇక మహిళలపై నేరాల విషయానికి వస్తే, బాధితుల సంఖ్య ఏటేటా పెరుగుతూనే ఉంది. మహిళ ఇంటినుంచే బయటకు వస్తే ముంచుకొచ్చే ఆపద, ఇప్పుడు ఇంట్లో ఉన్నా సోషల్ మీడియా రూపంలో ఆమెను బజారుపాలు చేస్తోంది. మహిళలపై జరిగే సైబర్ నేరాలు, ఇతర నేరాల విషయంలో ప్రత్యేక కోర్టులు పెట్టి త్వరితగతిన విచారణలు నడిపి నిందితులకు శిక్ష, బాధితులకు ఊరట నివ్వాలన్న కార్యాచరణ సైతం అమలు కావటం లేదు. ఇలా ఒక్కటా, రెండా... అన్నింటా మహిళలకు ఆశించిన రక్షణ, మద్దతు ఇంకా అందని ద్రాక్షగానే ఉంది. వారి త్యాగాలు, కష్టాలకు తగిన గుర్తింపు రావటమే లేదు. ప్రపంచంలోని అనేక దేశాలు సమాన అవకాశాలు కల్పిస్తూ సమగ్రమైన, సాధికారికత కలిగిన సమాజం దిశగా ముందుకువెళుతున్న డిజిటల్ యుగంలో భారత దేశంలోనూ మహిళలకు కొత్త శకం ప్రారంభించే దిశగా నిజమైన కసరత్తు జరగాలి. అందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజునే మరో అడుగు ముందుకు పడాలి.

వ్యాసకర్త తెలంగాణా రైతాంగ అమరవీరుల ట్రస్ట్ సభ్యురాలు

సాధారణ మహిళలు సృష్టించిన చరిత్ర



మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 2024లో స్త్రీ పురుష సమానత్వం కోసం పెట్టుబడిని పెట్టమని పిలుపునిచ్చింది ఐక్యరాజ్యసమితి. నినాదాలు ఎంత గొప్పగా ఉన్నా ఆచరణ ఉంటేనే మార్పు వస్తుంది.

సాధారణ మహిళలు సృష్టించిన అసమాన్య చరిత్ర మహిళా దినోత్సవానికి నాంది పలికింది. పారిశ్రామికీకరణ మొదట్లో 19వ శతాబ్దం ఆరంభంలో ఇటలీ, ఇంగ్లాండ్, పోలండ్, రష్యా వంటి వివిధ దేశాల నుండి అమెరికాకు వలస వచ్చినవారు పరిశ్రమలలో పని చేస్తుండేవారు. కనీస సౌకర్యాలు లేకుండానే అతి తక్కువ వేతనంతో రోజుకు 15 గంటలు పని చేస్తుండేవారు. యూనియన్ చేసే సమ్మెలలో కూడా మగవారి డిమాండ్లనే పరిష్కరించేవారు. దీనితో 1820ల కాలంలోనే మహిళలు యూనియన్లుగా సంఘటితమవడం మొదలు పెట్టారు. 1857 మార్చి 8న పెద్ద సంఖ్యలో మహిళలు కవాతు చేశారు. పది గంటల పనిదినం, పురుషులతో సమాన హక్కులు, కనీస సౌకర్యాలను డిమాండ్ చేశారు. పోలీసుల లాఠీచార్జిని, కిరాయి రౌడీల దౌర్జన్యాన్ని ఎదుర్కొన్నారు.

1900లో అంతర్జాతీయ మహిళా దుస్తుల శ్రామిక యూనియన్ ఏర్పడి మార్చి 8న మరిన్ని నిరసన ప్రదర్శనలు జరిగాయి. 1908లో 1857 నాటి మార్చి 8 నిరసనను గుర్తు చేసుకుంటూ... పని గంటల తగ్గింపు, మెరుగైన పని పరిస్థితులు, సమాన హక్కులతో పాటు చైల్డ్ లేబర్‌ను నిషేధించాలని ప్రదర్శన చేశారు. 1909లో 20వేల మందితో సుదీర్ఘకాలం పాటు సమ్మె చేశారు. సమ్మె పాక్షికంగా విజయం సాధించింది. కానీ చదువురాని మహిళలు ఏమి చేయలేరని భావనను ఇది సవాలు చేసింది. వారిలో ఆత్మగౌరవాన్నీ, శక్తినీ నింపింది. ఇదే కాలంలో అమెరికా సోషలిస్టుల మద్దతు వీరికి లభించింది. ఈ పోరాటాలను పరిశీలిస్తూ ఎంతో స్ఫూర్తి పొందిన జర్మన్ కమ్యూనిస్టు నాయకురాలు క్లారా జెట్కిన్ ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్టమైన రోజున ప్రపంచవ్యాప్తంగా మహిళలు తమ డిమాండ్ల కోసం ఒత్తిడి తెచ్చేందుకు కేంద్రీకరించాలని 1910లో 'కోపెన్ హెగెన్'లో జరిగిన రెండవ కాన్ఫరెన్స్‌లో ప్రతిపాదించింది. 17 దేశాలకు చెందిన 100 మంది మహిళా ప్రతినిధులు దీనిని ఏక గ్రీవంగా ఆమోదించారు. అప్పటినుంచి సోషలిస్టు పార్టీ పిలుపునందుకొని మరిన్ని దేశాలలో మార్చి 8న మహిళా సమస్యలపై నిరసన కార్యక్రమాలు జరిగాయి.

1912లో గౌరవప్రదమైన జీవితం కోసం 'మాకు రొట్టెలే కాదు గులాబీలు కావాలి' అంటూ ప్ల కార్డ్స్ పట్టుకొని ప్రదర్శన చేశారు. 'బ్రెడ్ అండ్ రోజెస్' పాట మార్చి 8 కవాతు గీతం అయింది. 1917లో రొట్టె, శాంతి కోసం డిమాండ్ చేస్తూ జరిపిన మహిళా దినం రష్యా విప్లవాన్ని ఒక మలుపు తిప్పింది. సోషలిస్టు దేశాలలో మొదటగా ఈ డిమాండ్లను పరిష్కరిస్తూ మార్చి 8న సెలవు దినంగా ప్రకటించారు. 1975లో ఐక్యరాజ్యసమితి మార్చి 8ని 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'గా జరపాలని ప్రకటించింది.

శ్రామిక మహిళలు చేసిన పోరాట ఫలితాలు ఆఫీసుల్లో పనిచేసే కొద్ది మంది మహిళలకే దక్కాయి. రాజకీయ పార్టీలు మహిళలను ఓటుబ్యాంకుగా మాత్రమే చూస్తూ ఎన్నికల ముందు వాగ్దానాలు చేసి తర్వాత మరచిపోతున్నాయి. తమ సమస్యలపై ప్రశ్నిస్తూ మార్చి 8 స్ఫూర్తితో పోరాడితేనే మహిళల జీవితాలలో మార్పు వస్తుంది.

– రాధ, చైతన్య మహిళా సంఘం

ఇన్ బాక్స్

బేటీకి రక్షణ ఏది?

దేశంలో 'బేటీ బచావో, బడావో' నినాదం వట్టి మాట అయిపోయింది. అందుకు విరుద్ధంగా నానాటికీ ముక్కుపచ్చలారని ఆడపిల్లలు, మహిళలపై అకృత్యాలు పెరిగిపోతున్నాయి. ఎన్సీఆర్బీ రిపోర్ట్ ప్రకారం 2019 లో దేశంలో మహిళలపై అత్యాచారాలూ, ఇతర దాష్టీకాలు 4,05,861 జరిగాయి. ప్రతి రోజూ సగటున 66 అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసినా నిందితులకు కేస్‌లలో శిక్షలు పడింది తక్కువే. 2017లో నమోదైన కేసులలో కేవలం 24 శాతం కేసుల్లో మాత్రమే శిక్షలు పడ్డాయి. నేషనల్ కమిషన్ ఫర్ విమెన్ (ఎన్‌సీడబ్ల్యూ) ప్రకారం 2021లో మహిళలపై జరిగిన నేరాలపై వచ్చిన ఫిర్యాదులు 2020లో ఉన్న వాటితో పోలిస్తే 46 శాతం ఎక్కువ అని తేలింది. 2024 ఫిబ్రవరి దాక చూసినా నానాటికీ స్త్రీలపై అకృత్యాలు పెరుగుతున్న సత్యం స్పష్టమయ్యింది. చాలా సంఘటనలు రిపోర్ట్ కూడా కావడం లేదు. ఉత్తరప్రదేశ్, ఢిల్లీలు ఈ అకృత్యాల్లో అగ్రభాగాన ఉన్నాయి. ఇక్కడ నేరం చేస్తున్న వారిలో 80 శాతం మందికి ఏదో ఒక రాజకీయ పార్టీ అండ దండలు ఉండడం, ఈ కారణంగా పోలీసులు వారికి మద్దతుగా నిలవడంతో కోర్టులో కేసులు వీగిపోతున్నాయి.

షాహీన్ భాగ్ పోరాటం, మహిళా రెజిలర్లపై బీజేపీ ఎంపీ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా సాగిన పోరు, బిల్కిస్ బానో న్యాయ పోరాటం వంటి వాటి స్ఫూర్తితో ఎక్కడికక్కడ మహిళలు తమకు జరిగిన అన్యాయాలకు వ్యతిరేకంగా తామే ఉద్యమించాలి. వీరికి పురోగామి పురుషులు మద్దతుగా నిలిచి ఆత్మస్థయిర్యాన్ని కలిగించాలి.

తమపై జరిగే అమానవీయ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టడం, నేరస్థులకు శిక్షపడేలా చేయడం వంటివి మహిళా ఉద్యమాల లక్ష్యాల్లో కొన్ని మాత్రమే. నిజానికి ఇలా అకృత్యాలూ, దాడులూ జరగడానికి మహిళను పురుషునితో సమానంగా చూడలేని సంప్రదాయ భారతీయ సమాజంలోని అసమ భావమే కారణం. అందుకే మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో పురుషులతో సమానంగా అవకాశాలు పొందడానికి పోరాటాలు చేయాలి. అవి ఫలించిననాడే మహిళా దినోత్సవ స్ఫూర్తి వెల్లివిరిసినట్టు లెక్క.

– ఎమ్.డి. మునీర్, సీనియర్ జర్నలిస్ట్

పోరాడి గెలిచిన వనితలు



డా॥ నాగసూరి వేణుగోపాల్

విజ్ఞాన శాస్త్ర రంగాల్లో మహిళల భాగస్వామ్యం ఎంత ఉంది అనే ఆలోచన కొత్తది కాదు! మన భారతదేశం వరకు తీసుకుంటే... సైన్సు, టెక్నాలజీ, ఇంజనీరింగ్ వంటి రంగాల్లో విశేష ప్రతిభ కనపరచినవారికి కేంద్రప్రభుత్వం ఇచ్చే 'పద్మ' పురస్కారాలు పొందిన మహిళలు ఆరు దశాబ్దాల కాలంలో సుమారు మూడు శాతం ఉన్నారు. అదే వైద్య రంగానికి వచ్చేటప్పటికి సుమారు 8 శాతం దాకా ఉన్నారు. మరి ప్రపంచ స్థాయిలో పరిస్థితి ఎలా ఉంది? సైన్స్, మెడిసిన్ వంటి రంగాల్లో నోబెల్ బహుమతి పొందిన మహిళలు ఎంతమంది ఉంటారు? మొదటి 12 దశాబ్దాల కాలాన్ని పరిశీలిస్తే వారు సుమారు మూడు శాతాన్ని మించలేదు.

సైన్సు, ఇంజనీరింగ్, టెక్నాలజీ రంగాల కంటే ముందు మెడిసిన్‌కు సంబంధించిన విజ్ఞాన శాస్త్రం విచ్చుకున్నది. భారతదేశపు వైద్య రంగానికి సంబంధించి మద్రాస్ మెడికల్ కాలేజీ చాలా ప్రతిష్ఠాత్మకమైన పాత్రను మొదటి నుంచి పోషించింది. మొట్టమొదటి మూడు సంవత్సరాల ఎల్ఎంఎస్ (లైసెన్షియేట్ మెడిసిన్ అండ్ సర్జరీ) కోర్సులో నలుగురు ఉత్తీర్ణులయ్యారు. అందులో మేరీ స్కార్లీబ్ అనే విదేశీమహిళ కూడా క్వాలిఫై అయ్యారు. అప్పటి నుంచి మన భారతీయ మహిళలు మనదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ వైద్యులుగా డిగ్రీలు పొందుతూ ఆ వృత్తిలో రాణిస్తూ వచ్చారు. 1886లో కాదంబిని గంగూలీ కలకత్తా మెడికల్ కాలేజీలో తొలి వైద్య పట్టా పొందారు. అదే సంవత్సరం ఆనందీబాయి జోషి గ్రాడ్యుయేట్ ఇన్ మెడిసిన్ డిగ్రీని అమెరికాలోని ఫిలడెల్ఫియాలోని 'ఉమెన్స్ మెడికల్ కాలేజీ' నుంచి పొందారు. ఇక వైద్యశాస్త్రంలో ఎమ్‌డీ పట్టా విషయానికి వస్తే 1892లో 'పెన్సిల్వేనియా ఉమెన్స్ మెడికల్ కాలేజ్' నుంచి గురుభాయ్ కర్మార్కర్ అనే మహిళ; తర్వాత రెండేళ్లకు అంటే 1894లో 'లండన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ఫర్ వుమెన్' నుంచి రుక్మాబాయి పొందారు.

వీరి జీవితాలను పరిశీలిస్తే ఒక్కొక్కరిది ఒక్కో పోరాటంతో కూడిన విషాద గీతిక! కాదంబినీ గంగూలీ కోర్సు 1886లో పూర్తిచేసినా పట్టా చేతికి రాలేదు. మెడిసిన్‌లో ఆమె ఫెయిల్ అయ్యింది. దానికి కారణం ఏంటంటే ప్రొఫెసర్ ఆర్.సి. చంద్ర అనే అధ్యాపకుడికి మహిళా విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వడమే ఇష్టం లేదు కనుక.

ఆనందీబాయి విషయం ఇంకో రకంగా ఉంది. ఆమె 14వ ఏటా తల్లి అయింది, కానీ ఆ పసికందు సరైన వైద్య సదుపాయం లేక బతికి బట్టకట్టలేదు. ఇటువంటి పరిస్థితి తమ గ్రామంలో మరే మహిళకు కూడా ఎదురు కాకూడదు అనే పట్టుదలతో తన భర్త ప్రోత్సాహంతో అమెరికాలోని పెన్సిల్వేనియా ఉమెన్స్ మెడికల్ కాలేజీలో 1886లో వైద్య పట్టాను పొంది, భారతదేశం తిరిగి వచ్చారు. కొల్హాపూర్ సంస్థానంలో రెసిడెంట్ డాక్టర్‌గా ఉద్యోగంలో చేరక ముందే 1887లో క్షయతో కన్నుమూశారు.

రుక్మాబాయి పరిస్థితి మరోలా ఉంది. 11 ఏళ్ళకే ఆమెకు 20 ఏళ్ల దాదాజి భికాజితో పెళ్లయింది. ఆమె భర్త పేదవాడు, విద్యాగంధం ఎరుగనివాడు. పెళ్ళినాటికి అంగీకారానికి వచ్చిన విషయం ఏంటంటే ఆ భర్త చదువుకొని యోగ్యుడై రుక్మాబాయిని అత్తవారింటికి తీసుకువెళ్లాలని. అయితే రుక్మాబాయి రజస్వలయ్యేటప్పటికి దాదాజికి విద్య మీద పూర్తిగా ఆసక్తి లేకుండా పోయింది. రుక్మాబాయి అత్తవారింటికి వెళ్లడానికి తిరస్కరించడం, తద్వారా ఆ రెండు కుటుంబాల మధ్య ఇది ఒక తగాదా గానూ, సమస్యగానూ మారింది. ఆమె లండన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లో 1884లో పట్టా పొందడమే కాకుండా, తర్వాత బ్రెస్సల్స్ నుంచి ఎమ్‌డీ కూడా పొంది వైద్య వృత్తిలో రాణించింది.



రుక్మాబాయి



అసిమా ఛటర్జీ



జానకి అమ్మాళ్



కమలా సోహోని

ఇక సైన్సు, ఇంజనీరింగ్, టెక్నాలజీ వంటి కోర్సుల్లో మహిళల ప్రవేశం సంగతికొస్తే... మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాలలో బాటనిలో బీఎస్సీ పట్టాను 1921లో జానకి అమ్మాళ్ పొందారు. తర్వాత 10 ఏళ్లకు 1931లో ఆమె అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మిచిగాన్‌లో డీఎస్సీ పొందారు. ఇక బొంబాయి యూనివర్సిటీలో బీఎస్సీ పట్టాను 1933లో కమలా సోహోని; యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ నుంచి రాధా పంత్ 1934లో బీఎస్సీ పట్టా పొందారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ తొలి ఫెలో జానకి అమ్మాళ్. బీఎస్సీ కెమిస్ట్రీ పట్టా పొందిన తొలి భారతీయ మహిళ అసిమా ఛటర్జీ. తొలి పీహెచ్‌డీ పొందిన మహిళ కమలా సోహోని.

ఇంకా విజ్ఞాన శాస్త్ర రంగాల్లో మన దేశంలో మొట్టమొదటి అధ్యాపకుల విషయానికొస్తే రాధా పంత్ 1945లో తొలి ఫ్యాకల్టీ మెంబర్ అయ్యారు. రాజేశ్వరి ఛటర్జీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో యూనివర్సిటీ ఎమ్మెస్ పట్టా పొందిన తొలి మహిళ. సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) సంస్థ నుంచి అవార్డు పొందిన తొలి మహిళ అసిమా ఛటర్జీ.

అయితే మనం అనుకున్నంత సులువుగా వీళ్లంతా ఈ ప్రత్యేకతలు గడించలేదు. ఆ నేపథ్యం చూడాలంటే వారి జీవన పోరాట పథాలను పరిశీలించాలి!

వ్యాసకర్త ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

మొబైల్: 94407 32392

ఇటు చూడండి

ప్రశ్న ఆమే
జవాబూ ఆమే!
ఈ పితృస్వామ్య లోకంలో
పట్టలేని ఆశాజీవులను
కని పెంచాల్సిన తల్లీ ఆమే!
అడుగులకు మడుగులొత్తకున్నా
అందలాలెక్కించకున్నా
అందరూ సమానమనే
ఇంగితాన్ని నేర్పని సమాజానికి
తరగని సవాల్ కూడా ఆమే!

– డాక్టర్ కొండపల్లి నీహారిణి



ఆమె...

ప్రపంచంలో
ప్రేమ పలు రూపాల్లో పలు పాత్రల్లో
కనిపించే బలమైన బంధం
ప్రతి ఒక్కరి బతుకులో
కొండంత గొప్పగా
ఊహించని ఆధారం
కోరని వరంగా కురిసే ఆనందం
అమ్మ, అక్క, చెల్లి, భార్య
పాత్ర ఏదైనా జీవితంలో
ఘనమైన ప్రేమకు 'ఆమె' నిజరూపం.

– శ్రీ సాహితి

పర్యాటకరంగ అభివృద్ధికి కృషి చేస్తాం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- బల్కంపేట ఎల్లమ్మ ఆలయ కల్యాణ మండపం, భువనగిరి కోట అభివృద్ధి పనులకు వర్చువల్‌గా ప్రధాని మోదీ శంకుస్థాపన


బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం కల్యాణమండపం పునరుద్ధరణ పనుల కార్యక్రమంలో కిషన్‌రెడ్డి, జూపల్లి

అమీర్‌పేట (హైదరాబాద్)/సాక్షి, యాదాద్రి: దేశవ్యాప్తంగా పర్యాటకరంగ అభివృద్ధికి కేంద్రం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. పర్యాటక శాఖ ప్రసాద పథకం ద్వారా రూ.4.40 కోట్లతో బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం కల్యాణమండపం పునరుద్ధరణ పనులను గురువారం ప్రధాని నరేంద్ర మోదీ పర్చువల్‌గా ప్రారంభించారు. అలాగే భువనగిరి కోట మొదటి దశ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ దేవాలయం పనుల కార్యక్రమానికి హాజరైన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం కోసమే నిధులు మంజూరు చేశామని తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి గుట్టను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దడానికి ట్రెక్కింగ్, సైక్లింగ్, సీసీటీవీల ఏర్పాటుకు రూ.38 కోట్లు ఇస్తామని మోదీ ప్రకటించారని చెప్పారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ పర్యాట శాఖ రూ.137.75 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించడంపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున ధన్య వాదాలు తెలియజేస్తున్నామన్నారు.

భువనగిరి కోట అభివృద్ధికి రూ.118 కోట్లు

స్వదేశీ దర్శన్ 2.0 కార్యక్రమంలో భాగంగా భువనగిరి కోట అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.118 కోట్లు కేటాయించింది. ఇందులో మొదటి దశగా రూ.69 కోట్లతో పనులు చేపట్టనున్నారు. రోప్ వే, రోడ్లు, పార్కింగ్ వసతులు, ప్రారంభ ద్వారం, పర్యాటకులకు వసతులు, హరితవనాలు, విశ్రాంతి భవనాలు, సౌండ్ లైటింగ్ పనులు చేస్తారు. యాదాద్రి కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై ప్రధాని మోదీ ప్రసంగాన్ని నాయకులు, అధికారులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే, టూరిజం శాఖ మేనేజర్ ఎం.ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ రిఫండింగ్‌లో రూ.25.63 కోట్ల గోల్ మాల్

సాక్షి, హైదరాబాద్: అక్రమంగా జీఎస్టీ రిఫండ్‌ను పొందడానికి కొందరు వ్యక్తులు మూడు కంపెనీలను నెలకొల్పి రూ.రూ.25.63 కోట్లను కొల్లగొట్టినట్టు వాణిజ్య పనుల శాఖ నిర్వహించిన డెస్క్ ఆడిటింగ్‌లో వెలుగు చూసింది. అక్రమార్కులపై తదుపరి చర్యల కోసం సమాచారాన్ని మాదాపూర్ డివిజన్ జాయింట్ కమిషనర్‌కు పంపించినట్టు వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టీకే శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నాస్కాన్ అసోసియేట్స్ రూ.5.56 కోట్లు, నాస్కామ్ సాఫ్ట్ సొల్యూషన్స్ రూ.14.02 కోట్లు, సిమెట్రిక్స్ (ఐటీ) సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.6.05 కోట్ల జీఎస్టీ రిఫండ్ పొందినట్టు ఆడిట్లో తేలింది. రిఫండ్‌ల పరిశీలనలో.. నాస్కాన్ సాఫ్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, సిమెట్రిక్స్ (ఐటీ) సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ల డైరెక్టర్లుగా రాజేష్ గుప్తా కోతా, శిల్పా బండా, నాస్కాన్ అసోసియేట్స్ డైరెక్టర్లుగా ప్రసేన్ కుమార్ పువ్వల, శిల్పా బండ ఉన్నట్టు తేలింది.

11నుంచి యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

- 21 వరకు నిర్వహణకు సన్నాహాలు


యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు ఉదయం 10 గంటలకు విశ్వక్సేన ఆరాధన, స్వస్తీవాచనంతో బ్రహ్మోత్సవాలకు ఆచార్యులు శ్రీకారం చుట్టనున్నారు. 21న బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

బ్రహ్మోత్సవాల షెడ్యూల్

- 11వ తేదీ ఉదయం విశ్వక్సేన ఆరాధన, స్వస్తీ వాచనం, రక్షాబంధనం, సాయంత్రం మృత్సం గ్రహణం, అంకురారోపణ
- 12న ఉదయం అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, సాయంత్రం భేరీపూజ, దేవతాహ్వానం, హవనం
- 13న అలంకార, వాహన సేవలు ప్రారంభం. ఉదయం మత్స్య అలంకారం, వేద పారాయణం, సాయంత్రం శేష వాహనం సేవ
- 14న ఉదయం వటపత్రశాయి అలంకార సేవ, రాత్రి హంస వాహన సేవ
- 15న ఉదయం శ్రీకృష్ణ (మురళీ కృష్ణుడు) అలంకారం, రాత్రి పొన్న వాహన సేవ
- 16న ఉదయం గోవర్ధనగిరిధారి అలంకారం, రాత్రి సింహ వాహన సేవ
- 17న ఉదయం జగన్మోహిన అలంకారం, రాత్రి స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం
- 18న శ్రీరామ అలంకారంలో హనుమంత వాహనంపై శ్రీస్వామివారి ఊరేగింపు.రాత్రి గజవాహన, శ్రీస్వామి, అమ్మవార్ల తిరు కల్యాణం నిర్వహిస్తారు.
- 19న ఉదయం శ్రీమహావిష్ణు అలంకార సేవ, గరుడ వాహనంసేవలో శ్రీస్వామి వారి ఊరేగింపు, రాత్రి దివ్య విమాన రథోత్సవం.
- 20న ఉదయం మహా పూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం, రాత్రి శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవాలు
- 21న ఉదయం అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి శ్రీస్వామి వారి శృంగార డోలోత్సవంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

బ్రహ్మోత్సవాల్లో రద్దుకానున్న సేవలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11నుంచి 21వ తేదీ వరకు శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలను రద్దు చేయనున్నారు. 17, 18, 19 తేదీల్లో అర్చనలు, భోగములు, 20, 21 తేదీల్లో అభిషేకాలు, అర్చనలు రద్దు చేయనున్నారు. 18వ తేదీన శ్రీస్వామి, అమ్మవారి తిరు కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులు రూ.3వేల టికెట్ కొనుగోలు చేసి సంప్రదాయ దుస్తుల్లో పాల్గొనాలని ఆలయ అధికారులు తెలిపారు.

మహా జాతర షురూ

- వేములవాడలో కనులపండువగా మహా శివరాత్రి వేడుకలు
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాల సమర్పణ
- వేలాదిగా తరలివస్తున్న భక్తులు


రాజన్నకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి వేడుకలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. టీటీడీ తరఫున ఆ ఆలయ అర్చకులు పట్టు వస్త్రాలను తీసుకొచ్చారు. ఉదయం నుంచే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తుల రాక మొదలైంది. ముఖ్యంగా నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. వచ్చిన వారంతా తమకు దొరికిన ఖాళీ స్థలంలో గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు రాజన్నను దర్శించుకుని, కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆర్జిత సేవలను రద్దు చేసి లఘు దర్శనాలకు మాత్రమే అనుమతించారు. రాజన్న గుడి చెరువులో రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శివార్చన కార్యక్రమంలో భాగంగా 1,500 మంది కళాకారులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జాతర ఏర్పాట్లను కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ గౌతమి, ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు. మూడు రోజులపాటు ఈ వేడుకలు కొనసాగనున్నాయి.

ప్రమాదంలో లౌకికత్వం

- బీజేపీ, కాంగ్రెస్ పార్టీలది బహిరంగ దోస్తీ: ఆర్‌ఎస్ ప్రవీణ్



కొల్లాపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో లౌకికత్వం ప్రమాదంలో పడిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. గురువారం కొల్లాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆయన బీఎస్పీ శ్రేణులతో సమావేశమై, పార్లమెంట్ ఎన్నికలపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ బహిరంగంగా దోస్తీ కొనసాగిస్తున్నాయన్నారు. ఈ రెండు పార్టీలు రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.ప్రధాని మోదీ ఓబీసీలకు చేసిందేమీ లేదన్నారు. బీఆర్‌ఎస్, బీఎస్పీ పొత్తును కొందరు నిందిస్తున్నారని.. తాము పొత్తు పెట్టుకోవడం సరైందో కాదో కాలమే చెబుతుందని అన్నారు. రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ఎన్నికల్లో విజయం కోసం పార్టీలు వ్యూహాలు మార్చుకోవడం సాధారణ విషయమన్నారు. కాగా, కాంగ్రెస్ పాలనలో వ్యక్తిగత, మతపరమైన స్వేచ్ఛ కరువవుతోందని ఆర్‌ఎస్పీ అన్నారు. మంత్రి కొండా సురేఖ తనను గూండా అని, బీఎస్పీని అసాంఘిక శక్తుల ముఠా అంటూ చేసిన వ్యాఖ్యల వెనుక సీఎం రేవంత్‌రెడ్డి హస్తముందని ఆరోపించారు.

20 రకాల సమాచారం ఇవ్వండి

- కాళేశ్వరంలోని 3 బ్యారేజీల వివరాలు కోరిన అయ్యర్ కమిటీ
- మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల పరిశీలన
- నేడు సుందిళ్ల బ్యారేజీని పరిశీలించనున్న కమిటీ


మేడిగడ్డ బ్యారేజీ ఫుట్‌పాత్‌వే పై నడుచుకుంటూ వెళ్తున్న ఎన్‌డీఎస్‌ఏ బృందం

సాక్షి, హైదరాబాద్/కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని తమకు అందజేయాలని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ రాష్ట్ర నీటిపారుదల శాఖను కోరింది. మొత్తం 20 రకాల సమాచారం కావాలని అడిగింది. మూడు బ్యారేజీల డిజైన్లు, వాటి నిర్మాణంపై అధ్యయనం జరిపి లోపాలను గుర్తించి పరిష్కారాలను సిఫారసు చేయడానికి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డతో పాటు అన్నారం బ్యారేజీలను సందర్శించి పరిశీలన జరిపింది. గతేడాది అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్ కుంగిపోవడంతో అప్పట్లో ఎన్డీఎస్ఏ నియమించిన మరో నిపుణుల కమిటీ, ఆ బ్లాక్‌కి సంబంధించిన 20 రకాల సమాచారాన్ని సమర్పించాలని అప్పట్లో రాష్ట్ర నీటిపారుదల శాఖను కోరింది. తాజాగా చంద్రశేఖర్ అయ్యర్ కమిటీ కూడా మూడు బ్యారేజీల్లోని అన్ని బ్లాకులకు సంబంధించిన అదే విధమైన 20 రకాల సమాచారాన్ని తమకు అందజేయాలని విజ్ఞప్తి చేసింది.

పగుళ్లు, పునాది పరిశీలన

అయ్యర్ నేతృత్వంలో సైంటిస్టులు యూసీ విద్యార్థి, ఆర్.పాటిల్, డైరెక్టర్లు శివకుమార్‌శర్మ, రాహుల్‌కుమార్, అమితాబ్ మీనాలతో కూడిన బృందం మేడిగడ్డను తనిఖీ చేసింది. బ్యారేజీ అప్ స్ట్రీమ్‌లోకి దిగి 6, 7, 8 బ్లాక్‌లను నిశితంగా పరిశీలించింది. డౌన్ స్ట్రీమ్‌లోకి కూడా కాలినడకన వెళ్లి బ్యారేజీ కుంగిన తీరు, పగుళ్లు, పునాది ఎలా ఉందీ చూసింది. కుంగినప్పటి నుంచి ఎలాంటి పరీక్షలు జరిపారు, ఇప్పటివరకు చేపట్టిన చర్యలు అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు జరిగిన తనిఖీల్లో సీఈ సుధాకర్‌రెడ్డి, ఇతర ఇంజినీర్లు, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు పాల్గొన్నారు. అయితే మీడియా ప్రతినిధులను బ్యారేజీ లోపలికి అనుమతించ లేదు. కాగా నేడు సుందిళ్ల బ్యారేజీని కమిటీ సందర్శించనుంది.

ఎట్టకేలకు 'జియో' సెక్షనల్ డ్రాయింగ్స్

మేడిగడ్డ బ్యారేజీ కింద భూగర్భంలో రాతి పొరల నిర్మాణ క్రమాన్ని తెలియజేసే 'జియోలాజికల్ సెక్షన్' డేటాను, ప్రత్యేకించి బ్యారేజీకి సంబంధించిన ఒక్కో విభాగానికి సంబంధించిన 'సెక్షనల్ డ్రాయింగ్స్'ను వేర్వేరుగా రాష్ట్ర ప్రభుత్వం సమర్పించడంపై గతంలో ఎన్డీఎస్ఏ తీవ్ర అభ్యంతరం తెలిపింది. లోతైన పరిశీలన కోసం జియోలాజికల్ వివరాలతో కూడిన బ్యారేజీ విభాగాల డ్రాయింగ్స్ (సెక్షనల్ డ్రాయింగ్స్)ను సమర్పించాలని కోరింది. అయితే ఇలాంటి డ్రాయింగ్స్‌ను తయారు చేయకుండానే బ్యారేజీని నిర్మించడంతో అప్పట్లో అధికారులు వాటిని సమర్పించలేకపోయారు. కానీ ఎన్డీఎస్ఏ పదేపదే కోరుతుండడంతో ఇటీవల జియోలాజికల్ వివరాలతో కూడిన సెక్షనల్ డ్రాయింగ్స్‌ను రూపొందించి ఎన్డీఎస్ఏకు నీటిపారుదల శాఖ పంపించింది.

ఆర్టికల్ 370 రద్దుతో ప్రజలకు స్వేచ్ఛ

జమ్మూకశ్మీర్ హాయిగా ఊపిరి పీల్చుకుంటోంది

- ఈ ఆర్టికల్‌పై కాంగ్రెస్ పార్టీ దేశాన్ని తప్పుదోవ పట్టించింది
- ప్రధాని మోదీ మండిపాటు
- జమ్మూకశ్మీర్‌లో రూ.5,000 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం



శ్రీనగర్: ఆర్టికల్ 370 రద్దు తర్వాత అభివృద్ధిలో జమ్మూకశ్మీర్ నూతన శిఖరాలకు చేరుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధికి అడ్డుగోడగా మారిన ఈ ఆర్టికల్‌ను రద్దు చేశాక ప్రజలకు స్వేచ్ఛ లభించిందని, జమ్మూకశ్మీర్ హాయిగా ఊపిరి పీల్చుకుంటోందని చెప్పారు. గురువారం జమ్మూకశ్మీర్‌లో మోదీ పర్యటించారు. దాదాపు రూ.5,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. వాటిని జాతికి అంకితం చేశారు. జమ్మూకశ్మీర్‌లో కొత్తగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 1,000 మంది యువతకు నియామక పత్రాలు అందజేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. వివిధ రంగాల్లో విజయాలు సాధించిన మహిళలు, రైతులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. 'చలో ఇండియా గ్లోబల్ డయాస్పోరా క్యాంపెయిన్', 'దేఖో అప్నా దేశ్ పీపుల్స్ చాయిస్ టూరిస్టు డెస్టినేషన్ పోల్' అనే రెండు నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం శ్రీనగర్‌లోని బక్షీ స్టేడియంలో 'వికసిత్ భారత్-వికసిత్ జమ్మూకశ్మీర్' బహిరంగ సభలో ప్రసంగించారు. ఆర్టికల్ 370పై కాంగ్రెస్ పార్టీ జమ్మూకశ్మీర్ ప్రజలనే కాకుండా మొత్తం దేశాన్ని తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ఈ ఆర్టికల్ రద్దయ్యాక జమ్మూకశ్మీర్ సంకెళ్లు తెగిపోయాయని అన్నారు. అద్భుతమైన శ్రీనగర్ ప్రజల్లో ఈరోజు తాను కూడా ఒకడినైనందుకు గర్వంగా ఉందని వ్యాఖ్యానించారు. ఈ రోజు తాను ప్రారంభించిన ప్రాజెక్టులు జమ్మూకశ్మీర్ ప్రగతిని మరింత వేగవంతం చేస్తాయని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారత్ అనే స్వప్నం సాకారం కావాలంటే జమ్మూకశ్మీర్ అభివృద్ధి చెందాలని స్పష్టం చేశారు. ఇక్కడి ప్రజలంతా తన కుటుంబ సభ్యులేనని చెప్పారు.

మీ కుటుంబ సభ్యులను పంపించండి

భారతదేశానికి కిరీటం లాంటి జమ్మూకశ్మీర్‌లో పర్యాటకం, వ్యవసాయ రంగాల్లో ప్రగతికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని మోదీ ఉద్ఘాటించారు. జమ్మూకశ్మీర్ కేవలం ఒక ప్రాంతం కాదని, ఇది మన దేశానికి శిరస్సు లాంటిదని చెప్పారు. తలెత్తుకొని నిలబడటం అభివృద్ధికి, గౌరవానికి గుర్తు అని పేర్కొన్నారు. ఈ ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. 'చలో ఇండియా' కార్యక్రమంలో భాగంగా ప్రవాస భారతీయులు తమ కుటుంబాల నుంచి కనీసం ఐదుగురిని జమ్మూకశ్మీర్ పర్యటనకు పంపించాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజలకు మోదీ మహాశివరాత్రి, రంజాన్ శుభాకాంక్షలు ముందస్తుగా తెలియజేశారు. 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేశాక ప్రధానమంత్రి కశ్మీర్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలపై ఆయన ఎలాంటి ప్రకటన చేయలేదు.



మోదీతో కశ్మీర్ యువకుడి సెల్ఫీ

జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాకు చెందిన యువకుడు నజీమ్ నజీర్ కల నెరవేరింది. సాక్షాత్తూ మోదీతో అతడు తన ఫోన్‌లో సెల్ఫీ తీసుకున్నాడు. అంతేకాదు నజీర్‌ను మోదీ తన స్నేహితుడిగా సంబోధించారు. గురువారం శ్రీనగర్‌లోని బక్షీ స్టేడియంలో ఈ సంఘటన జరిగింది. నజీర్ తేనెటీగల పెంపకం, తేనె వ్యాపారం చేస్తున్నాడు. మంచి లాభాలు ఆర్జిస్తున్నాడు. దీంతో ప్రధాని మోదీతో సమావేశమయ్యే అవకాశం లభించింది. నజీర్ గురించి తెలుసుకున్న మోదీ అతడిని అభినందించారు. మీతో సెల్ఫీ తీసుకోవాలని నజీర్ కోరగా మోదీ అంగీకరించారు. ఈ సెల్ఫీని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. మిత్రుడు నజీర్‌తో సెల్ఫీ దిగడం మరిచిపోలేని జ్ఞాపకం అని పేర్కొన్నారు. తేనె వ్యాపారంతో నజీర్ తీపి విప్లవం తీసుకొచ్చాడని ప్రశంసించారు.



జైలు నుంచి విడుదలయ్యాక భార్య వసంతతో మీడియా సమావేశంలో సాయిబాబా

ప్రాణాలతో బయటపడడం అద్భుతమే

జైలులో దుర్భర జీవితం అనుభవించా

- తప్పుడు కేసులో ఇరికించి అరెస్టు చేశారు
- ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా ఆవేదన
- నాగపూర్ సెంట్రల్ జైలు నుంచి విడుదల

నాగపూర్: జైలు నుంచి ప్రాణాలతో బయటపడతానని ఏనాడూ అనుకోలేదని ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా(54) చెప్పారు. సజీవంగా బయటకు రావడం నిజంగా అద్భుతమేనంటూ భావోద్వేగానికి గురయ్యారు. జైలులో శారీరకంగా, మానసికంగా ఎన్నో బాధలు అనుభవించానని చెప్పారు. అక్కడ జీవితం అత్యంత దుర్భరమని పేర్కొన్నారు. మావోలతో సంబంధాల కేసులో బాంబే హైకోర్టు సాయిబాబాను నిర్దోషిగా గుర్తిస్తూ మంగళవారం తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఆయన గురువారం నాగపూర్ సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. జైలు నుంచి చక్రాల కుర్చీలో బయటకు వచ్చారు. ఈశాన్య భారతదేశంలో గిరిజనుల హక్కుల కోసం పోరాడుతున్నందుకే తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. తప్పుడు కేసులో ఇరికించి అరెస్టు చేశారని సాయిబాబా అన్నారు.

జైలులోనే ప్రాణాలు పోతాయనుకున్నా..

''నా ఆరోగ్యం క్షీణించింది. ఎక్కువసేపు మాట్లాడలేకపోతున్నాను. మొదట చికిత్స తీసుకోవాలి. ఆ తర్వాతే మాట్లాడగలను. త్వరలో డాక్టర్లను కలిసి చికిత్స తీసుకుంటా. విలేకరులు, లాయర్లు కోరడం వల్లే ఇప్పుడు స్పందిస్తున్నా. జైలులో నాకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. అత్యంత కఠినమైన, దుర్భర జీవితం అనుభవించా. చక్రాల కుర్చీ నుంచి పైకి లేవలేకపోయా. ఇతరుల సాయం లేకుండా సొంతంగా టాయిలెట్‌కు కూడా వెళ్లలేని పరిస్థితి. ఇతరుల సాయం లేనిదే స్నానం కూడా చేయలేపోయా. జైలులోనే నా ప్రాణాలు పోతాయని అనుకున్నా. ఈరోజు నేను ఇలా ప్రాణాలతో జైలు నుంచి బయటకు రావడం అద్భుతమే చెప్పాలి. నాపై నమోదైన కేసులో సాక్ష్యాధారాలు లేవని ఉన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. చట్టప్రకారం ఈ కేసు చెల్లదని స్పష్టం చేసింది. నాకు న్యాయం చేకూర్చడానికి ఇంతకాలం ఎందుకు పట్టింది? నాతోపాటు నా సహచర నిందితులు పదేళ్ల విలువైన జీవితాన్ని కోల్పోయారు. ఈ జీవితాన్ని ఎవరు తిరిగి తీసుకొచ్చి ఇస్తారు? జైలుకు వెళ్లినప్పుడు ఆరోగ్యంగానే ఉన్నాను. అప్పుడు పోలియో మినహా ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవు. కానీ, ఇప్పుడు గుండె, కండరాలు, కాలేయ సంబంధిత వ్యాధుల బారినపడ్డాను. నా గుండె ప్రస్తుతం కేవలం 55 శాతం సామర్థ్యంతో పని చేస్తోంది. డాక్టర్లే ఈ విషయం చెప్పారు. నాకు పలు ఆపరేషన్లు, సర్జరీలు చేయాలని అన్నారు. కానీ, ఒక్కటి కూడా జరగలేదు. జైలులో సరైన వైద్యం అందించలేదు. పదేళ్లపాటు నాకు అన్యాయం జరిగింది. ఆశ ఒక్కటే నన్ను బతికించింది. ఇకపై బోధనా వృత్తిని కొనసాగిస్తా. బోధించకుండా నేను ఉండలేను'' అని ప్రొఫెసర్ సాయిబాబా స్పష్టం చేశారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తారా? అని మీడియా ప్రశ్నించగా, భారత రాజ్యాంగాన్ని 50 శాతం అమలు చేసినా సరే సమాజంలో అనుకున్న మార్పు వస్తుందని బదులిచ్చారు. సాయిబాబా సొంత ఊరు ఆంధ్రప్రదేశ్‌లోని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణం సమీపంలోని జనుపల్లె. ఆయన పాఠశాల, కళాశాల విద్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే కొనసాగింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్నత విద్య అభ్యసించిన ఆయన అక్కడే ప్రొఫెసర్ అయ్యారు.

మణిపూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగించినప్పుడు

బీజేపీ ఎక్కడుంది?

- హత్రాస్‌లో అత్యాచార బాధితురాల్ని తగలబెడితే ఏం చేశారు?
- బిల్కిస్ బానో ఉదంతంలో స్పందించరెందుకు ?
- మోదీ 'సందేశ్‌ఖాలీ' మాటలకు ధీటైన జవాబిచ్చిన దీదీ

కోల్‌కతా: 'సందేశ్‌ఖాలీ' తుపాను ధాటికి పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోతుందని, నారీశక్తి ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో టీఎంసీని గద్దె దింపుతుందని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధీటైన జవాబిచ్చారు. రాష్ట్రంలో మహిళలకు తమ ప్రభుత్వం అండగా నిలబడిందని పునరుద్ఘాటించారు. దేశంలోనే మహిళలకు అత్యంత భద్రమైన రాష్ట్రం తమదేనని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒకరోజు ముందే గురువారం కోల్‌కతాలో 'మహిళా హక్కులే మాకు ముఖ్యం' పేరిట చేపట్టిన పాదయాత్రలో మమత ముందు నడిచారు. ఆమెను వందలాది మంది మహిళలు, పార్టీ కార్యకర్తలు అనుసరించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ బీజేపీపాలిత రాష్ట్రాల్లో మహిళలపై జరిగిన అకృత్యాలపై మమత విమర్శలు ఎక్కుపెట్టారు. ''సందేశ్‌ఖాలీపై బీజేపీ దేశానికి తప్పుడు సందేశాలు పంపుతోంది. బెంగాల్‌లో మహిళలకు రక్షణ లేదంటూ నిన్న ఇక్కడికొచ్చి లెక్చర్లు దంచేసిన మోదీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలు అకృత్యాలకు బలైనప్పుడు ఎందుకు మౌనం వహించారు?'' అని నిలదీశారు. ''మణిపూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగించినపుడు ఈ బీజేపీ ఏం చేసింది?. ఉత్తరప్రదేశ్ హత్రాస్‌లో అత్యాచారం చేసి మృతదేహాన్ని బలవంతంగా తగలబెడితే బీజేపీ సర్కార్ ఏం చేసింది?. గుజరాత్‌లో సర్వం కోల్పోయిన బిల్కిస్ బానోకు దక్కిన న్యాయమెంత?'' అని ప్రశ్నించారు. 'నిజానికి దేశంలో మహిళలకు అత్యంత భద్రమైన రాష్ట్రం బెంగాల్' అని ప్రకటించారు.

ఎక్కడ పోటీచేసినా ఓడిస్తాం

గురువారం బీజేపీలో చేరిన కలకత్తా హైకోర్టు మాజీ జడ్జి అభిజిత్ గంగోపాధ్యాయ్‌నూ మమత విమర్శించారు. '' తన తీర్పుల ద్వారా బెంగాల్‌లో వేలాది మంది యువత నుంచి ఉద్యోగాలు లాక్కున్నారు. వారు మిమ్మల్ని క్షమించరు. మీ తీర్పుల విశ్వసనీయతపై ఇప్పుడు సందేహాలు నెలకొన్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఏ నియోజకవర్గం నుంచి పోటీచేసినా సరే మిమ్మల్ని ఓడించి తీరతాం' అని అన్నారు. '' పింటూ బాబు(బీజేపీ) ఆగ్రహంతో ఊగిపోయినా సరే బెంగాల్‌లో మీ విభజన రాజకీయాలు నడవనివ్వను. బెంగాల్‌కు 450కిపైగా బృందాలను పంపిన పింటూ బాబు.. మహిళలను లైంగికంగా వేధించి నగ్నంగా ఊరేగించిన మణిపూర్‌కు ఒక్క బృందాన్ని కూడా పంపలేదు' అని మమత గుర్తుచేశారు. 'బీజేపీపాలిత యూపీలో మహిళలపై దారుణ అత్యాచారాలు జరుగుతున్నాయి. మణిపూర్‌లో మహిళలు రేప్‌కు గురై, అగ్నికి ఆహుతైన ఉదంతంలో అక్కడి బీజేపీ సర్కార్ సిగ్గుతో తలదించుకోవాలి' అని మమత ఆగ్రహం వ్యక్తంచేశారు. ' సందేశ్‌ఖాలీ ఘటనను తీవ్రంగా ఖండించాల్సిందే. టీఎంసీ కార్యకర్తలు బాధ్యులుగా తేలితే అరెస్ట్ చేసేందుకు ఏమాత్రం వెనుకాడను' అని ఆమె స్పష్టంచేశారు. పాదయాత్రలో సందేశ్‌ఖాలీ ప్రాంతానికి చెందిన 200కుపైగా మహిళలు పాల్గొన్నారు.



గురువారం కోల్‌కతాలో జరిగిన ర్యాలీలో సీఎం మమత

టీఎంసీలో చేరిన బీజేపీ ఎమ్మెల్యే

కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పశ్చిమబెంగాల్‌లో బీజేపీకి గట్టి దెబ్బ తగిలింది. కాషాయ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ముకుట్ మణి అధికారి గురువారం అధికార టీఎంసీలో చేరారు. నడియా జిల్లా రాణాఘాట్ దక్షిణ్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన అధికారి గురువారం కోల్‌కతాలో జరిగిన టీఎంసీ ర్యాలీలో సీఎం మమతా బెనర్జీతోపాటు పాల్గొన్నారు. సిట్టింగ్ ఎంపీ జగన్నాథ్ సర్కారుకే మళ్లీ రాణాఘాట్ టిక్కెట్ ఇవ్వాలన్న బీజేపీ అధిష్టానం నిర్ణయంపై అసంతృప్తితో పార్టీ మారారు. ప్రజల కోసమే పనిచేసే పార్టీ టీఎంసీ, అందుకే పార్టీలో చేరానని చెప్పారు. ముకుట్ మణి అధికారి తమ పార్టీలో చేరారని టీఎంసీ తెలిపింది. దీంతో, 2021లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాక టీఎంసీలో చేరిన బీజేపీల సంఖ్య ఎనిమిదికి చేరింది.

బీజేపీలోకి కేరళ కాంగ్రెస్ నేత

న్యూఢిల్లీ: కేరళ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ దిగ్గజ నేత కె.కరుణాకరన్ కుమార్తె పద్మజా వేణుగోపాల్ బీజేపీలో చేరారు. కాంగ్రెస్‌కు సమర్థవంతమైన నాయకత్వం లేదని ఈ సందర్భంగా ఆమె అన్నారు. బీజేపీ కేరళ ఇన్‌చార్జి, కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ సమక్షంలో ఆమె కాషాయ కండువా కప్పుకున్నారు. అనంతరం బీజేపీ నేతలతో పద్మజ మీడియాతో మాట్లాడారు. తన సమస్యలపై కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలకు వివరించేందుకు ఎన్నిసార్లు ప్రయత్నించినా కనీసం అపాయింట్‌మెంట్ కూడా దొరకలేదన్నా రు. గతంలో తన తండ్రి కురుణాకరన్ సైతం ఇలాంటి అనుభవాన్నే ఎదుర్కొన్నారని ఆమె తెలిపారు.

కేజ్రీవాల్‌కు మళ్లీ సమన్లు

న్యూఢిల్లీ: మద్యం విధానం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణకు రావాలంటూ ఈడీ పంపిన నోటీసులను పట్టించుకోని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు కోర్టు మరోసారి సమన్లు జారీ చేసింది. విచారణకు రావాలంటూ జనవరి 12, 31వ తేదీలతోపాటు ఫిబ్రవరి 14వ తేదీన పంపిన 4 నుంచి 8 వరకు సమన్లపై కేజ్రీవాల్ స్పందించలేదంటూ బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టులో పిటిషన్ వేసింది. విచారణ చేపట్టిన జడ్జి దివ్యా మల్హోత్రా ఈ నెల 16వ తేదీన తమ ఎదుట హాజరు కావాలంటూ కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ చేశారు.

బీజేపీలో చేరిన గంగోపాధ్యాయ్

కోల్‌కతా: కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి పదవికి రెండు రోజుల క్రితం రాజీనామా చేసిన జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ్ గురువారం కాషాయ కండువా కప్పుకున్నారు. కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ ప్రాంతంలో ఉన్న బీజేపీ కార్యాలయం వద్ద గంగోపాధ్యాయ్‌కు ఘన స్వాగతం లభించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ ఆయనకు బీజేపీ జెండా అందజేశారు. రాష్ట్రంలో టీఎంసీ పాలనను అంతం చేయడమే తమ లక్ష్యమని అభిజిత్ ఈ సందర్భంగా అన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు

డీఏ 4 శాతం పెంపు

పెన్షనర్లకు సైతం డీఆర్ మరో 4 శాతం ● 50 శాతానికి చేరిన డీఏ, డీఆర్



మంత్రి గోయల్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర మంత్రివర్గ సమావేశం గురువారం జరిగింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యాన్ని(డీఏ), పెన్షనర్లకు కరువు సహాయాన్ని(డీఆర్) బేసిక్ పే/పెన్షన్‌పై మరో 4 శాతం పెంచింది. ప్రస్తుతం డీఏ/డీఆర్ 46 శాతం ఉంది. తాజా పెంపుతో ఇది 50 శాతానికి చేరింది. పెంచిన భత్యం ఈ ఏడాది జనవరి 1 నుంచే అమల్లోకి వస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. దీనివల్ల కోటి మందికిపైగా ఉద్యోగులకు, పెన్షనర్లకు లబ్ధి చేకూరుతుందని తెలియజేసింది. ఉద్యోగులకు డీఏ అదనపు వాయిదా సొమ్ము, పెన్షనర్లకు కరువు సహాయం(డీఆర్) సొమ్ము ఈ ఏడాది జనవరి 1 నుంచి చెల్లించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ధరలు పెరగడంతో ఉద్యోగులకు, పెన్షనర్లకు డీఏను 50 శాతానికి పెంచినట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఈ పెంపు వల్ల ఖజానాపై ప్రతిఏటా రూ.12,869 కోట్ల భారం పడనుంది. 2024 జనవరి నుంచి 2025 ఫిబ్రవరి వరకు ప్రభుత్వం రూ.15,014 కోట్లు చెల్లించనుంది. డీఏ పెంపుతో ఉద్యోగులకు ఇతర భత్యాలు, గ్రాట్యుటీ సైతం పెరుగుతాయి. డీఏ/డీఆర్ కాకుండా ఇతర భత్యాల పెంపు కారణంగా ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.9,400 కోట్ల భారం పడుతుంది. ఏడో కేంద్ర వేతన కమిషన్ సిఫార్సుల ప్రకారమే డీఏ/డీఆర్‌ను కేంద్రం పెంచింది.

ఉజ్వల రాయితీ గడువు పెంపు

ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద పేద మహిళలకు వంట గ్యాస్ సిలిండర్లపై రూ.300 చొప్పున ఇస్తున్న రాయితీ గడువును కేంద్రం మరో ఏడాది పెంచింది. వాస్తవానికి ఈ గడువు ఈ ఏడాది మార్చి 31న ముగియనుంది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే 2024–25 ఆర్థిక సంవత్సరంలోనూ రాయితీని వర్తింపజేయాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ప్రతిఏటా 12 సిలిండర్లకు ఈ రాయితీ వర్తిస్తుంది.

ముడి జనపనారకు మరో రూ.285

ముడి జనపనారకు కనీస మద్దతు ధరను కేంద్రం మరో రూ.285 పెంచింది. దీనివల్ల క్వింటాల్ ముడి జనపనార ధర రూ.5,335కు చేరుకుంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఈ కనీస మద్దతు ధర వర్తిస్తుంది.

రూ.10,037 కోట్లతో 'ఉన్నతి'

ఈశాన్య రాష్ట్రాల్లో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగాల సృష్టికి ప్రోత్సాహం ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన కొత్త పథకం 'ఉన్నతి'కి కేబినెట్ ఆమోదం తెలియజేసింది. ఈ పథకం రూ.10,037 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో పరిశ్రమలు స్థాపించే పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాలు ఇస్తారు. 2034 మార్చి 31 దాకా ఈ పథకం అమల్లో ఉంటుంది.

రూ.10,372 కోట్లతో కృత్రిమ మేధ

ఐదేళ్ల పాటు అమలు చేసే ఇండియా కృత్రిమ మేధ(ఏఐ) మిషన్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ఈ మిషన్‌కు ప్రభుత్వం రూ.10,373 కోట్లు కేటాయించింది. ఈ మిషన్‌లో భాగంగా 10,000 జీపీయూ సూపర్ కంప్యూటింగ్ కెపాసిటీని అందుబాటులోకి తీసుకొస్తారు.

మళ్లీ వయనాడ్ నుంచే రాహుల్

40 మంది పేర్లను ఖరారు చేసిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే 40 మంది అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ(సీఈసీ) గురువారం రాత్రి ఖరారు చేసింది. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఈసారి కూడా కేరళలోని వయనాడ్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సీఈసీ ఢిల్లీలో సమావేశమైంది. 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించి 60 లోక్‌సభ స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘంగా చర్చించారు. ఢిల్లీ, కర్ణాటక, కేరళ, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, సిక్కిం, త్రిపుర, నాగాలాండ్, మణిపూర్, మేఘాలయా, లక్షద్వీప్‌కు సంబంధించి పలు స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేశారు. సీఈసీ సమావేశంలో ఖర్గే, సోనియా గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. కేరళలో తమ పార్టీ 16 స్థానాల్లో పోటీ చేయబోతోందని కాంగ్రెస్ నేత వి.డి.సతీశన్ చెప్పారు. తమ మిత్రపక్షాలకు 4 స్థానాలు కేటాయించామన్నారు. ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భుపేష్ బఘేల్ రాజ్‌నంద్‌గావ్ నుంచి, మాజీ మంత్రి తామ్రధ్వజ్ సాహూ మహసముంద్ నుంచి పోటీ చేయనున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అభ్యర్థిత్వం సైతం ఖరారైంది. రాహుల్ గాంధీ వయనాడ్‌తో పాటు ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నుంచి పోటీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. రాయ్‌బరేలీ నుంచి ఈసారి ప్రియాంకాగాంధీ పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. 2019 నాటి ఎన్నికల్లో అమేథీ నుంచి ఓడిపోయిన రాహుల్ గాంధీ వయనాడ్‌లో గెలిచిన సంగతి తెలిసిందే. తొలి జాబితాను త్వరలో అధికారికంగా విడుదల చేస్తామని కాంగ్రెస్ వెల్లడించింది.

రాహుల్ 'యువ న్యాయ్'

మేమొస్తే 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీచేస్తాం

- అప్రెంటిస్‌షిప్ హక్కు చట్టం తెచ్చి యువతకు శిక్షణనిచ్చి ఉద్యోగాలిస్తాం
- శిక్షణలో రూ.1 లక్ష వార్షిక స్టైపండ్
- రాహుల్ గాంధీ హామీల వర్షం



జైపూర్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పలు నూతన హామీలను ప్రకటించారు. గురువారం భారత్ జోడో న్యాయ్ యాత్ర మధ్యప్రదేశ్‌లో పూర్తిచేసుకుని రాజస్థాన్‌లో అడుగుపెట్టిన సందర్భంగా బాంసవాడా పట్టణంలో ఏర్పాటుచేసిన సభలో రాహుల్ హామీల జల్లు కురిపించారు. ''మేం అధికారంలోకి వస్తే కేంద్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 30 లక్షల ఉద్యోగాలను మొట్టమొదట భర్తీచేస్తాం. డిగ్రీ, డిప్లొమా చేసి ఖాళీగా ఉన్న పాతికేళ్లలోపు యువతకు అప్రెంటిస్‌షిప్ కింద శిక్షణ ఇప్పించి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు వచ్చేలా చూస్తాం. అప్రెంటిస్ కాలంలో వారికి సంవత్సరానికి రూ.1 లక్ష స్టైపండ్ అందిస్తాం. ప్రభుత్వ ఉద్యోగాల ప్రవేశ పరీక్షా పేపర్ల లీకేజీ ఉదంతాలు పునరావృతంకాకుండా కఠిన చట్టం తీసుకొస్తాం. తాత్కాలిక ఉద్యోగాలు చేసుకునే గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పిస్తాం. యువత ఏర్పాటుచేసే అంకుర సంస్థల తోడ్పాటు కోసం రూ.5,000 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తాం'' అని రాహుల్ అన్నారు. యువతకు ఇచ్చిన ఈ ఐదు హామీలకు రాహుల్ 'యువ న్యాయ్'గా అభివర్ణించారు. '' డ్రైవర్, గార్డ్, డెలివరీ బాయ్ ఉద్యోగాలు చేసే గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పిస్తూ రాజస్థాన్‌లో ఇప్పటికే చట్టం తెచ్చారు. ఇదే తరహా చట్టాన్ని దేశమంతటా అమలుచేస్తాం. ఔట్‌సోర్సింగ్ విధానానికి స్వస్తిపలికి ప్రభుత్వ రిక్రూట్‌మెంట్ పరీక్ష విధానంలో ప్రమాణాలను పటిష్టంచేస్తాం. లీకేజీలకు తావులేకుండా కఠిన చట్టం తెస్తాం' అని అన్నారు. '' ఢిల్లీ చలో ఉద్యమ బాటలో పయనిస్తున్న రైతాంగానికి మేలు చేకూర్చేలా పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తాం. కులగణన చేపడతాం'' అని రాహుల్ అన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల నుంచి న్యాయం కోరడం కూడా నేరమేనని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో మహిళల రేప్, ఆత్మహత్యలను ప్రస్తావిస్తూ రాహుల్ విమర్శించారు.

ముంపు అంచున

అగ్రరాజ్యం



అమెరికాలోని 24 తీర నగరాలు మునిగిపోయే ప్రమాదం

2050కల్లా అనూహ్యస్థాయిలో పెరగనున్న సముద్ర మట్టాలు

భూతాపోన్నతి, కాలుష్యం, కార్చిచ్చులు అన్నీ కలిసి ధ్రువపు మంచును వేగంగా కరిగించేస్తున్నాయి. కొత్తగా వచ్చిచేరిన నీటితో సముద్ర మట్టాలు అమాంతం పెరిగి తీరప్రాంతాలను తమలో కలిపేసుకోనున్నాయి. ఇలా సముద్రమట్టాల పెరుగుదలతో ముంపు ముప్పును అమెరికాలోని 24 తీరప్రాంత నగరాలు ఎదుర్కోనున్నాయని తాజా అధ్యయనం ఒకటి ప్రమాదఘంటికలు మోగించింది. ఇప్పటికైనా తేరుకోకపోతే అనూహ్యంగా పెరిగే సముద్రమట్టాలను ఆపడం ఎవరితరమూ కాదు. అమెరికాలోని ప్రభావిత 32 తీరనగరాలకుగాను 24 నగరాల వెంట సముద్రమట్టం ప్రతిసంవత్సరం 2 మిల్లీమీటర్ల మేర పెరుగుతోంది. వీటిలోని 12 నగరాల్లో అయితే అంతర్జాతీయ సముద్రమట్టాల సగటు పెరుగుదల రేటును దాటి మరీ జలాలు పైపైకి వస్తున్నాయి. వీటికితోడు ఈ నగరాల్లోని ప్రతి 50 మంది జనాభాలో ఒకరు దారుణమైన వరదలను చవిచూడక తప్పదని తాజా అధ్యయనం హెచ్చరించింది. ఈ పరిశోధన తాలూకు సమగ్ర వివరాలు జర్నల్ 'నేచర్'లో ప్రచురితమయ్యాయి. గ్లోబల్ వార్మింగ్ దెబ్బకి వాతావరణంలో అనూహ్య ప్రతికూల మార్పులు సంభవిస్తున్నాయి. పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా తరచూ హీట్‌వేవ్‌లు, కరువులు సంభవించి, కార్చిచ్చులు చెలరేగి సగటు ఉష్ణోగ్రతలను అంతకంతకూ పెచ్చరిల్లుతున్నాయి. దీంతో ధృవాల వద్ద హిమానీనదాలు గతంలో కంటే వేగంగా కరిగిపోతున్నాయి. దీంతో అమెరికా, భారత్‌సహా పలు ప్రపంచదేశాల తీరప్రాంతాలకు ముంపు ప్రమాదం హెచ్చిందని అధ్యయనకారులు ఆందోళన వ్యక్తంచేశారు.

ముంపు అవకాశమున్న 32 నగరాలు

బోస్టన్, న్యూయార్క్ సిటీ, జెర్సీ సిటీ, అట్లాంటిక్ సిటీ, వర్జీనియా బీచ్, విల్మింగ్టన్, మేర్టల్ బీచ్, చార్లెస్టన్, సవన్నా, జాక్సన్‌విల్లే, మయామీ, నేపుల్స్, మొబిల్, బిలోక్సీ, న్యూ ఓర్లీన్స్, స్లైడెల్, లేక్ చార్లెస్, పోర్ట్ ఆర్థర్, టెక్సాస్ సిటీ, గాల్వెస్టన్, ఫ్రీపోర్ట్, కార్పస్ క్రిస్టీ, రిచ్‌మండ్, ఓక్లాండ్, శాన్ ఫ్రాన్సిస్కో, సౌత్ శాన్ ఫ్రాన్సిస్కో, ఫాస్టర్ సిటీ, శాంటాక్రూజ్, లాంగ్ బీచ్, హటింగ్టన్ బీచ్, న్యూపోర్ట్ బీచ్, శాండియాగో

మరిన్ని వరదలు

2050 సంవత్సరంకల్లా అమెరికా తీరప్రాంతాల వెంట సముద్రం దాదాపు 0.30 మీటర్లమేర పైకి ఎగిసే ప్రమాదముంది. దీంతో జనావాసాలను సముద్రపు నీరు ముంచెత్తి జనజీవనం అస్తవ్యస్తం కానుంది. సముద్రపు నీటితో కుంగిన నేలలు, రోడ్ల ఇలా ప్రజారవాణా వ్యవస్థ మొత్తం దెబ్బతిననుంది. కొన్ని ప్రాంతాలు మరింతగా కుంగిపోయే ప్రమాదముందని గణాంకసహితంగా అధ్యయనం పేర్కొంది. వచ్చే 30 సంవత్సరాల్లో ప్రతి 35 ప్రైవేట్ ఆస్తుల్లో ఒకటి వరదల బారిన పడి నాశనమయ్యే అవకాశముంది. గత అంచనాలను మించి విధ్వంసం తప్పదని అధ్యయనం హెచ్చరించింది. మట్టం పెరగడంతో లక్షలాది మంది తీరప్రాంత ప్రజల జీవనం ప్రశ్నార్థకంగా మారనుంది. అమెరికాలో 109 బిలియన్ డాలర్లమేర ఆస్తినష్టం సంభవించవచ్చని ఓ అంచనా. ఈ అధ్యయనంలో పంజాబ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ వారి బృందం సైతం పాలుపంచుకుంది. అమెరికా తీరప్రాంతంలో ముంపును ఎదుర్కోనున్న ప్రాంతాల అంచనా గణాంకాలను సిద్ధంచేసింది. 'నక్షత్రాలు నేలరాలితే ఏం చేయగలం?. చిన్నపాటి వర్షం కూడా పడవ వేగంగా మునగడానికి ప్రబల హేతువు కాగలదు. అలాగే తీరాల వెంట మట్టాలు పెరిగితే కలిగే విపత్తులు, విపరిణామాలు దారుణంగా ఉంటాయి' అని ఈ అధ్యయనంలో పాలుపంచుకున్న శాస్త్రవేత్త రాబర్ట్ నెకొలస్ ఆందోళన వ్యక్తంచేశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

క్లుప్తంగా...

173 పోస్టులకు సింగరేణి నోటిఫికేషన్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 173 పోస్టుల(ఇంటర్నల్) భర్తీకి యాజమాన్యం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో జూనియర్ మైనింగ్ ఆఫీసర్ పోస్టులు 87, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ (మెకానికల్) పోస్టులు 28, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎలక్ట్రికల్ పోస్టులు 21, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ సివిల్ 11 పోస్టులు, జూనియర్ ఆఫీసర్(ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్) నాలుగు పోస్టులు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులు 4, బయోకెమిస్ట్ పోస్టు ఒకటి, జూనియర్ ఫారెస్ట్ అసిస్టెంట్ పోస్టులు 12తో పాటు జూనియర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఐదు ఉన్నాయి. ఆయా పోస్టుల కోసం ఈనెల 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పూర్తి వివరాల కోసం సింగరేణి సంస్థ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్య సూచించారు.

ఈనెల 31లోగా కేవైసీ పూర్తి చేయాలి

సాక్షి, హైదరాబాద్: ఎల్పీజీ లబ్ధిదారులంతా ఈనెల 31లోగా తమ కేవైసీని పూర్తి చేసుకోవాలని తెలంగాణ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. కేంద్ర పెట్రోలియం మంత్రిత్వశాఖ ఈ ఆదేశాలు జారీచేసిందని వెల్లడించారు.

ప్రతీ నియోజకవర్గంలో వృద్ధాశ్రమం

- కోమటిరెడ్డి కుటుంబం సేవలు అభినందనీయం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



సుశీలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క. చిత్రంలో రాజగోపాల్‌రెడ్డి

జనగామ: రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో అనాథలు, ఒంటరి మహిళలకు నీడ కల్పించేందుకు వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయడానికి తన వంతు కృషి చేస్తానని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. జనగామ జిల్లా శామీర్‌పేట శివారులో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన తల్లి జ్ఞాపకార్థం స్థాపించిన సుశీలమ్మ ఫౌండేషన్ పేరిట రూ.13 కోట్ల సొంత నిధులతో నిర్మించిన మహిళా అనాథ వృద్ధాశ్రమాన్ని మంత్రి సీతక్క గురువారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలకు పెద్ద పీట వేస్తోందని తెలిపారు. అనాథలు, ఒంటరి మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి భరోసా కల్పిస్తుందని, కోమటిరెడ్డి కుటుంబం తమ తల్లి పేరిట ఇలాంటి సేవా కార్యక్రమాన్ని తలపెట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, యశస్వినిరెడ్డి, రామచంద్రునాయక్, శ్యామేల్, వేముల వీరేశం, ఎస్ఎఫ్‌సీ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మి, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన బోదనపల్లి



సాక్షి, హైదరాబాద్: టీశాట్ సీఈఓ బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. టీశాట్ సీఈఓగా తన నియామకానికి సహకరించినందుకు మంత్రికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డికి శ్రీధర్‌బాబు అభినందనలు తెలిపారు.

హజ్ కమిటీ చైర్మన్‌గా అఫ్జల్ బియబాని

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్‌గా సయ్యద్ గులామ్ అఫ్జల్ బియబాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు రోజుల క్రితం ప్రభుత్వం నియమించిన రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు గురువారం నాంపల్లి హజ్ హౌస్‌లో సమావేశమై బియబానిని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేని తొలుత అఫ్జల్ బియబాని పేరును చైర్మన్ పోస్టుకు ప్రతిపాదించగా, మరో సభ్యుడు ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్ బలపరిచారు. మిగతా సభ్యులు కూడా సమర్థించడంతో చైర్మన్ ఎన్నిక సజావుగా సాగింది. ప్రభుత్వం వివిధ విభాగాల నుంచి 16 మందిని సభ్యులుగా నియమించిందని హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి లియాకత్ తెలిపారు. ఈ కమిటీ వ్యవధి మూడేళ్ల పాటు ఉంటుందని వెల్లడించారు.

అభివృద్ధి కోసమే కేంద్రంతో సఖ్యత

సహకరించకపోతే కొట్లాడతాం

- సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ
- రాజీవ్ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్‌కు భూమి పూజ
- రాజకీయాలు, అభివృద్ధి రెండూ వేరని సూత్రీకరణ
- బీఆర్ఎస్ ఘర్షణ ధోరణితో కారిడార్ ఆలస్యమైందని వ్యాఖ్య
- 'కేటీఆర్ చచ్చుడో.. జీహెచ్ఎంసీకి నిధులు వచ్చుడో' అంటూ దీక్ష చేయాలని సూచన



ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి తదితరులు

కంటోన్మెంట్: రాష్ట్రంలో అభివృద్ధి పనులకు నిధుల కోసం కేంద్రంతో సఖ్యతగానే ఉంటామని, అదే రాజకీయాల విషయానికి వస్తే మాత్రం పోరాటం చేస్తూ ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించకపోతే కొట్లాడుతామని చెప్పారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలనీ, ఎన్నికలు ముగిశాక అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2,232 కోట్లతో రాజీవ్ రహదారిపై చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ పనులకు అల్వాల్ టిమ్స్ ఆవరణలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణతోనే ఈ ప్రాజెక్టు ఆలస్యమైందన్నారు. ప్రజల అవసరాన్ని మర్చిపోయి గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంతో గిల్లికజ్జాలు పెట్టుకుని ప్రాజెక్టును పక్కన బెట్టిందన్నారు. తాము అధికారంలోకి రాగానే కేంద్రంతో మాట్లాడి సమస్యను పరిష్కరించామని తెలిపారు. ప్రధాని మోదీని, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌ను కలిసి ప్రాజెక్టు అవసరాన్ని వివరించామని చెప్పారు. రక్షణ శాఖకు భూములు అప్పగించామనీ, అదే సమయంలో ఎలివేటెడ్ కారిడార్ కోసం రక్షణ శాఖ భూములు కావాలని కోరామని సీఎం వివరించారు. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడంతో కేంద్రం రాష్ట్రానికి సహకరించిందని తెలిపారు.

బీఆర్ఎస్ దిక్కుమాలిన విధానాలతో ప్రజలకు శిక్ష..

ప్రజల అవసరాల కోసమే ఒక మెట్టు దిగాం తప్ప రాజకీయాల కోసం కాదని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్‌లో ఏదైనా ఒక శాశ్వత అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు. గత పదేళ్లలో గంజాయి, డ్రగ్స్, పబ్‌లు తప్ప ఏమీ రాలేదని ఎద్దేవా చేశారు. ''ఎలివేటెడ్ కారిడార్ విషయంలో మా పోరాటం ఫలించిందని కేటీఆర్ అంటున్నాడు.. ఇంతకీ ఆయన ఏం పోరాటం చేసిండు. ట్విటర్ లో పోస్టులు పెట్టుడే ఆయన పోరాటమా?'' అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ఇందిరా పార్కు వద్ద కేటీఆర్ ఆమరణ దీక్ష చేయాలని సూచించారు. కేటీఆర్ చచ్చుడో అభివృద్ధికి నిధులు వచ్చుడో అని దీక్ష చేయాలన్నారు. కేటీఆర్ దీక్షకు దిగితే కాంగ్రెస్ కార్యకర్తలే ఆయన్ను కంచె వేసి కాపాడుతారన్నారు. కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం సెక్రెటరీ బి.అజిత్ రెడ్డి, హెచ్ఎండీఏ అదనపు కమిషనర్ ఆమ్రపాలి, కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పాల్గొన్నారు.

రయ్ రయ్‌మనేలా

దశాబ్దాల వెతలు తీర్చనున్న ఎలివేటెడ్ కారిడార్

- కరీంనగర్, మంచిర్యాల సహా ఆరు జిల్లాలకు ప్రయోజనం
- ప్యాట్నీ నుంచి ఓఆర్ఆర్ వరకు
- మొత్తం 18.10 కిలోమీటర్ల కారిడార్
- రూ.2,232 కోట్ల వ్యయంతో నిర్మాణం
- 0.3 కి.మీ. అండర్ గ్రౌండ్ టన్నెల్
- 11.12 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్



కంటోన్మెంట్: ఉత్తర తెలంగాణలో ఆరు జిల్లాల ప్రజల దశాబ్దాల కల త్వరలోనే సాకారం కానుంది. రాజధాని నగరం హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాలకు రాకపోకలు సాగించేందుకు ఇన్నాళ్లుగా పడిన కష్టాలు తీరిపోనున్నాయి. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియాలో ఇరుకైన రహదారిలో వాహనదారులు పడుతున్న ఇబ్బందులు తీర్చేందుకు రూ.2,232 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్‌కు సీఎం రేవంత్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కారిడార్ నిర్మాణం పూర్తయితే ఆరు జిల్లాల ప్రజలకు ప్రయాణ సమయం తగ్గిపోవడంతో ఇంధన రూపంలో వ్యయం తగ్గిపోనుంది.

కారిడార్ నిర్మాణం ఇలా

రాజీవ్ రహదారిపై నిర్మించనున్న కారిడార్ సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్ సమీపంలోని ప్యాట్నీ సెంటర్ నుంచి మొదలై కార్ఖానా, తిరుమలగిరి, బొల్లారం, అల్వాల్, హకీంపేట్, తూంకుంట మీదుగా శామీర్‌పేట్ సమీపంలోని ఓఆర్ఆర్ జంక్షన్ వద్ద ముగుస్తుంది. ఈ మొత్తం కారిడార్ పొడవు 18.10 కిలోమీటర్లు. ఇందులో ఎలివేటెడ్ కారిడార్ 11.12 కిలోమీటర్లు ఉంటుంది. అండర్ గ్రౌండ్ టన్నెల్ 0.3 కి.మీ ఉంటుంది. మొత్తం 287 పియర్స్ (స్తంభాలు) ఉంటాయి. మొత్తం ఆరు వరుసల్లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు. ఎలివేటెడ్ కారిడార్‌పైకి రాకపోకలు సాగించేందుకు వీలుగా తిరుమలగిరి జంక్షన్ సమీపంలో (0.295 కి.మీ. వద్ద), (0.605 కిలోమీటర్ వద్ద), అల్వాల్ వద్ద (0.310 కిలోమీటర్ వద్ద) మొత్తంగా మూడు చోట్ల ఇరువైపులా ర్యాంపులు నిర్మిస్తారు.

ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో..

ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్న ప్రాంతంలో రోజుకు సగటున 58,468 వాహనాలు (ప్యాసింజర్ కార్ యూనిట్ పర్ డే -పీసీయూ) పయనిస్తున్నాయి. ఇందులో కార్ఖానా సమీపంలో పీసీయూ 81,110 వద్ద ఉండగా, ఓఆర్ఆర్ జంక్షన్ సమీపంలో 35,825గా ఉంది. ఇరుకైన రహదారి కావడం, ఇంత పెద్ద మొత్తంలో వాహన రాకపోకలతో ఈ మార్గంలో ప్రయాణం అంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. సమయం హరించుకుపోవడంతో పాటు ఇంధన వ్యయం పెరుగుతోంది. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో సమయం కలి సిరావడంతో పాటు ఇంధనంపై అయ్యే వ్యయం తగ్గిపోతుంది. ట్రాఫిక్ సిగ్నల్స్ బాధలు తొలగిపోతాయి.

ముఖ్యాంశాలు...

- మొత్తం కారిడార్ పొడవు: 18.10 కి.మీ.
- ఎలివేటెడ్ కారిడార్ పొడవు: 11.12 కి.మీ.
- అండర్‌గ్రౌండ్ టన్నెల్: 0.3 కి.మీ.
- పియర్స్: 287
- అవసరమైన భూమి: 197.20 ఎకరాలు
- రక్షణ శాఖ భూమి: 113.48 ఎకరాలు
- ప్రైవేట్ ల్యాండ్: 83.72 ఎకరాలు
- ప్రాజెక్టు వ్యయం: రూ.2,232 కోట్లు

ఇవీ ప్రయోజనాలు

- రాజీవ్ రహదారి మార్గంలో సికింద్రాబాద్‌తో పాటు కరీంనగర్ వైపు జిల్లాల ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు చెల్లు
- కరీంనగర్ వైపు మెరుగైన ప్రయాణం
- ఇంధనం మిగులుతో వాహనదారులకు తగ్గనున్న వ్యయం
- సికింద్రాబాద్ నుంచి ట్రాఫిక్ ఆటంకాలు లేకుండా ఓఆర్ఆర్ వరకు చేరుకునే అవకాశం
- మేడ్చల్-మల్కాజిగిరి-సిద్దిపేట-కరీంనగర్-పెద్దపల్లి-మంచిర్యాల, కొమురం భీం జిల్లా ప్రజలు లబ్ధిపొందనున్నారు.

సింగరేణికి తాడిచెర్ల-2 బొగ్గు గని

- కేటాయింపునకు కేంద్రం అంగీకారం
- నైని కోల్ బ్లాక్‌లో మైనింగ్‌కు అనుమతివ్వాలని వినతి
- కేంద్ర మంత్రి జోషితో ఢిల్లీలో డిప్యూటీ సీఎం భట్టి చర్చలు
- విద్యుత్ ఉత్పత్తికి సహకరించాలని ఆ శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్‌ను కలిసి విజ్ఞప్తి
- కేంద్ర మంత్రులతో భట్టి భేటీ



ఢిల్లీలో కేంద్ర గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి వినతిపత్రం అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థకి తాడిచెర్ల బ్లాక్ 2 బొగ్గు గని కేటాయించేందుకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సూత్రప్రాయంగా అంగీకరించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి విజ్ఞప్తి చేయగా, ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని తాడిచెర్ల బ్లాక్ 2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించడానికి అన్ని అనుకూలతలున్నాయని భట్టి వివరించారు. త్వరలో సింగరేణికి బొగ్గు గని కేటాయింపులకు సంబంధించిన ముందస్తు అనుమతి లేఖను ఇస్తామని ప్రహ్లాద్ జోషీ హామీ ఇచ్చారని భట్టి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. సింగరేణికి ఒరిస్సా రాష్ట్రంలో కేటాయించిన నైనీ బ్లాక్‌లోనూ ఉత్పత్తిని ప్రారంభించే నిమిత్తం అడ్డంకులను తొలగించేందుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కోరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని భట్టి తెలిపారు. అలాగే ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనలో భాగంగా రాష్ట్రంలోని సబ్‌స్టేషన్ల పరిసరాల్లో సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు సహకరించాలని విద్యుత్ శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్‌ను కోరామన్నారు. ఈ అంశాలను పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని కేంద్ర మంత్రులు హామీ ఇచ్చారని భట్టి విక్రమార్క తెలిపారు. భట్టి వెంట ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ, సింగరేణి ఇన్‌చార్జీ సీఎండీ బలరామ్ ఉన్నారు. కాగా, తాడిచెర్ల బ్లాక్-2 గనిని సింగరేణికి కేటాయిస్తే సంస్థ వార్షిక బొగ్గు ఉత్పత్తి ఏటా 5మిలియన్ టన్నులకు పెరగనుంది. తాడిచర్ల బ్లాక్ 2 గని ద్వారా 30 ఏళ్లలో 182 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలను వెలికి తీసేందుకు అవకాశం ఉందని డిప్యూటీ సీఎం కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది.

కేసీఆర్, కేటీఆర్ ఇంజనీర్లు కాదు

మేడిగడ్డలో కుంగిన పిల్లర్లను రిపేరు చేస్తే సరిపోతుందని చెప్పడానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ ఇంజనీర్లు కాదని భట్టి విక్రమార్క ఎద్దేవా చేశారు. ఎవరికి వారే ఇంజనీర్లమని ఊహించుకుని చెప్పడంవల్లనే అవి కూలిపోయాయని ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. అధికారం పోయిన తర్వాత బీఆర్ఎస్ వాళ్లు ఆలోచనా జ్ఞానం కోల్పోయారని భట్టి మండిపడ్డారు. డ్యామ్ సేఫ్టీ, ఇంజనీరింగ్ అధికారులు చెప్పినట్లు చేయడానికి మాత్రమే అవకాశం ఉందన్నారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై అధిష్టానం చర్చలు జరుపుతోందని, సమయం, సందర్భాన్ని బట్టి జాబితా ప్రకటిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎవరో ముందుగా ప్రకటించారని తాము తొందరపడబోమని వ్యాఖ్యానించారు.

కులాల మధ్య అంతరాలు చెరిపేస్తాం

- అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి: సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రజలకు ప్రశ్నించే హక్కును, అధికారాన్ని కల్పించింది కాంగ్రెస్సే



బాబూ జగ్జీవన్‌రామ్ భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం రేవంత్. చిత్రంలో పొన్నం, కోమటిరెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

బంజారాహిల్స్/ జవహర్‌నగర్ (హైదరాబాద్) దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీలు అందరికీ ఒకే చోట ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా అధికారులను ఆదేశించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం బంజారాహిల్స్ రోడ్ నం.10లో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో రెసిడెన్షియల్ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు విడివిడిగా ఉండేవని తమ ప్రభుత్వ హయాంలో ప్రతి నియోజకవర్గంలో ఒకే క్యాంపస్‌లో గురుకులాలు ఉండేలా ఏర్పాటు చేసి, కులాల మధ్య అంతరాలు చెరిపేయాలని అనుకుంటున్నామన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ ఎన్నో సంస్కరణలకు కృషి చేశారని, ఆయన స్ఫూర్తితో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. చదువు మీద పెట్టేది ఖర్చు కాదని, అది భవిష్యత్తుకు పెట్టుబడి అని, చదువుకుంటేనే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఆకునూరి మురళి లాంటి వారికి చదువుకోవడం ద్వారానే గుర్తింపు, గౌరవం వచ్చాయన్నారు. కొందరు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నిస్తున్నారని, అసలు ఆ ప్రశ్నించే, హక్కును, అధికారాన్ని కల్పించింది కాంగ్రెస్ పార్టీనే అని రేవంత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

యువ డాక్టర్లు దేశ భవిష్యత్తుకు కీలకం..

వృత్తిగతంగా విజయాలు సాధిస్తూనే... బాధ్యతలను మరిచిపోవద్దని ఆర్మీ డెంటల్ కాలేజీ విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. సికింద్రాబాద్‌లోని ఆర్మీ కాలేజీ ఆఫ్ డెంటల్ సైన్సెస్ (ఏసీడీఎస్)లో గురువారం నిర్వహించిన స్నాతకోత్సవానికి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వైద్యానికి పెద్ద పీట వేస్తోందని చెప్పారు. అనంతరం 2020 బ్యాచ్‌లో మాస్టర్ డిగ్రీ చదివిన 15 మందికి, 2018లో బ్యాచిలర్ డిగ్రీ చేసిన విద్యార్థులకు ఆయన పట్టాలను అందచేశారు. ఉత్తమ ఆల్‌రౌండర్ విద్యార్థిగా డాక్టర్ శ్రేయాశుక్లాకు చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ రోలింగ్ ట్రోఫీ, డాక్టర్ హర్నూల్ ధిల్లాన్, అనుష్క మీనన్‌లకు అవార్డులు, నగదు బహుమతులు అందించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

పనిభారాన్ని తగ్గించేందుకు నూతన నియామకాలు

- మా ప్రభుత్వం వచ్చాక సంస్థ కళకళలాడుతోంది
- గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి పొన్నం



గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ 2023-24 అవార్డుల కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సీసీఎస్, పీఎఫ్ ఇతర పెండింగ్ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని ఉద్యోగులకు మంత్రి హామీ ఇచ్చారు. గురువారం ఆర్టీసీ కళ్యాణ మండపంలో టీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ 2023-24 నిర్వహించారు. ఇందులో భాగంగా ఉత్తమ సేవలు అందించిన డ్రైవర్లు, కండక్టర్లు, సెక్యూరిటీ సిబ్బంది, అధికారులను పురస్కారాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, మహాలక్ష్మి పథకం కోసం కష్టపడి పనిచేసిన కార్మికులను త్వరలో సత్కరించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టడంతో ఆర్టీసీ కళకళలాడుతోందన్నారు. సంస్థను బలోపేతం చేయడంతోపాటు పెండింగ్‌లో ఉన్న బాండ్స్ చెల్లిస్తామని, పీఆర్‌సీని కూడా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. కార్మికులకు పనిభారాన్ని తగ్గించేందుకు నూతన నియామకాలు చేపట్టడంతో పాటు కొత్త బస్సులు కొనుగోలు చేస్తామన్నారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ దసరా, సంక్రాంతి పండుగల సందర్భంగా నిర్వహించిన గ్రాండ్ ఫెస్టివల్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్మికులను గుర్తించి వారికి ప్రోత్సాహకంగా అవార్డులు ప్రదానం చేశామని తెలిపారు. మేడారం జాతరలో కూడా బాగా కష్టపడిన వారిని గుర్తించి సత్కరించామన్నారు. సిబ్బంది బకాయిలు, పీఆర్‌సీ, పీఎఫ్ బకాయిలు ఇవ్వాలని మంత్రిని కోరామని, ముఖ్యమంత్రితో మాట్లాడి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. త్వరలో రెండు వేల కొత్త బస్సులను కొనుగోలు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈడీలు కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, మునిశేఖర్, పురుషోత్తమ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచే ఏక్‌నాథ్ షిండేలు రావొచ్చు

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



పాలమూరు: కాంగ్రెస్ పార్టీలో నుంచే ఎవరైనా మరో ఏక్‌నాథ్ షిండేలా 40 మంది ఎమ్మెల్యేలతో బయటకు వస్తే ఆ పార్టీ ప్రభుత్వం పడిపోతుందని, ఎవరో ఎందుకు కాంగ్రెస్‌లోనే రేవంత్‌రెడ్డి మరో ఏక్‌నాథ్ షిండే అవ్వొచ్చునని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విమర్శించారు. పాలమూరులో జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి తన హోదాకు తగినట్లు మాట్లాడలేదని, ఆయన ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్లే మాట్లాడారని డీకే అరుణ ధ్వజమెత్తారు. గురువారం ఆమె జిల్లా బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతూ, ఒక పక్క ప్రధాని మోదీని పెద్దన్న అంటూనే.. ఆ మరుసటి రోజే మోదీ-కేడీ అన డం ఆయన కుసంస్కారానికి నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ వాళ్లు మాట్లాడిన తీరు చూస్తుంటే సంక్రాంతికి వచ్చే గంగిరెద్దులు గుర్తొస్తున్నాయన్నారు. 'మమ్మల్ని దించుతా రంటా..'అని సీఎం పదేపదే మాట్లాడటం ఎవరి సింపతీ కోసమో చెప్పాలన్నారు. మీ పాలనపై మీకే నమ్మకం లేదని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ గురించి మాట్లాడే నైతిక హక్కు రేవంత్‌రెడ్డికి లేదన్నారు.

టానిక్ లిక్కర్ స్టోర్లపై కొనసాగుతున్న విచారణ

సాక్షి, హైదరాబాద్: వాణిజ్య పన్నుల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నాలుగు రోజులుగా టానిక్ లిక్కర్ స్టోర్‌తోపాటు, ఆ గ్రూపునకు అనుబంధంగా ఉన్న మరో పది ఏఫోర్ షాపుల (వైన్ షాపులు) లావాదేవీలపై దర్యాప్తు చేస్తున్నారు. క్రయ విక్రయ లావాదేవీల్లో అక్రమాలను గుర్తించిన జీఎస్టీ అధికారులు గురువారం రిజిస్టర్ల తనిఖీలు చేపట్టారు. గత ఆరేళ్ల కాలంలో ఎప్పుడు, ఎంత, ఏ బ్రాండ్ మద్యం డిపోనుంచి తీసుకువచ్చారు.. ఎప్పుడు, ఎంత విక్రయించారు.. వ్యాట్ కింద ప్రభుత్వానికి ఎంత చెల్లించారు.. జీఎస్టీ ఎంత వసూలు చేశారనే అంశాలపై రిజిస్టర్ల తనిఖీ కొనసాగుతు న్నట్లు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తెలిపారు. అయితే జీఎస్టీ, నాన్ జీఎస్టీ పరిధిలోకి వచ్చే రెండు రకాల వస్తువులకు ఒకే ఇన్వాయిస్‌లో బిల్లులు ఇవ్వడం చట్టాల ఉల్లంఘనగా అధికారులు చెబుతున్నారు. కాగా రోజూ రాత్రి 11 గంటల కల్లా షాపులు మూసివేయాలని టానిక్ గ్రూప్‌ను ఎక్సైజ్ శాఖ ఆదేశించింది.

కమలంపై కుట్రలను తిప్పికొట్టండి

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ ఖండించండి
- బీజేపీ శ్రేణులకు కిషన్‌రెడ్డి పిలుపు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీజేపీని దెబ్బతీసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుట్రలకు పాల్పడుతున్నాయని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీపై ఈ రెండు పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని పార్టీ కేడర్‌కు ఆయన పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పార్టీకి పూర్తి సానుకూల వాతావరణం ఉన్నందున 17 ఎంపీ సీట్లను గెలుచుకునే దిశగా ఎన్నికల మేనేజ్‌మెంట్ ఉండాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడంలో భాగంగా.. పార్టీనాయకులు, కార్యకర్తలు అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో మోదీ ప్రభుత్వ విజయాలు, అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ భేటీలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, కాసం వెంకటేశ్వర్లు యాదవ్, సంస్థాగత ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, సీనియర్ నేత గరికపాటి మోహన్‌రావు, రాష్ట్రపార్టీ కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, మీడియా, సోషల్ మీడియాల కన్వీనర్లు పాల్గొన్నారు. కాగా, ఈ 12న అగ్రనేత అమిత్‌షాతో సమావేశాలకు సంబంధించి శుక్ర, శనివారాల్లో అన్ని మండల కేంద్రాల్లో సన్నాహక భేటీలు ఉంటాయని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డా.కాసం వెంకటేశ్వర్లు యాదవ్ తెలిపారు.

ఎమ్మెల్యే మర్రి కళాశాల భవనం కూల్చివేత

- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను ఆక్రమించారంటూ వారం క్రితం అధికారుల నోటీసులు
- ఐదు అంతస్తుల్లో రెండంతస్తులు తొలగింపు



కళాశాల భవనాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

దుండిగల్: మేడ్చల్ జిల్లా దుండిగల్‌లో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్(ఐఏఆర్ఈ) కళాశాల భవనాన్ని కూల్చివేశారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను ఆక్రమించి నిర్మాణాలను చేపట్టారంటూ ఇటీవల నోటీసులు ఇచ్చిన ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు గురువారం ఉదయం భారీ పోలీసు బందోబస్తు నడుమ కళాశాల వద్దకు చేరుకున్నారు. జేసీబీలతో ఐదు అంతస్తుల శాశ్వత భవనాన్ని కూల్చివేయడం మొదలు పెట్టారు. విషయం తెలుసుకున్న కళాశాల విద్యార్థులు వందల సంఖ్యలో అక్కడికి చేరుకుని కూల్చివేతలను అడ్డుకున్నారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ పనులను అడ్డగించారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు తాత్కాలికంగా పనులను నిలిపివేయడంతో పాటు పోలీసులు విద్యార్థులను సముదాయించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. తరువాత మరోసారి కూల్చివేతలు కొనసాగించగా కళాశాల యాజమాన్యం కోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయడంతో కూల్చివేతలను నిలిపివేశారు.

కళాశాలకు చేరుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

ఐఏఆర్ఈ కళాశాలలో కూల్చివేతలు జరుగుతున్న విషయం తెలుసుకున్న వెంటనే కళాశాల చైర్మన్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. తమకు కనీసం సమయం ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కళాశాలకు వచ్చి రాజశేఖర్‌రెడ్డికి మద్దతుగా నిలిచారు.

20 రోజుల్లోపే చర్యలు..

దుండిగల్‌లోని చిన్న దామెర చెరువును ఫిబ్రవరి 20వ తేదీన మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ స్వయంగా పరిశీలించారు. సుమారు 8.24 ఎకరాలు కబ్జాకు గురైనట్లు ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అప్పట్లోనే ఆయనకు నివేదిక ఇచ్చారు. అదే నెల 22వ తేదీన ఎఫ్‌టీఎల్ సరిహద్దులను ఏర్పాటు చేసి షెడ్లు, ఇతర నిర్మాణాలను తొలగించారు. తాజాగా ఐదు అంతస్తుల శాశ్వత భవనంలో రెండు అంతస్తుల మేర కొంత భాగాన్ని కూల్చారు.

కేసు సుప్రీంకోర్టులో ఉన్నా... ఆగలేదు: మర్రి రాజశేఖర్‌రెడ్డి

25 సంవత్సరాల నుంచి కళాశాలను నడిపిస్తున్నాం. అప్పటి నుంచి ఏ ఒక్క అధికారి కూడా నోటీసు ఇవ్వలేదు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడే అనుమతులు తీసుకున్నాం. హెచ్ఎండీఏ పరిధిలోకి వచ్చిన తరువాత రెగ్యులరైజేషన్ చేసుకోవాలని సూచించడంతో 2015లోనే రెగ్యులరైజ్ కోసం రూ.90 లక్షలు చెల్లించాం. కేసు సుప్రీం కోర్టులో నడుస్తుంది. ఇది మా పట్టా భూమి. మేము కొనుగోలు చేశాం. చిన్న చిన్న డీవియేషన్లు ఉంటే రెగ్యులరైజ్ చేసుకుంటాం. వారం క్రితం నోటీసు ఇచ్చారు.. కోర్టు ద్వారా సమాధానం ఇస్తామని చెప్పినా కనీసం సమయం కూడా ఇవ్వలేదు.

క్లుప్తంగా...

నీటి సమస్య తీర్చడం చేతకాక లోటు వర్షపాతం అంటారా?

ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం

సాక్షి, హైదరాబాద్: నీటి సమస్యలను తీర్చడం చేతకాక లోటు వర్షపాతం అని మాట్లాడటం విడ్డూరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఎండీ లెక్కల ప్రకారం 2023–24 సంవత్సరానికి సాధారణం కంటే 14 శాతం అధికంగా వర్షపాతం నమోదయిందని గురువారం 'ఎక్స్' వేదికగా ఆయన పేర్కొన్నారు. అబద్ధాలు, అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు సత్యదూరమైన మాటలు మాట్లాడుతోందని విమర్శించారు. 'రైతు సమస్యలు తీర్చడం మాట అటుంచి, తెలంగాణ రైతాంగానికి మూడు నెలల్లోనే స్కాంగ్రెస్ చేతగానితనం పూర్తిగా అర్థమైంది' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటా

కేటీఆర్‌కు ఎంపీ బండి సంజయ్ సవాల్



ప్రజాహిత యాత్రలో ఎంపీ బండి సంజయ్

చొప్పదండి: 'ఎన్నికల్లో నేను ఓడితే రాజకీయ సన్యాసం చేస్తా.. మరి నేను గెలిస్తే బీఆర్ఎస్ దుకాణం కట్టేసి రాజకీయ సన్యాసం చేస్తారా..' అంటూ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావుకు సవాల్ విసిరారు. గురువారం చొప్పదండి మండలంలో ప్రజాహిత యాత్ర నిర్వహించిన బండి ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. తాను బరాబర్ రాముడి గురించి మాట్లాడుతానని, రాముడి గుడి గురించి చావుకు తెగించి కొట్లాడానని, కానీ ఎమ్మెల్యే టికెట్ కోసం కేసీఆర్ తన కొడుకు పేరును అజయ్ నుంచి తారక రామారావుగా మార్చారని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరంలోని దేవళ్లకు రూ. వందల కోట్లు ఇస్తానని కేసీఆర్ మోసం చేస్తే.. తాను రూ. వేల కోట్లు తెచ్చానని గుర్తు చేశారు. రూ.2,100 కోట్లతో కరీంనగర్, వరంగల్ రోడ్డుకు నిధులు తెచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కుటుంబ పాలనకు తావులేని బీజేపీకి, మూడోసారి ప్రధాని కావడానికి మోదీకి ఓటేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే శోభ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలి

గవర్నర్‌కు దాసోజు శ్రవణ్ విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: హైకోర్టు తాజా తీర్పుతో పాటు రాజ్యాంగ నిబంధనలకు లోబడి తమ అర్హతలను పరిశీలించాలని.. గత ఏడాది జూలైలో కేబినెట్ చేసిన సిఫార్సులను అమలు చేయాలని గవర్నర్‌కు బీఆర్ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ విజ్ఞప్తి చేశారు. గవర్నర్ కోటా అంశంలో హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ''మన చట్టాల్లో న్యాయం, సమానత్వానికి అద్దం పట్టిన తీర్పు ఇది. ప్రజా జీవితంలో అంకితభావంతో పోరాటాలు, త్యాగాలు చేసిన మా సేవలను గుర్తించాలి. కుర్ర సత్యనారాయణతోపాటు నా నేపథ్యం, సామాజిక సేవ, కళ, సాహిత్య రంగాలకు అందించిన సేవలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 171(5)లో పేర్కొన్న అర్హత ప్రమాణాలకు సరిగ్గా సరిపోతాయి..'' అని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌వి అప్పుల కుప్పలు.. కాంగ్రెస్‌వి హామీల కుప్పలు

బూర నర్సయ్య గౌడ్ విమర్శ



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ కంటే తాము తక్కువా అన్నట్లుగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గత కొన్ని రోజులుగా పరుషపదజాలంతో మాట్లాడుతున్నారని బీజేపీ నేత, భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పలు చేస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హామీల కుప్పలు చేసిందని ఆయన ఎద్దేవా చేశారు. హామీలు నెరవేర్చలేక ఉచిత జీవోలు ఇచ్చుకుంటూ, ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడొస్తదా అని ఎదురుచూస్తున్నారన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం దినదినగండంగా నడుస్తోందన్న విషయాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ సీఎం కేసీఆర్ వ్యవహారశైలి నచ్చక ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపిస్తే ఆ పార్టీ ఇచ్చిన హామీలు అమలయ్యేట్టుగా కనిపించడం లేదన్నారు. 'కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఆరు గ్యారెంటీల కార్డు అభయహస్తం అని ఉంది. అది అభయహస్తం కాదు, తెలంగాణ ప్రజల పాలిట భస్మాసుర హస్తం' అని నర్సయ్య మండిపడ్డారు. తెలంగాణలో కోటి కుటుంబాలు 200 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తుండగా, దళితబంధు పథకం లాగా గృహజ్యోతి కేవలం జీవోలకే పరిమితమైందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుందని, బీఆర్ఎస్ పార్టీ గల్లీలో లేదు..ఢిల్లీలో లేదని, అందువల్ల కేసీఆర్‌కు రెస్ట్ ఇవ్వాలని బూర అన్నారు.

నీకే నల్లగొండ, ఖమ్మం | మానవ బాంబుల ముప్పు!

సీఎం రేవంత్ మానవ బాంబులా పేలాల్సిన అవసరం లేదు

- కరీంనగర్ కదనభేరి సన్నాహక సమావేశంలో కేటీఆర్ వ్యాఖ్య
- మా నుంచి ఏ హానీ ఉండదు.. ఐదేళ్లూ పరిపాలించు
- మగాడివైతే మల్కాజిగిరికి రా.. ఎంపీగా పోటీ చేద్దాం
- పార్లమెంటు ఎన్నికల తరువాత ఏక్‌నాథ్ షిండేలా రేవంత్ మారుతారని వ్యాఖ్య



కరీంనగర్ జిల్లా ఇరుకుల్లలో ఎండిన పొలాన్ని పరిశీలిస్తున్న కేటీఆర్ తదితరులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సిరిసిల్ల: సీఎం రేవంత్‌రెడ్డి మానవ బాంబులా పేలాల్సిన అవసరం లేదని.. ఆయనకు పక్కనే ఉన్న ఖమ్మం, నల్లగొండ మానవ బాంబుల నుంచి ముప్పు పొంచి ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. తమ నుంచి రేవంత్‌కు ఎలాంటి హానీ ఉండదని, ఇచ్చిన 420 హామీలన్నీ అమలు చేసి, ఐదేళ్లూ అధికారంలో ఉండొచ్చని పేర్కొన్నారు. మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండేలా లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇక్కడ ఎమ్మెల్యేలతో కలసి బీజేపీలో చేరే తొలి నాయకుడు రేవంతేనని వ్యాఖ్యానించారు. గురువారం కరీంనగర్, సిరిసిల్లలలో జరిగిన కరీంనగర్ కదనభేరి సన్నాహక సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''తెలంగాణ కోసం ఆంధ్రా పాలకులపై 2001 మే 17న కరీంనగర్‌లో కేసీఆర్ సింహగర్జన చేశారు. ఇప్పుడు ఈ నెల 12వ తేదీన అబద్ధాల రేవంత్ పాలనపై కేసీఆర్ కదనభేరి మోగించనున్నారు. మూడు నెలలుగా సీఎం రేవంత్ భాష అర్థంకావడం లేదు. పాలమూరు సభలో జేబులో కత్తెర పెట్టుకుని తిరగడమేంటి? పేగులు మెడలో వేసుకుని తిరుగుతాం, మానవ బాంబులవుతాం అనడమేంటి? జేబులో కత్తెర్లు పెట్టుకుని ఎవరు తిరుగుతారు? సచివాలయంలో లంకె బిందెల కోసం వస్తే ఖాళీ కుండలున్నాయని రేవంత్ అనడం విడ్డూరం. లంకె బిందెల కోసం రాత్రిపూట ఎవరు తిరుగుతారు?మానవ బాంబులో అవో, ఇవో కాదు.. నల్లగొండ, ఖమ్మం మానవ బాంబులతోనే నీకు ప్రమాదం..

రాజీనామా చేసి రా.. పోటీపడదాం

ఐదేళ్లూ అధికారంలో ఉండండి. మా నుంచి ఎలాంటి హానీ లేదు. చార్ సౌ బీస్ (420) హామీలు అమలు చేసేదాకా వెంటపడతాం. 100 రోజుల్లో అమలు చేస్తానన్న మీ హామీలను గుర్తుచేస్తే అసహనమెందుకు? మగాడివైతే శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసి మల్కాజిగిరి నుంచి ఎంపీ పదవికి నాతో పోటీ చేసి గెలువు. తెలంగాణను కించపరిచేలా గుజరాత్ మోడల్ చేస్తానని రేవంత్ అంటున్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారు. ఏమిటి గుజరాత్ మోడల్? హిందూ ముస్లిం కొట్లాటలు, రైళ్లలో వెళ్లే వారిని కాల్చిచంపడమా? మీ రాహుల్ గుజరాత్ మోడల్‌ను తప్పుబడుతుంటే సీఎం ఎలా పొగుడుతున్నారు?

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు!

రాష్ట్రంలో కరువు రాబోతోందని, కలసి ఎదుర్కొందామని సీఎం రేవంత్ అంటున్నారు. వాస్తవానికి ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు. మేడిగడ్డలో ఉన్న 85 పిల్లర్లలో మూడు పిల్లర్లు కుంగితే మరమ్మతులు చేయకుండా, నీటిని ఎత్తిపోకుండా కరువుకు కారణమవుతున్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో కడెం ప్రాజెక్టు రెండు సార్లు, వరంగల్ గుండ్ల వాగు రెండు సార్లు కొట్టుకుపోయాయి. నాగార్జునసాగర్, శ్రీశైలంలలో సమస్యలు రాలేదా? వేసవిలోనూ వేల క్యూసెక్కుల నీటి లభ్యత ఉన్న మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టి లిఫ్టులు పెట్టి దశలవారీగా కొండపోచమ్మ సాగర్ వరకు తరలించాం. రేవంత్, బండి సంజయ్ ఇద్దరు పిచ్చివాళ్లకు ఇవేవీ తెలియవు. అందుకే ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు. ఇప్పటికే మేడిగడ్డకు మరమ్మతులు చేసి ఉంటే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పొలాలు ఎండిపోయే పరిస్థితి ఉండేది కాదు. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు కరీంనగర్‌లోనూ ఎల్ఎండీని ఖాళీ చేస్తున్నారు.

బండి సంజయ్ చర్చకు రావాలి..

గత పదేళ్లలో కరీంనగర్‌కు ఎవరేం చేశారు? కేంద్రం నుంచి ఎన్ని నిధులు వచ్చాయన్న విషయంలో బండి సంజయ్‌కు దమ్ముంటే చర్చకు రావాలి. అంతే తప్ప మంత్రి పొన్నం ప్రభాకర్ తల్లిని అగౌరవపర్చేలా మాట్లాడటం సిగ్గుచేటు. ఎంపీ బండి సంజయ్ సంస్కారం లేని వ్యక్తి. ఎంపీగా ఉండేందుకు అనర్హుడు.

ఏక్‌నాథ్ షిండేలా రేవంత్..

బీఆర్ఎస్‌ను బీజేపీకి బీటీమ్ అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఎవరు బీజేపీ మనుషులు? ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన రేవంతా? లేక మోదీ మీద పోరాడుతున్న బీఆర్ఎస్ వాళ్లా? కవితను ఎందుకు అరెస్టు చేయలేదంటున్న వాళ్లకు నా సూటి ప్రశ్న. మేం బీజేపీకి బీటీమ్ అయితే అసలు కవిత మీద కేసు నమోదయ్యేదా? మా ఎంపీలను లాక్కుంటున్న బీజేపీతో మాకేం పొత్తుంటుంది? ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీలో తీస్‌మార్ ఖాన్‌లుగా చెప్పుకునే బండి సంజయ్, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, ధర్మపురి అర్వింద్‌లను ఓడించింది బీఆర్ఎస్ నేతలే కదా? లోక్‌సభ ఎన్నికల తర్వాత గుంపుమేస్త్రీ జంప్ అవుతాడు. ఏక్‌నాథ్ షిండే, హిమంత బిశ్వ వంటివారిలా 15 మంది ఎమ్మెల్యేలను తీసుకుని బీజేపీలోకి వెళ్లే తొలి నాయకుడు రేవంతే..'' అని కేటీఆర్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌కు బీసీలే అండ



సభలో మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర. చిత్రంలో నామా, పువ్వాడ, జూలూరు, వనమా తదితరులు

- పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత బీసీలపై ఉంది
- ఎంపీ ఎన్నికల్లో కేసీఆర్ రుణం తీర్చుకోవాలి
- కృతజ్ఞత సభలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం మయూరిసెంటర్: బీఆర్ఎస్ బీసీల పార్టీ అని, బహుజనులు పార్టీకి అండగా నిలుస్తున్నారని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. రెండోసారి రవిచంద్రకు ఎంపీగా అవకాశం ఇచ్చిన నేపథ్యంలో ఖమ్మంలో గురువారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఇదే సభలో వద్దిరాజును ఘనంగా సత్కరించగా ఆయన మాట్లాడుతూ బీసీలపై ప్రేమతోనే తనకు కేసీఆర్ పదవి ఇచ్చారన్నారు. బీసీలంతా కేసీఆర్‌కు రుణపడి ఉంటూ పార్టీని కాపాడుకోవాల్సిన తరుణం వచ్చిందన్నారు. ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో కేసీఆర్ అభివృద్ధి చేశారని, లోక్‌సభ ఎన్నికల్లో నామా నాగేశ్వరరావును గెలిపించి కేసీఆర్ రుణం తీర్చుకోవాలని కోరారు. ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో తనను గెలిపిస్తే తాను, రవిచంద్ర ఖమ్మం జిల్లాకు అండగా ఉంటామని తెలిపారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ బీసీ బిడ్డ అయిన రవిచంద్రకు మరోసారి రాజ్యసభ ఇచ్చి కేసీఆర్ బహుజనులపై ఉన్న నిబద్ధతను చాటుకున్నారని వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బడుగు, బలహీన వర్గాలను కేసులతో ఇబ్బంది పెడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, తాతా మధు, జూలూరి గౌరీశంకర్, వి.ప్రకాష్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, ఈడిగ ఆంజనేయులు గౌడ్, తాడూరి శ్రీనివాస్, రాజారాం యాదవ్, కొండబాల కోటేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు, మానవతారాయ్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుచరులతో 'అల్లోల' భేటీ

- పార్టీ మార్పుపై చర్చలు
- నిర్ణయం తీసుకోలేదు: ఇంద్రకరణ్‌రెడ్డి



నిర్మల్: మాజీ మంత్రి, సీనియర్ నేత అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తన అనుచరులతో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ హయాంలో దాదాపు పదేళ్లపాటు మంత్రిగా కొనసాగిన ఆయన ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. గురువారం నిర్మల్‌లో తన అనుచరులు, బీఆర్ఎస్ ముఖ్యనేతలతో ఆయన సమావేశమయ్యారు. ఇందులో ప్రధానంగా పార్టీ మార్పుపై అనుచరులు అల్లోలపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలిసింది. తమ పనులు కొనసాగాలన్నా.. అనుచరులు నిలవాలన్నా.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో చేరాలని సీనియర్లు తమ అభిప్రాయాన్ని వెల్లడించినట్లు సమాచారం. ఇదే విషయమై మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా, పార్టీ మార్పుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, మామూలుగానే తమ అనుచరులతో ముచ్చటించామని చెప్పారు. ఎలాంటి నిర్ణయమైనా వ్యక్తిగతంగా తీసుకోనని తెలిపారు.

ఎమ్మెల్సీలపై మళ్లీ నిర్ణయం

▶ మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేసింది. వాస్తవానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 ప్రకారం కోర్టుకు గవర్నర్ జవాబుదారీ కాదని.. గవర్నర్‌కు కోర్టులు ఆదేశాలు జారీ చేయలేవని పేర్కొంది. కానీ హైకోర్టుకు న్యాయసమీక్ష అధికారం ఉంటుందని వివరించింది. 'గవర్నర్ కోటా' పిటిషన్లపై వాదనలను పరిశీలించాక.. రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా తగిన చర్య తీసుకోవాలని భావించి తీర్పునిస్తున్నట్టు తెలిపింది. నాటి కేబినెట్ సిఫార్సు అమలు చేయాలన్న పిటిషనర్ల డిమాండ్‌పై చర్చ అనవసరమని.. గవర్నర్ తిరస్కరణను మాత్రమే వారు సవాలు చేశారని పేర్కొంది.

'గవర్నర్ కోటా' వివాదం ఇదీ..

2023 జూలై 31న భేటీ అయిన గత ప్రభుత్వ కేబినెట్ గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణల పేర్లను గవర్నర్‌కు సిఫార్సు చేసింది. గవర్నర్ ఈ సిఫార్సులను తిరస్కరిస్తూ సెప్టెంబర్ 19న ఆదేశాలు జారీ చేశారు. దీంతో గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు విచారణలో ఉండగానే.. కొత్త ప్రభుత్వ కేబినెట్ సిఫార్సు మేరకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరామ్, జర్నలిస్టు ఆమెర్ అలీఖాన్‌ల నియామకానికి గవర్నర్ ఆమోదం తెలిపారు. ఈ ఏడాది జనవరి 27న ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. ఈ నియామకాలను కూడా శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో సవాల్ చేశారు. రెండు అంశాలపైనా హైకోర్టు సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. కోదండరామ్, ఆమెర్ అలీఖాన్‌ను ప్రధాన పిటిషన్‌లో ఇంప్లీడ్ చేసింది. వారి ప్రమాణ స్వీకారంపైనా స్టే ఇచ్చింది. తాజాగా తీర్పు వెలువరించింది.

వాదనలు సాగాయిలా..

గవర్నర్ నిర్ణయం అభ్యంతరకరం!

''దాసోజు శ్రవణ్ రాజకీయ నాయకుడన్న కారణంగా గవర్నర్ తిరస్కరించారు. తర్వాత నియామకమయ్యే వారు కూడా రాజకీయాలకు సంబంధం లేకుండా ఉండాలి. కానీ నియామకమైన వారు కూడా రాజకీయ నాయకులే. అందులో ఒకరు రాజకీయ పార్టీనే నడిపిస్తున్నారు'' అని హైకోర్టులో దాసోజు శ్రవణ్ తరఫున సీనియర్ న్యాయవాది ఆదిత్యా సోంధీ వాదనలు వినిపించారు. ''గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిత్వ అర్హతలకు.. పిటిషనర్ల నామినేషన్ తిరస్కరణ కారణాలకు పొంతన లేదు. మంత్రివర్గ సిఫార్సులను తిరస్కరించే అధికారం గవర్నర్‌కు లేదు. దీనిపై సుప్రీంకోర్టు తీర్పులున్నాయి. గవర్నర్‌కు అభ్యంతరం ఉంటే పునః పరిశీలన కోసం వెనక్కి పంపవచ్చు. గవర్నర్ తిరస్కరణ కారణంగా హక్కును కోల్పోయిన పిటిషనర్‌కు కోర్టును ఆశ్రయించే అర్హత ఉంటుంది. శ్రవణ్, సత్యనారాయణల పేర్లను నెలల తరబడి పరిశీలించిన గవర్నర్.. కోదండరామ్, ఆమెర్ అలీఖాన్‌ల పేర్లను మాత్రం కొత్త కేబినెట్ సిఫార్సు చేసిన వెంటనే ఆమోదించింది'' అని వివరించారు. కుర్ర సత్యనారాయణ తరఫున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ''మంత్రి మండలి సిఫార్సులను గవర్నర్ వెనక్కి పంపడానికి, తిరస్కరించడానికి తేడా లేదని పేర్కొనడం సరికాదు. ప్రభుత్వం సిఫార్సు చేసిన అభ్యర్థులపై గవర్నర్‌గా సంతృప్తి చెందడం వేరు.. ఓ వ్యక్తిగా సంతృప్తి చెందడం వేరు. పిటిషనర్ల పేర్లను గవర్నర్ వ్యక్తిగతంగా తిరస్కరించినట్టు కనిపిస్తోంది'' అని పేర్కొన్నారు.

గవర్నర్.. రబ్బర్ స్టాంప్ కాదు..

''ఎవరికైనా రాజ్యాంగం అనేది సుప్రీం. దాన్ని ఎవరైనా అనుసరించాలి. భాషాపరమైన, సైన్స్ వంటి రంగాల్లో సేవలందించిన వారిని మంత్రి మండలి సిఫార్సు చేయాలి. అలా కాకుండా రాజకీయ విభాగాలకు చెందిన వారిని సిఫార్సు చేస్తే.. కారణాలను పేర్కొంటూ తిస్కరించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. గవర్నర్ రబ్బర్ స్టాంప్ కాదు. గవర్నర్ తిరస్కరించిన తర్వాత వేరేవారి పేర్లు పంపడానికి ప్రభుత్వానికి అవకాశం ఉన్నా పంపలేదు. మంత్రి మండలి సిఫార్సులను వెనక్కి పంపిన గవర్నర్ చర్యలను అలహాబాద్, బాంబే హైకోర్టులు గతంలో సమర్థించాయి. కోదండరామ్, ఆమెర్ అలీఖాన్‌లను గవర్నర్ నేరుగా ఏమీ నియమించలేదు. మంత్రి మండలి సిఫార్సు చేసిన తర్వాత.. ఆయా రంగాల్లో వారు చేసిన సేవను పరిశీలించి ఆమోదముద్ర వేశారు'' అని కోదండరామ్, అలీఖాన్‌ల తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ కోర్టుకు విన్నవించారు.

ప్రభుత్వ సిఫార్సు మేరకే నియామకం..

ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) వాదనలు వినిపిస్తూ.. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఇద్దరి పేర్లను ఎమ్మెల్సీలుగా సూచిస్తూ జనవరి 24న ప్రభుత్వం సిఫార్సు చేసిందని, దాన్ని పరిశీలించాకే గవర్నర్ ఆమోదించారని వివరించారు. ఇదంతా చట్టప్రకారమే జరిగిందన్నారు. గతంలో ప్రభుత్వం చేసిన సిఫార్సులను పక్కకుపెట్టే అధికారం ఇప్పుడున్న సర్కార్‌కు ఉంటుందని స్పష్టం చేశారు.

గవర్నర్ కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.అశోక్ ఆనంద్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. ''గవర్నర్ నిర్ణయాలను కోర్టులు విచారించలేవు. రాజ్యాంగం గవర్నర్ విచక్షణాధికారాలకు పూర్తి రక్షణ కల్పించింది. గవర్నర్ విచక్షణ రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి మంత్రి మండలి సలహాపై.. మరొకటి సొంత విచక్షణాధికారం. ప్రజాప్రతినిధుల కోటా కింద ఎమ్మెల్సీగా ఎన్నుకునే అవకాశం ఎమ్మెల్యేలకు ఎలా ఉంటుందో.. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలను నియమించే విచక్షణాధికారాలు గవర్నర్‌కు ఉన్నాయి'' అని వివరించారు.

రచ్చబండల వద్ద చర్చ పెట్టండి

- కాంగ్రెస్ హామీలపై ఎమ్మెల్యే హరీశ్‌రావు
- బడేభాయ్, చోటాభాయ్ ఒక్కటేనని విమర్శ
- బాబు పాపాలు, కాంగ్రెస్ లోపాలు.. పాలమూరుకు శాపాలు



నారాయణఖేడ్: అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై గ్రామాల్లో రచ్చబండల వద్ద చర్చలు పెట్టాలని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు పార్టీ కార్యకర్తలకు సూచించారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో గురువారం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న వివిధ హామీలు అమలుచేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ముఖ్యమంత్రి అయ్యాక విస్మరించారని మండిపడ్డారు. ఎమ్మెల్యే అభ్యర్థులు సైతం ఎక్కడికక్కడ బాండ్ పేపర్లపై రాసి గ్రామాల్లో పంచారని గుర్తు చేశారు. ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకున్న వారిపై చీటింగ్ కేసులు పెట్టాల్సిన అవసరం ఉందని, 90 రోజుల్లోనే కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందని హరీశ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే ప్రజలు హామీల అమలు గురించి అడిగే హక్కును కోల్పోతారని, అందుకే ఇవి ఆషామాషీ ఎన్నికలు కావని పేర్కొన్నారు. అధికారం, ప్రతిపక్షం ఏదీ శాశ్వతం కాదని, మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ అని హరీశ్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ బడేభాయ్, చోటాభాయ్‌లు అన్న విషయాన్ని ముస్లింలు గుర్తించాలని కోరారు. ఎంపీ బీబీ పాటిల్‌కు బీఆర్ఎస్ రాజకీయభిక్ష పెట్టిందని, బీజేపీలో చేరిన ఆయనకు ప్రజలు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు డైరెక్షన్‌లో రేవంత్ యాక్షన్

సంగారెడ్డి: దమ్ము, ధైర్యం ఉంటే మాకంటే ఎక్కువ అభివృద్ధి చేసి ప్రజలకు దగ్గర కావాలి కానీ.. మాటలతో మభ్య పెట్టాలని చూస్తే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హరీశ్‌రావు అన్నారు. గురువారం సంగారెడ్డిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలమూరు పాపం అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ, కాంగ్రెస్‌లదేనన్నారు. చంద్రబాబు జేబులో రేవంత్ చెయ్యి ఉందని, ఆయన డైరెక్షన్‌లోనే సీఎం యాక్షన్ చేస్తున్నారని మండిపడ్డారు. పాలమూరు వేదికగా రేవంత్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. చంద్రబాబు పాపాలు, కాంగ్రెస్ పార్టీ లోపాలు కలిసి పాలమూరు పాలిట శాపాలుగా మారాయని మంత్రి పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో వలసలు తగ్గాయని, కాంగ్రెస్ పాలనలో మళ్లీ మొదలయ్యాయని ఎద్దేవా చేశారు.

రేవంత్‌రెడ్డి బీజేపీతో కలుస్తారు

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: భవిష్యత్తులో బీజేపీతో కలిసే ఆలోచనతోనే పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్‌రెడ్డి అంటున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నారని విమర్శించారు. జీవో 3కు వ్యతిరేకంగా తాము తలపెట్టిన ధర్నాకు ప్రభుత్వం అనుమతినివ్వాలని, అనుమతి ఇవ్వకపోయినా ధర్నా చేసి తీరుతామని తేల్చి చెప్పారు. గురువారం కవిత తన నివాసంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రేవంత్‌రెడ్డి మహిళా వ్యతిరేక పాలన సాగిస్తున్నారని, జీవో నంబర్ 3 అందులో భాగమేనని విమర్శించారు. భారత జాగృతి ఆధ్వర్యంలో జీవో నంబర్ 3కు వ్యతిరేకంగా ఈనెల 8న తలపెట్టిన ధర్నాకు ఇప్పటి వరకు పోలీసులు అనుమతి ఇవ్వలేదని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న ఆడబిడ్డలకు జీవో 3 వల్ల ఉద్యోగ నియామకాల్లో జరిగే నష్టం గురించి వివరించాలని ధర్నా కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

కృత్రిమ కరువు సృష్టిస్తున్నారు..

కరువు వచ్చిందని, ఎవరూ తాగునీళ్లు, సాగునీళ్లు అడగవద్దని ముఖ్యమంత్రి అన్నట్లు అన్ని పత్రికల్లో వార్త వచ్చిందని కవిత చెప్పారు. 'కానీ ఇది కరువు కాదు. కాళేశ్వరం ప్రాజెక్టును, కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న ఉద్దేశంతో సీఎం సృష్టించిన కృత్రిమ కరువు'అని వ్యా ఖ్యానించారు. అవగాహనా రాహిత్యంతో ప్రభుత్వం చెరువులను నింపలేకపోయిందని, దాంతో ఆ నెపాన్ని ప్రకృతి వైపరీత్యంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రైతులు ఇబ్బంది పడవద్దన్న ఉద్దేశంతో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని గుర్తు చేశారు. ప్రభుత్వాన్ని పడగొట్టే ఉద్దేశం లేదని అందరూ చెబుతున్నా కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దారుణమైన పదజాలంతో కేసీఆర్‌ను దూషించడం శోచనీయమని కవిత అన్నారు. బీజేపీ ఎంపీ అర్వింద్ ఎక్కడ నుంచి పోటీ చేసినా ఓడిస్తానని కవిత పునరుద్ఘాటించారు.

రేవంత్‌ది ఉన్మాద భాష

- కేసీఆర్‌ను తిట్టడం సంస్కారహీనం
- ఆయన వ్యాఖ్యలను కోర్టులు సుమోటోగా తీసుకొని చర్యలు చేపట్టాలి
- సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతున్న ఉన్మాద భాషను ప్రజలు గమనిస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగబద్ధ ప్రమాణం చేసి సీఎం నేరపూరిత భాష మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. 'బొందపెడ్తం, పండబెట్టి తొక్కుతం, పేగులు మెడల వేసుకుంటం'అనేవి ఏం మాటలని ప్రశ్నించారు. పాలమూరులో రేవంత్ మాట్లాడిన మాటలను హైకోర్టు, సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి చర్యలు చేపట్టాలని అన్నారు. కేసీఆర్ మీద, తమ ప్రభుత్వం మీద అనామకులు, స్థాయి, తాహతు లేని వాళ్లు అవాకులు, చెవాకులు పేలినా అప్పట్లో హుందాగా వ్యవహరించామని గుర్తు చేశారు. సీఎం విధానపరమైన అంశాలు మాట్లాడకుండా వ్యక్తిగత దూషణలు చేయడం శోచనీయ మన్నారు. రేవంత్ మా టిమాటికీ పాలమూరు బిడ్డనని చెప్పుకుంటూ వ్యక్తిగత గుర్తింపుకోసం తాపత్రయపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన పాల మూరు బిడ్డ కాదు.. చంద్రబాబు పెంపుడు బిడ్డ అని నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

పాలమూరు–రంగారెడ్డికి జాతీయహోదా ఎందుకు అడగలేదు?

అసలు పాలమూరు వలసలు, ఆకలిచావులు, ఆత్మహత్యలపై రేవంత్‌కు ఉన్న ఆర్తి ఏంటని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. పాలమూరు మీద ప్రేమ ఉంటే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి మోదీ సభలో జాతీయహోదా కావాల ని ఎందుకు అడగలేదో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పాలనలో సర్వం నష్టపోయిన పాలమూరుకు సాగునీళ్లు, ఒక ఫిషరీస్ కాలేజీ, ఐదు మెడికల్ కాలేజీలు ఇచ్చింది కేసీఆరే అని చెప్పారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు సీఎం సుముఖం

అన్ని సొసైటీలూ ఒక్క తాటిమీదకు రావాలి
మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని తెలంగాణా మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో హైదరాబాదులోని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం భవిష్యత్ కార్యాచరణపై శ్రీనివాసరెడ్డి పలు సూచనలు చేశా రు. దాదాపు రెండు గంటల పాటు సాగిన సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. ప్రభుత్వంలోని పెద్దలను సంప్రదించేందుకు అన్ని సొసైటీలు ఒక్క తాటి మీదకు రావాలని ఆయన సూచించారు. సమావేశంలో దక్కన్ జర్నలిస్ట్ హౌజింగ్ సొసైటీ, ది హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ, ది తెలంగాణా జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. ఒక్కో సొసైటీ నుంచి ముగ్గురు సభ్యులతో కూడిన ఒక సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు సూచించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నవీన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్/ షాద్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా షాద్‌నగర్ నియోజకవర్గం నందిగామ మండలం మొదళ్లగూడ గ్రామానికి చెందిన నాగర్‌కుంట నవీన్ రెడ్డిని పార్టీ అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నేతల అభిప్రాయం మేరకు గురువారం ఈ నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరిన ఆయనకు ఎమ్మెల్సీగా పోటీ అవకాశం కల్పించారు. నవీన్ కుమార్ స్వస్థలం నందిగామ మండలం మామిడిపల్లి. ఆయన ఉమ్మడి పాలమూరు జెడ్పీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు.

కసిరెడ్డి ఎమ్మెల్యేగా గెలవడంతో..

స్థానిక సంస్థల కోటా మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఇటీవల కాంగ్రెస్‌లో చేరి కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన రాజీనామా చేసిన నేపథ్యంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక జరుగుతోంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు కలిపి 1,400 పైచిలుకు ఓటర్లున్నారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 8 । మార్చి । 2024



స్నాతకోత్సాహం

వారంతా యువ డాక్టర్లు.. దేశభవిష్యత్తులో భాగస్వాములవుతున్నారు.. నూతన టెక్నాల జీతో దంత వైద్యం అందించనున్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ఆర్మీ డెంటల్ కళాశాలలో గురువారం నిర్వహించిన స్నాతకోత్సవ వేడుకల్లో వారంతా పట్టాలు అందుకున్నారు. హ్యాట్స్‌ను గాల్లోకి విసిరేసి ఎగిరి గంతేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం తల్లిదండ్రులు, గురువులతో సెల్ఫీలు దిగి సందడి చేశారు. – జవహర్‌నగర్

‘వేం’ను కలిసింది వాస్తవమే

- ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి



మేడ్చల్: ప్రభుత్వ సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డిని గురువారం తాను, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కలిసింది వాస్తవమేనని, తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించేందుకు మాత్రమే కలిశామని మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముమ్మాటికీ తమపై కక్ష సాధింపు చర్యలు చేస్తోందని భావిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని తమ కళాశాలలకు అన్ని అనుమతులు తీసుకున్నామని తెలిపారు. 1995లోనే 50 ఎకరాలు కొనుగోలు చేశామని, 2015లో హెచ్‌ఎండీఏ అనుమతుల కోసం రూ.95లక్షలు ఫీజు చెల్లించి రెగ్యులరైజ్ కోసం కూడా దరఖాస్తు చేసుకున్నామన్నారు. కాగా ఆ కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని తెలిపారు. తమపై కక్ష సాధింపు చర్యలు ఆపాలని విన్నవించేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వేంనరేందర్‌రెడ్డిలను కలిసే ప్రయత్నం చేశామన్నారు. అయితే భట్టి అందుబాటులో లేకపోవడంతో వేంనరేందర్‌రెడ్డిని కలిశామన్నారు. అనుమతులు ఉన్నా అన్యాయంగా జరుగుతున్న కూల్చివేతలను ఆపాలని కోరామని, తమను విద్యాసంస్థల ఫౌండర్‌గానే చూడాలే తప్ప రాజకీయ కోణంలో చూడవద్దని ఆయన కోరారు. కాగా, ఈ పరిణామాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. మరోవైపు స్థానిక కాంగ్రెస్ నాయకులు మాత్రం మామ అల్లుళ్లను పార్టీలో చేర్చుకోవద్దని హైకమాండ్‌కు చెప్పారని, దాని వల్లే వాళ్లకు ఎలాంటి హామీ లభించలేదనే చర్చ సాగుతోంది.

క్లీన్.. డ్రెయిన్

వంద శాతం మురుగు శుద్ధి వైపు అడుగులు



- ఇప్పటికే రెండు కొత్త ఎస్టీపీల ద్వారా శుద్ధి
- మరికొన్ని నిర్మాణాలు పూర్తి చేసుకొని ట్రయల్ రన్
- మరో రెండు రోజుల్లో రెండు ఎస్టీపీలు ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరంలో వంద శాతం మురుగు శుద్ధివైపు జలమండలి అడుగులేస్తోంది. మహానగర పరిధిలో రోజూ ఉత్పన్నమయ్యే మురుగు నీటిని శుద్ధి చేసేందుకు కొత్త మురుగు నీటి శుద్ధి కేంద్రం(ఎస్టీపీ)ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే 15 ఎంఎల్‌డీల సామర్థ్యంతో నిర్మించిన కోకాపేట ఎస్టీపీ, సుమారు 7 ఎంఎల్డీల సామర్థ్యంతో నిర్మించిన దుర్గం చెరువు మురుగు నీటి శుద్ధి కేంద్రాలు ప్రారంభయ్యాయి. మరోవైపు ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన పలు ఎస్టీపీలకు ట్రయల్ రన్స్ కొనసాగుతున్నాయి. మరో రెండు రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పాతబస్తీలోని మీరాలం, ఉప్పల్‌లోని నల్ల చెరువు ఎస్టీపీల ప్రారంభానికి రంగం సిద్ధమైంది.

మూడు ప్యాకేజీలో..

మహానగరంలో మొత్తం 3 ప్యాకేజీల్లో 5 సర్కిళ్లలో సుమారు రూ.3,866.41 కోట్ల వ్యయంతో 1259.50 ఎంఎల్‌డీల సామర్థ్యం గల 31 మురుగు నీటి శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీ) నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇందుకు అధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీ వినియోగిస్తున్నారు.

- ప్యాకేజీ–1లో అల్వాల్, మల్కాజ్‌గిరి, కాప్రా, ఉప్పల్ సర్కిల్ ప్రాంతాల్లో రూ.1,230.21 కోట్లతో 8 ఎస్టీపీలను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా 402.50 ఎంఎల్‌డీల మురుగు నీటిని శుద్ధి జరగనుంది.
- ప్యాకేజీ–2లో రాజేంద్రనగర్, ఎల్బీనగర్ సర్కిల్ ప్రాంతాల్లో రూ.1,355.13 కోట్లతో 6 ఎస్టీపీలను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ 480.50 ఎంఎల్‌డీల మురుగు నీటిని శుద్ధి చేయనున్నారు.
- ప్యాకేజీ–3లో కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి సర్కిల్ ప్రాంతాల్లో రూ.1,280.87 కోట్ల వ్యయంతో 17 ఎస్టీపీలను ఏర్పాటు చేసి, ఇక్కడ 376.50 ఎంఎల్‌డీల మురుగు నీటిని శుద్ధి చేయనున్నారు.

దినసరి మురుగునీరు 1950 ఎంఎల్‌డీలపైనే..

హైదరాబాద్ అర్బన్ అగ్లోమెరేషన్ పరిధిలో ప్రస్తుతం రోజూ 1950 ఎంఎల్‌డీల మురుగు నీరు ఉత్పన్నమవుతోంది. జీహెచ్‌ఎంసీ ప్రాంతంలో 1650 ఎంఎల్‌డీలుగా ఉండగా, ఇప్పటికే 25 ఎస్టీపీల ద్వారా 772 ఎంఎల్‌డీల మురుగు నీటిని(46 శాతం) శుద్ధి చేస్తున్నారు. మిగిలిన 878 ఎంఎల్‌డీల మురుగు నీటిని శుద్ధి చేయడానికి ఎస్టీపీల నిర్మాణాలను చేపట్టింది. 2036 సంవత్సరం వరకు ఉత్పన్నమయ్యే మురుగును వీటి ద్వారా శుద్ధి చేసేందుకు వెసులుబాటు ఉంది.



పండ్ల‘బాట’లో..

శివరాత్రి సందర్భంగా బాటసింగారం పండ్ల మార్కెట్‌కు గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో వివిధ రకాల పండ్లు దిగుమతి అయ్యాయి. బాటసింగారంతో పాటు జామ్‌బాగ్, ఎర్రగడ్డ, అఫ్జల్‌గంజ్‌తో పాటు ఇతర చిన్న ఫ్రూట్ మార్కెట్లు కలుపుకొని గ్రేటర్ పరిధిలో 15 వేల టన్నుల వివిధ రకాల పండ్ల విక్రయాలు జరుగుతాయని మార్కెట్ అధికారుల అంచనా వేస్తున్నారు. – సాక్షి, సిటీబ్యూరో

తగ్గేదేలే

ఎంపీ స్థానాల కైవసానికి పార్టీల కసరత్తు



- గ్రేటర్ పరిసరాల్లో గెలుపు కోసం ప్రత్యేక దృష్టి
- ఇతర పార్టీల నేతలకు కాంగ్రెస్, బీజేపీ వల
- ఎదురీదైనా గెలవాలనుకుంటున్న బీఆర్ఎస్
- ఎంపీ ఎన్నికలకు ముందు రసవత్తరంగా రాజకీయం

సాక్షి, సిటీబ్యూరో: నిన్నటి దాకా ఒక లెక్క.. ఇప్పటి నుంచి ఇంకొక లెక్క..! తగ్గేదేలే..! పెరిగేదే ఇక.. ఇలాంటి పంచ్ డైలాగుల్ని తలపించే పరిస్థితి ప్రస్తుతం గ్రేటర్ నగర రాజకీయంలో కనిపిస్తోంది. రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ వేటికవే త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలనుకుంటున్నాయి. ఈ ఎన్నికల్లో విజయమే తమ పార్టీ భవిష్యత్తుకు సూచికగా భావిస్తున్నాయి. అందుకు దేని కారణాలు దానికున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, జీహెచ్ఎంసీ పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉనికి లేకపోవడం వెలితిగా భావిస్తోంది. దాన్ని అధిగమించేందుకు గ్రేటర్ పరిసరాల్లో ఎక్కువ ఎంపీ సీట్లను గెలుచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోంది. అందులో భాగంగా ఇతర పార్టీల నుంచి.. ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, జెడ్పీ చైర్మన్లను ఆకర్షించడంలో సఫలమవుతోంది. దీంతోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనేలా పలు కార్యక్రమాల ప్రారంభోత్సవాలు నిర్వహిస్తూ, ప్రచారాన్ని ఇప్పటికే ముమ్మరం చేసింది. ఈనెల 12వ తేదీ వరకు ఆయన కార్యక్రమాలున్నాయి. రేపోమాపో అభ్యర్థులను కూడా ప్రకటించాక ప్రచారాన్ని మరింత తీవ్రతరం చేయనుంది. దాంతోపాటు పార్టీ అధికారంలోకి వచ్చాక గడచిన మూడు నెలల్లో చేసిన కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా ఎక్కువ ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగరేయాలని భావిస్తోంది.

అభ్యర్థులను ప్రకటించి ముందంజలో బీజేపీ..

ఇక బీజేపీ మిగతా పార్టీల కంటే ముందస్తుగానే హైదరాబాద్, పరిసరాల్లోని నియోజకవర్గాలకు తమ ఎంపీ అభ్యర్థులను ప్రకటించింది. అంతకుముందు నుంచే విజయ సంకల్ప యాత్రల పేరిట ప్రజల చెంతకు వెళ్లే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం తెలిసిందే. ఈసారి దేశవ్యాప్తంగా ఎక్కువ సీట్లు గెలవాలనే లక్ష్యాన్ని చేరుకునేందుకు నగరం, చుట్టుపక్కల ఎంపీ సీట్లను ఎక్కువగా గెలుచుకునే లక్ష్యంతో పనిచేస్తోంది. అయోధ్యలో రామమందిర నిర్మాణం వంటివాటిని ప్రస్తావిస్తూ కేంద్రంలోని తమ ప్రభుత్వం రాష్ట్రంలోని ఆయా పథకాలకిచ్చిన నిధులు వంటి అంశాలను ప్రస్తావిస్తోంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతాల్లో స్కైవేల నిర్మాణాలకు అనుమతుల వంటి వాటినీ ప్రస్తావిస్తూ అధిక స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా పని చేస్తోంది. ప్రధాని మోదీ ఇటీవలి పటాన్‌చెరు, హైదరాబాద్ పర్యటనలు తమకు కలిసివచ్చే అంశాలుగా పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

ఏ పార్టీలో ఏం జరగనుందో..

కాంగ్రెస్, బీజేపీ రెండూ తాము చేసిన.. చేస్తున్న పనులతో ప్రజలను ఆకట్టుకునే పనిలో పడగా, బీఆర్ఎస్ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గతంలో తాము చేసిన కృషివల్లే సదరు ప్రాజెక్టులొచ్చాయని చెప్పే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, వాటికంటే ఎక్కువగా పార్టీలోని ముఖ్య నేతలను కాపాడుకునేందుకు ఎక్కువ కసరత్తు చేయాల్సి వస్తోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు టిక్కెట్లు ఖరారు చేసిన, చేయాలనుకుంటున్న వారు సైతం వెనకడుగు వేస్తుండటం ఆ పార్టీకి ఇరకాటంగా మారింది. మల్కాజ్‌గిరి టిక్కెట్ కోసం మల్లారెడ్డి కొడుకు భద్రారెడ్డి, చేవెళ్ల నుంచి పోటీకి రంజిత్‌రెడ్డి వెనుకడుగు ఇందుకు దృష్టాంతాలు. అంతేకాదు.. మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖరరెడ్డి కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయంటున్నారు. గురువారం వారిద్దరూ సీఎం సలహాదారు వేం.నరేందర్ రెడ్డిని కలవడం.. బుధవారం ఎల్ఆర్ఎస్ ఫీజులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నిర్వహించిన ధర్నాకు మల్లారెడ్డి హాజరుకాకపోవడం ఇందుకు ఊతమిస్తున్నాయని చెబుతున్నారు. నగరానికి సమీపంలోని నల్లగొండ, భువనగిరి సీట్లపైనా దాదాపుగా ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని అంటున్నారు. ఆ రెండింటిలో ఎక్కడి నుంచైనా పోటీ చేయాలని జిల్లాకు చెందిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు అమిత్‌రెడ్డి ప్రయత్నించారు. పార్టీ నేతల నుంచి వ్యతిరేక పవనాలు వీస్తుండటం గుర్తించి వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా, అన్నింటికీ ఎదురీది ఎంపీ ఎన్నికల్లో ఎక్కువ సీట్ల గెలుపుతోనే ఇతర పార్టీలకు సమాధానం చెప్పాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ఉంది. తమకు ఎదురులేదని నిరూపించుకునేందుకు కష్టపడుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లోగా ఏ రోజు ఏ పార్టీలో ఏం జరగనుందన్నది ఆసక్తికరంగా మారింది.

రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న ఉస్మాన్ సాగర్ జలాశయంలోని కాండూట్ (నీటి కాలువ)కు హకీంపేట్ ఎంఈఎస్ వద్ద ఏర్పడిన భారీ నీటి లీకేజీని అరికట్టడానికి శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు మరమ్మతు పనులు నిర్వహించనున్న కారణంగా 18 గంటల పాటు పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని జలమండలి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఇవే ప్రాంతాల్లో అంతరాయం

నగరంలోని విజయ్‌నగర్ కాలనీ, హుమాయున్ నగర్, కాకతీయ నగర్, సయ్యద్ నగర్, ఎంఈఎస్, రెడ్ హిల్స్ రిజర్వాయర్ పరిధిలోని బజార్‌ఘాట్, ఏసీ గార్డ్స్, రెడ్‌హిల్స్, ఇన్‌కంటాక్స్ ఏరియా, సెక్రటేరియట్, సీబీ క్వార్టర్స్, ఇందిరానగర్, బీజేఆర్ కాలనీ, అడ్వకేట్ కాలనీ, హిల్స్ కాలనీ, గోకుల్‌నగర్, నాంపల్లి రైల్వే స్టేషన్, జంగంబస్తీ, అసెంబ్లీ, ఎస్బీబీ నాంపల్లి, ఖైరతాబాద్, మల్లేపల్లి, లక్డీకాపూల్, సీతారాంభాగ్, గన్‌ఫౌండ్రీ, చిరాగ్ అలీ లేన్, అబిడ్స్, న్యూఎమ్మెల్యే క్వార్టర్స్, ఎల్బీ స్టేడియం, బీఆర్కే భవన్, బిర్లా మందిర్, హిందీనగర్, గోడ్ ఖబర్, దోమల్‌గూడ, గాంధీనగర్, ఎమ్మెల్యే కాలనీ, సయ్యద్‌నగర్, తట్టిఖాన, ఎన్‌బీజే నగర్, నూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఈ ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి వర్గాలు సూచించాయి.

నేడు పాతబస్తీ మెట్రోకు శంకుస్థాపన

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ మెట్రో రైల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ఆధ్వర్యంలో ఫలక్‌నుమా వద్ద జరగనున్న ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొంటారు. మెట్రో మొదటి దశలోనే జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు పూర్తి చేయాల్సిన గ్రీన్ లైన్ పనులు మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ వరకే పరిమితమయ్యాయి. దీంతో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మిగిలిన 5.5 కిలోమీటర్ల మార్గాన్ని ప్రస్తుత రెండో దశలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే పాతబస్తీ మెట్రో పనులను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించనున్నారు. పాతబస్తీ మెట్రో నిర్మాణానికి సుమారు రూ.2 వేల కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. ఫలక్‌నుమా నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న చాంద్రాయణగుట్ట వరకు మెట్రోను పొడిగించి అక్కడి నుంచి మైలార్‌దేవ్‌పల్లి, పీ–7 రోడ్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రోను పొడిగిస్తారు.



ఫలక్‌నుమాలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

కరెంటుకు ‘పీక్’ డిమాండ్

గ్రేటర్‌లో బుధవారం 69.31 ఎంయూలు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలకు ఉక్కపోత తోడైంది. ఉపశమనం కోసం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వినియోగం పెరిగింది. ఫలితంగా ఇంట్లో కరెంట్ మీటర్ గిర్రున తిరుగుతోంది. నెలవారీ విద్యుత్ బిల్లులు కూడా అమాంతం పెరిగే అవకాశం ఉంది. బుధవారం అత్యధికంగా 69.31 మిలియన్(3188 మెగావాట్లు) యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. తాజాగా గురువారం 3271 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. గత ఏడాది(2527 మెగావాట్ల)తో పోలిస్తే ఈ సారి 11 ఎంయూలు అధికంగా నమోదు కావడం విశేషం. 2023 మే 19న 79.33 ఎంయూలు నమోదైంది. డిస్కం చరిత్రలో ఇది ఆల్‌టైం రికార్డు. సాధారణంగా ఏప్రిల్, మే మాసాల్లో నమోదు కావాల్సిన రికార్డులు.. ఈ సారి మార్చిలోనే నమోదయ్యే అవకాశం లేకపోలేదని డిస్కం అంచనా వేస్తోంది. సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఎప్పటికప్పుడు లోడ్ మానిటరింగ్‌పై పర్యవేక్షణ చేస్తూ.. సరఫరాలో అంతరాయాలు లేకుండా చూస్తున్నారు. ఇదిలా ఉంటే రోజు రోజుకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను చూసి క్షేత్రస్థాయి ఇంజినీర్లు ఆందోళన చెందుతున్నారు. లైన్ల సామర్థ్యానికి మించి డిమాండ్ నమోదవుతుండటం, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు హీటెక్కుతుండటం, సబ్ స్టేషన్లలోని ఫీడర్లు ట్రిప్పవుతుండటం, రెప్పపాటు కరెంట్ కూడా పోకుండా చూడాలని ప్రభుత్వం నుంచి వారికి స్పష్టమైన ఆదేశాలు ఉండటం, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఇంజినీర్లపై చర్యలు తీసుకుంటుండటం వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.



రాజీవ్ రహదారిపై చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ పనులకు అల్వాల్ టిమ్స్ ఆవరణలో గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమానికి వస్తూ ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఆస్తిపన్ను వసూళ్లకు సీనియర్ అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను లక్ష్యాన్ని సాధించేందుకు వసూళ్లు పెంచేందుకు జీహెచ్ఎంసీ సర్కిళ్ల వారీగా సీనియర్ అధికారులను నియమించారు. ఈ అధికారులు భారీ బకాయిల వడ్డీలపై రాయితీ ఇస్తూ ప్రభుత్వం కల్పించిన ఓటీఎస్ సదుపాయాన్ని వినియోగించుకోవాల్సిందిగా సంబంధిత యజమానులకు సూచించడంతో పాటు సర్కిళ్ల వారీగా టాప్ డిఫాల్టర్స్‌ను, ఈ సంవత్సరం పెద్దమొత్తాల్లో ఆస్తిపన్ను చెల్లించాల్సిన వారిని గుర్తించి వారితో సంప్రదింపులు జరపనున్నారు. చెక్‌బౌన్స్ కేసుల్లోనూ తగిన శ్రద్ధ చూపనున్నారు. ప్రభుత్వ విభాగాల భవనాలకు సంబంధించిన ఆస్తిపన్ను చెల్లించేలా సంబంధిత అధికారులతోనూ సంప్రదింపులు జరపనున్నారు. ఈ అధికారులు ఏరోజుకారోజు తమకు కేటాయించిన సర్కిల్ వసూళ్లను సమీక్షిస్తూ వసూళ్ల వివరాలను, అవసరమైన ఫొటోలతో సహ సంబంధిత వాట్సాప్‌లో పోస్ట్ చేయాల్సిందిగా కమిషనర్ రోనాల్డ్‌రాస్ ఆదేశించారు.

అధికారులకు పబ్లిక్ సెలవులు రద్దు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి కార్యకమాల పనుల ప్రారంభోత్సవం నేపథ్యంలో హైదరాబాద్ కలెక్టరేట్‌లోని అధికారులు, తహసీల్దార్లు, సూపరింటెండెంట్లు, సిబ్బంది ఈ నెల 8, 9, 10 తేదీల్లో పబ్లిక్ సెలవులను ఉపయోగించుకోవద్దని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

కీసరలో కల్యాణ మహోత్సవం




కీసర: బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన శ్రీభవానీ, శివదుర్గా సమేత శ్రీరామలింగేశ్వర స్వామివార్ల కల్యాణం గురువారం రాత్రి అశేష భక్తజనుల సమక్షంలో శోభాయమానంగా జరిగింది. నంది వాహనసేవ ద్వారా కీసరగుట్టకు స్వామివారు చేరుకోగానే కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎండోమెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణంలో పాల్గొన్నారు.



‘తరుణి’మయం..

- వేదికలేవైనా వినూత్న ఆలోచనలతో రాణిస్తున్న మహిళలు..
- బిజినెస్ మొదలు ఆన్‌లైన్ వేదికల్లోనూ తమ ప్రస్థానం..



సామాజిక రంగాలైనా, కళాత్మక వేదికలైనా, వ్యాపార–విజ్ఞాన సర్వస్వాలైనా.. ఇలా రంగమేదైనా అందులో రాణించడం, తమ ప్రస్థానాన్ని ఉజ్వలంగా నిలుపుకోవడంలో మహిళలు ముందున్నారు. గత కాలపు అటంకాలను, సామాజిక అడ్డంకులను ఛేదిస్తూ ప్రతీ రంగంలో తమ ప్రశస్తిని ప్రదర్శిస్తున్నారు. నేటి ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో తమ ప్రత్యేకతను చాటుకుంటూ మహిళా సాధికారతకు నిదర్శనంగా నిలిచిన మహిళలు తమ ప్రయాణాన్ని సాక్షితో పంచుకున్నారు..! – సాక్షి, సిటీబ్యూరో

ప్రతి మహిళకు ప్రత్యేక గుర్తింపు ఉండాలి..

– యూట్యూబర్ జుబేదా, అలీ భార్య



ప్రతి మహిళకు తనకంటూ ఒక ప్రత్యేకత, గుర్తింపు ఉండాలనేది నా ఆలోచన. సినీ నటుడు అలీ భార్యగానే కాకుండా నాకంటూ ఒక గుర్తింపు కావాలి అనుకున్నాను. నేను సరదాగా చేసిన ఇన్‌స్టా రీల్స్‌ను చాలా మంది యూట్యూబర్లు వారి ఛానల్స్‌లో అప్‌లోడ్ చేసి వ్యూయర్‌షిప్ పెంచుకుంటున్నారు. అదేదో నేనే మొదలు పెడితే బాగుంటుందని జుబేదా అలీ యూట్యూబ్ ఛానల్ స్టార్ట్ చేశా. నా వీడియోలకు మంచి స్పందన లభిస్తూ ప్రస్తుతం 1.2 మిలియన్ సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. మా నమాజ్ రూం వీడియోతో ప్రయాణం ప్రారంభించాను. ఎక్కువగా నాకిష్టమైన వంటల వీడియోలు అప్‌లోడ్ చేస్తుంటాను. మా అత్త జైతున్ బీబీ ప్రతి గురువారం ఇంట్లో వంట వండి బయట అన్నార్థులకు పంచేది. ఈ ఆనవాయితీని నెలలో ఒకరోజు నేనూ కొనసాగిస్తున్నాను. ఆహారంతో పాటు వారికి అవసరమైన దుస్తులు, దుప్పట్లు, గొడుగులు అందిస్తుంటాను. ఈ వీడియోలకు మంచి స్పందన రావడమే కాకుండా మా అభిమానులు సైతం దీన్ని స్ఫూర్తిగా తీసుకుని వారూ అన్నదానం చేయడం ఎంతో సంతృప్తినిచ్చింది. కొన్ని సార్లు నెగెటివ్ కామెంట్లు వచ్చిన సమయంలో కుంగిపోయాను. వంద మంచి కామెంట్లలో ఒక్క చెడు కామెంట్‌ను ఎందుకు పట్టించుకోవాలి అని నా కూతురు సూచించి ప్రోత్సాహం అందించింది. ఈ ప్రయాణంలో ఆహ్లాదానికే కాకుండా ఆదాయమూ ఉంది. యూట్యూబ్ నుంచి వచ్చిన నా సొంత డబ్బులతో నా భర్త అలీని గోవా టూర్‌కు తీసుకెళ్లడం ఎంతో సంతృప్తినిచ్చింది.

రెండు పార్శ్వాలను సమర్థవంతంగా..

– సినీనటి కాజల్ అగర్వాల్



అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు..!! మహిళల జీవన ప్రయాణం విభిన్నంగా ఉంటుంది. వృత్తి పరమైనవే కాకుండా కుటుంబ బాధ్యతలతో వ్యక్తిగత జీవితాన్ని చూసుకోవాలి. ముఖ్యంగా ఒక తల్లిగా అతి పెద్ద బాధ్యతను నిర్వర్తించాల్సి వస్తుంది. ప్రస్తుతం నేను ఈ అద్భుత స్థానంలో ఉన్నాను. ఒక బాబుకు తల్లిగా జీవితంలో అత్యంత సంతృప్తికర ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాను. ఇదే సమయంలో ఎప్పటిలాగే సత్యభామ, ఇండియన్–2 వంటి టాప్ సినిమాల్లోనూ నటిస్తున్నాను. ఇలా రెండు పార్శ్వాలను సమర్థవంతంగా నిర్వర్తించడంలో మహిళలు నేర్పరులు.

ప్రోత్సాహమందిస్తే అద్భుతాలే..

దీప్తి రావుల, వీ–హబ్ సీఈఓ

చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాలు మరేవైనా సరే.., ఆయా రంగాల్లో రాణించగలిగే ఆత్మవిశ్వాసం, సత్తా మహిళలకుంది. కానీ సామాజికంగా లేదా ఆర్థిక పరమైన వెనుకబాటు వారి విజయాలకు అడ్డుకట్టగా మారింది. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళల అభ్యున్నతికి వీ–హబ్ ప్రత్యేకంగా కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా సఫా ఇండియాతో సంయుక్తంగా ‘ఉజాగర్’ పేరుతో పాతబస్తీకి చెందిన ముస్లిం స్త్రీలకు వ్యాపారంలో శిక్షణతో పాటు మౌలిక సదుపాయాలు, ఆర్థిక చేయూతను అందిస్తుంది. ఈ శిక్షణ పొందిన అంజుమ్ ఫాతిమా మంచి వ్యాపారవేత్తగా మారింది. అంజుమ్ ఫాతిమా ‘లే సావోన్’ పేరుతో పురాతన కాలంలో లాగా సహజసిద్ధమైన పదార్థాలతో స్కిన్ కేర్ ఉత్పత్తులను తయారు చేసే బ్రాండ్‌ను కొనసాగిస్తుంది. ప్రధానమంత్రి ఉపాధి కల్పన (పీఎంఈజీపీ) పథకం కింద క్రెడిట్ లింకేజ్ మద్దతు కూడా లభించింది. అలాగే నిశాత్ నేహా అనే మహిళ కుట్టు మిషన్‌పై బట్టలు కుడుతూ జీవనం సాగించేది. ఆమె ఉజాగర్‌లో భాగంగా కస్టమర్లను ఎలా ఆకర్షించాలి, యువతకు నచ్చేలా ఎలాంటి డిజైన్లు రూపొందించాలి? కొత్త ట్రెండ్స్‌ను ఎప్పటికప్పుడు ఫాలో అవటం వంటి అంశాలపై శిక్షణ పొంది సొంతంగా ఫ్యాషన్ డిజైనింగ్‌తో పాటు ట్రయినింగ్ సెంటర్‌ను కూడా నడుపుతుంది.

బాలికల ఆరోగ్యం కోసం 'తేజస్విని'

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ మల్టీ-స్పెషాలిటీ హెల్త్‌కేర్ గ్రూప్‌లలో ఒకటైన కేర్ హాస్పిటల్స్, జగతి ఫౌండేషన్, కోనెక్సస్‌లతో కలిసి 'తేజస్విని' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. నగరంలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లో 9 ఏళ్ల పైబడిన బాలికలకు ఈ కార్యక్రమం ద్వారా పరిశుభ్రత, రుతుక్రమం, గర్భాశయ కేన్సర్లపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. బాలికలకు గర్భాశయ కేన్సర్ వ్యాక్సినేషన్ దిశగా కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని కేర్ హాస్పిటల్స్ గ్రూప్ చీఫ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ శలభ్ డాంగ్ తెలిపారు.



'సాహితి' చుట్టూ బిగుస్తున్న ఉచ్చు!

- ఉన్నతోద్యోగుల పాత్రపై లోతుగా దర్యాప్తు
- మార్కెటింగ్ డైరెక్టర్ ఇంట్లో సీసీఎస్ సోదాలు
- పరారీలో ఉన్న లక్ష్మీనారాయణ కోసం గాలింపు
- ఆస్తుల గుర్తింపు కొనసాగిస్తున్న ప్రత్యేక బృందం

సాక్షి, సిటీబ్యూరో: ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో తెలుగు రాష్ట్రాలకు చెందిన 2,728 మంది నుంచి రూ.1,110 కోట్లు స్వాహా చేసిన సాహితి ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కేసు దర్యాప్తులో వేగం పెరిగింది. హైదరాబాద్ నగర నేర పరిశోధన విభాగంలో (సీసీఎస్) ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం గురువారం నగరంలోని పది ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. లెక్కల్లో చూపని రూ.30 లక్షల నగదుతో పాటు కీలక పత్రాలు స్వాధీనం చేసుకుంది. వేల మంది భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ కేసు దర్యాప్తునకు నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి కీలక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆయన ఆదేశాల మేరకు డీసీపీ ఎన్.శ్వేత పర్యవేక్షణలో ఏసీపీ టీఎస్ ఉమామహేశ్వరరావు కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంస్థ తరఫున పని చేసిన మార్కెటింగ్ టీమ్ కూడా భారీ స్కామ్‌కు పాల్పడినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఇతర రియల్ ఎస్టేట్ సంస్థ తరహాలోనే సాహితి ఇన్‌ఫ్రా సంస్థ కూడా దాదాపు ఔట్ సోర్సింగ్ పంథాలో మార్కెటింగ్ విభాగాన్ని నిర్వహించింది. ఈ వింగ్‌కు సందు పూర్ణచంద్రరావు డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఇందులో పని చేసే వారికి నెలవారీ జీతాలతో పాటు ప్రతి లావాదేవీపై 10 నుంచి 15 శాతం వరకు కమీషన్ ఇచ్చేవారు. ఆర్థిక లావాదేవీల కోసం మరామీ అనే సాఫ్ట్‌వేర్‌ను వినియోగించారు. ఇందులో ఉన్న చిన్న లోపాన్ని క్యాష్ చేసుకున్న సందు పూర్ణచంద్రావు మార్కెటింగ్ అధికారుల సాయంతో భారీ మొత్తం కాజేశారు. ఫ్లాట్లు ఖరీదు చేసిన వారి నుంచి చెక్కులు, నగదు రూపంలో డబ్బు వసూలు చేశారు. వినియోగదారుడికి మాత్రం మొత్తానికి రసీదు ఇచ్చారు. సాహితి సంస్థకు మాత్రం చెక్కుల ద్వారా వచ్చిన మొత్తాన్నే జమ చేసి, నగదును స్వాహా చేశారు. కొందరు కస్టమర్లు ఆన్‌లైన్‌లో చెల్లింపునకు ఆసక్తి చూపారు. నేరుగా సాహితీ సంస్థకు చెల్లిస్తే జీఎస్టీ భారీగా ఉంటుందంటూ మార్కెటింగ్ టీమ్ చెప్పింది. తాము చెప్పిన ఖాతాలోకి బదిలీ చేస్తే జీఎస్టీ ఉండదంటూ కాజేశారు. వినియోగదారులకు వాళ్లు చెల్లించిన మొత్తానికీ రసీదులు ఇచ్చినా... మరామీ సాఫ్ట్‌వేర్‌లోకి ప్రవేశించి ఎడిట్ చేయడం ద్వారా సాహితీ సంస్థకు మాత్రం తాము నిర్దేశించిన మొత్తం చేరినట్లు కనిపించేలా చేశారు. కొన్నాళ్ల క్రితం ఈ మోసాన్ని గుర్తించిన లక్ష్మీనారాయణ కొందరు ఉన్నతోద్యోగులు దాదాపు రూ.100 కోట్ల మేర కాజేసినట్లు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో మాదాపూర్ ఠాణాలో కేసు కూడా నమోదైంది. దీంతో దిగి వచ్చిన పూర్ణచంద్ర రావు సహా కొందరు ఉద్యోగులు రూ.40 కోట్లు తిరిగి చెల్లించారు. మిగిలిన మొత్తం ఇచ్చేస్తామంటూ లక్ష్మీ నారాయణతో ఒప్పందం చేసుకుని కేసు రాజీ చేయించారు. ఆపై రూ.60 కోట్లు తిరిగి ఇవ్వకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇలా మార్కెటింగ్ డైరెక్టర్, టీమ్స్ ఏ స్థాయిలో స్కామ్‌కు పాల్పడ్డాయో గుర్తించేందుకు సీసీఎస్ పోలీసులు పలువురు ఏజెంట్ల వాంగ్మూలాల నమోదు చేశారు. గురువారం సీసీఎస్ పోలీసులు పూర్ణచంద్రరావు ఇల్లు, కార్యాలయాలతో పాటు నగర శివార్లలోని 9 ఎకరాల భూమి విక్రయిస్తానంటూ లక్ష్మీనారాయణతో ఒప్పందం చేసుకుని, నగదు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన గేదెల శ్రీనుబాబు ఇళ్లు, కార్యాలయాల్లోనూ సోదాలు చేశారు. వీరిద్దరితో పాటు ఐదుగురు బడా ఫైనాన్షియర్లకు సంబంధించిన ప్రాంతాలతో కలిపి మొత్తం 10 చోట్ల ఈ సోదాలు జరిగాయి. సాహితి, దాని అనుబంధ సంస్థలతో పాటు యాజమాన్యం, వారి కుటుంబీకులు, బంధువులు, స్నేహితుల పేర్లతో ఉన్న ఆస్తులను ప్రత్యేక బృందం గుర్తిస్తోంది. దీని కోసం సిట్ అధికారులు రెండు రాష్ట్రాల్లోని సబ్-రిజిస్ట్రార్‌లకు లేఖలు రాశారు. ఆస్తులపై ఓ స్పష్టత వచ్చిన తర్వాత వాటిని ఎటాచ్‌మెంట్ చేయాలని కోరుతూ ప్రభుత్వానికి సీసీఎస్ అధికారులు లేఖ రాయనున్నారు. వీటిని వీలైనంత త్వరగా లిక్విడేషన్ చేయడానికి ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నారు. మరోపక్క అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన లక్ష్మీనారాయణతో పాటు ఆయన కుటుంబీకుల కోసమూ సీసీఎస్ పోలీసులు గాలిస్తున్నారు.

అన్నింటా మహిళల పురోగతి

ఎస్‌బీఐ జీఎం ప్రకాష్ చంద్ర బరోడ్



లక్డీకాపూల్ : దేశంలో అన్ని రంగాల్లో మహిళలు ముందంజ వేస్తున్నారని వారు ప్రగతి సాధించని రంగం లేనే లేదని స్టేట్ బ్యాంకు స్టాఫ్ కాలేజీ డైరెక్టర్, జనరల్ మేనేజర్ ప్రకాష్ చంద్ర బరోడ్ అన్నారు. గురువారం బేగంపేటలోని ఎస్‌బీఐ స్టాఫ్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. సినీ నేపథ్య గాయని చాగంటి సాహితిని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సమాజంలో ఎందరో మహిళలు పలువురికి ప్రేరణ కలిగిస్తూ.. మార్గదర్శకంగా నిలుస్తున్నారన్నారు. ఈ నెల 11న కూడా పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎంలు వెంకట్ శాస్త్రి, అజయ్, అయ్యర్, జోసెఫ్ క్రిస్టీ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT AT HYDERABAD

OS.NO. 454 OF 2023

Between : M/s Jagati Publications Limited, Having its registered office at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad, Telangana - 500034, Rep By its authorized signatory Mr. M.V. Bharath Kishore. ...Plaintiff

AND

1. M/s. Aim Vyapthi Advertising Pvt. Ltd,
2. Mr. Vempally Niranjan Reddy,
3. Mrs. Suneetha Reddy,
4. Mr. Dheeraj Reddy Bakaram,
5. Mr. Vempalli Yuvadheer Reddy

...Defendants

To,

4. Mr. Dheeraj Reddy Bakaram, Director of Aim Vyapthi Advertising Pvt. Ltd., 4a, Gayathri Nest Apartment, Plot No. 78, Cyber Hills, Guntala Begumpet, Near Alamgir Masjid, Madhapur, Hyderabad, Telangana - 500081. ...Defendant No.4

5. Mr. Vempalli Yuvadheer Reddy, Director of Aim Vyapthi Advertising Pvt. Ltd., 6-3-562/10, Flat No. 402, Amara Residency, Erramanzil Colony, Opp. Asian Institute of Nephrology, Somajiguda, Hyderabad - 500082. ...Defendant No.5

Please take notice that the above-named Plaintiff had filed the above Suit for Recovery of Money before the Hon'ble II Additional Civil Judge, City Civil Court, At Hyderabad, against you the Defendants, and the same was registered as OS. No. 454 of 2023 and the Hon'ble Court has adjourned the above said matter to 20.03.2024 for the appearance of Defendant No. 4 and Defendant No. 5. Please be present before the II Additional Chief Judge, City Civil Court, at Hyderabad on 20.03.2024 at 10:30 AM either in person or through your advocate, failing which the matter shall be decided in your absence and based upon merits.

(BY ORDER OF COURT)
G. ASHOK REDDY, Advocate
(Contact No: 9848450051)
1st Floor, SVSKL Mansions, 3-6-369/A/18, Street No.1, Himayatnagar, Hyderabad-500029.

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT AT HYDERABAD

OS.NO. 455 OF 2023

Between: M/s Indra Television Limited, Having its registered office at 6-3-248/3, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad, Telangana - 500034, Rep By its authorized signatory Mr. S. Ramanjaneyulu. ...Plaintiff

AND

1. M/s. Aim Vyapthi Advertising Pvt. Ltd,
2. Mr. Vempally Niranjan Reddy,
3. Mrs. Suneetha Reddy,
4. Mr. Dheeraj Reddy Bakaram,
5. Mr. Vempalli Yuvadheer Reddy

...Defendants

To,

4. Mr. Dheeraj Reddy Bakaram, Director of Aim Vyapthi Advertising Pvt. Ltd., 4a, Gayathri Nest Apartment, Plot No. 78, Cyber Hills, Guntala Begumpet, Near Alamgir Masjid, Madhapur, Hyderabad, Telangana - 500081. ...Defendant No.4

5. Mr. Vempalli Yuvadheer Reddy, Director of Aim Vyapthi Advertising Pvt. Ltd., 6-3-562/10, Flat No. 402, Amara Residency, Erramanzil Colony, Opp. Asian Institute of Nephrology, Somajiguda, Hyderabad - 500082. ...Defendant No.5

Please take notice that the above-named Plaintiff had filed the above Suit for Recovery of Money before the Hon'ble II Additional Civil Judge, City Civil Court, At Hyderabad, against you the Defendants and the same was registered as OS. No. 455 of 2023 and the Hon'ble Court has adjourned the above said matter to 20.03.2024 for the appearance of Defendant No. 4 and Defendant No. 5. Please be present before the II Additional Chief Judge, City Civil Court, at Hyderabad on 20.03.2024 at 10:30 AM either in person or through your advocate, failing which the matter shall be decided in your absence and based upon merits.

(BY ORDER OF COURT)
G Ashok Reddy, Advocate
(Contact No: 9848450051)
1st Floor, SVSKL Mansions, 3-6-369/A/18, Street No.1, Himayatnagar, Hyderabad-500029

సందడిగా 'మహిళా శక్తి బజార్'

- కాంటినెంటల్ ఆస్పత్రిలో 27 మంది బిజినెస్ విమెన్స్‌తో ఏర్పాటు
- ఆకట్టుకున్న స్టాళ్లు.



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, మహిళా వ్యాపారవేత్తలు

రాయదుర్గం: నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మహిళా శక్తి బజార్ ఏర్పాటు చేశారు. 27 మంది బిజినెస్ విమెన్స్ ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. మార్చి నెలలో 'రియల్ డైమండ్స్ ఆఫ్ హైదరాబాద్' పేరిట కాంటినెంటల్ ఆస్పత్రిలో వేడుకలను నిర్వహిస్తున్నారు. అనంతరం అత్యుత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగులు, డాక్టర్లకు అవార్డులతో సత్కరించారు. కాంటినెంటల్ ఆస్పత్రి వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ గురుఎన్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో వీహబ్ సీఈఓ దీప్తిరావుల, ఐఎస్‌బీ డైరెక్టర్ సుతాపపాద్దార్‌రామ్, బీజేపీ జాతీయ పాలసీ ఇన్‌చార్జీ కరుణగోపాల్ ఈ మహిళా శక్తి బజార్‌ను ప్రారంభించారు. సందర్భంగా ఆస్పత్రి వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ గురుఎన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు అండగా నిలుస్తామన్నారు. 27 మంది బిజినెస్ విమెన్స్‌లో ప్రతి ఒక్కరికీ ఓ విజయగాథ ఉందని వారికి తగిన ప్రోత్సాహం అందిచాల్సిన అవసరం ఉందన్నారు. వీహబ్ సీఈఓ దీప్తి రావు,సుతాపపాద్దార్‌రాయ్, బీజేపీ నాయకురాలు కరుణగోపాల్ వారికి సూచనలు చేశారు. కార్యక్రమంలో 27 మంది మహిళా వ్యాపారవేత్తలు, ఆస్పత్రి వైద్యులు, వైద్యబృందం పాల్గొన్నారు.

మహిళలకు సాధ్యం కానిది లేదు



ఉద్యోగినికి కేక్ తినిపిస్తున్న కొత్వాల్, చిత్రంలో అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్, సంయుక్త సీపీ పరిమళ నూతన్ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: అన్ని రంగాల్లోనూ పురుషుల కంటే మహిళలే మెరుగ్గా రాణిస్తున్నారని నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో గురువారం జరిగిన సిటీ పోలీసుల మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి రంగంలోనూ పురుషులతో సమానంగా మహిళలు పోటీ పడుతున్నారని, అన్ని అంశాల్లోనూ తమ సత్తా చాటేందుకు ముందుకు వస్తున్నారన్నారు. మహిళల్లో సంకల్ప శక్తి ఎక్కువగా ఉంటుందన్న కొత్వాల్ వారు అనుకుంటే ఏదైనా సాధించగలరని అన్నారు. మహిళా అధికారులందరూ ధైర్యంగా పని చేస్తూ భావి తరాలకు మార్గదర్శకంగా నిలువాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మహిళ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించారు. మహిళా అధికారులందరూ పోలీసు శాఖలో భాగమై సమాజానికి చేస్తున్న కృషిని కొత్వాల్ కొనియాడారు. కేక్ కట్ చేసి మహిళా ఉద్యోగులకు తినిపించారు. కార్యక్రమంలో అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్, సంయుక్త సీపీ జె.పరిమళా హానా నూతన్, డీసీపీలు డి.కవిత, రశ్మి పెరుమాల్ తదితరులతో పాటు కమిషనరేట్‌లోని మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

చరిత్రలో స్త్రీల స్థానం ప్రత్యేకం



సాక్షి, సిటీబ్యూరో: చరిత్రలో స్త్రీలకు ప్రత్యేక స్థానం ఉందని జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జలమండలి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పని, ఆలోచన విషయంలో ఆడ, మగ తేడా ఉండకూడదన్నారు. మహిళల కోసం అనేక చట్టాలున్నాయని.. కానీ వాటిని అమలు చేయడంలో విఫలమవుతున్నారన్నారు. ఫిన్లాండ్ దేశాల్లో చట్టసభల్లో అత్యధిక శాతం మహిళలే ఉన్నట్లు తెలిపారు. దేశంలోనూ అనేక విభాగాల్లో స్త్రీలదే పై చేయిగా ఉందన్నారు. రాఖీ కంకారియా మాట్లాడుతూ మహిళలు శక్తి స్వరూపులని, వారు లేకుంటే సృష్టే లేదన్నారు. వ్యక్తిగత, ఉద్యోగ ప్రయాణంలో వచ్చే అడ్డంకులన్నీ తొలగించుకుంటూ.. సొంత బలంతో విజయ పథంలో దూసుకెళ్లాలన్నారు. అనంతరం.. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, జలమండలి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏజీ సుగంధిని, జనరల్ సెక్రటరీ బిల్కిస్ భాను, అర్చనా వెంకటరెడ్డి, రాంబాబు యాదవ్, పి.నారాయణ పాల్గొన్నారు.

నగదు లావాదేవీలపై గట్టి నిఘా

జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్

సాక్షి, సిటీబ్యూరో: అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ బ్యాంకర్లను కోరారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బ్యాంకు కో-ఆర్డినేటర్లు, నగదు రవాణా ఏజెన్సీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. నగదు లావాదేవీలపై నిఘా ఉంచాలన్నారు. ఎవరైనా బ్యాంక్ ఖాతాలో ప్రతి రోజు రూ.లక్ష నగదు డిపాజిట్ చేసినా, విత్ డ్రా చేసినా, రూ.10 లక్షలు పైగా బదిలీ చేసినా గమనించాలన్నారు. అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలు, ఏటీఎం, యూపీఐ లావాదేవీల వివరాలను అందించాలని బ్యాంకు అధికారులను కోరారు. రూ.10 లక్షలు పైబడిన లావాదేవీలకు సంబంధించి ఆదాయ పన్ను శాఖకు వివరాలను అందించడం జరుగుతుందన్నారు. గత మూడు నెలలకు సంబంధించి నగదు లావాదేవీల నివేదికను బ్యాంకులు బ్రాంచీల వారీగా అందజేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, ఆర్‌బీఐ మేనేజర్ అంకిత్ అగర్వాల్, వివిధ బ్యాంకుల కో-ఆర్డినేటర్లు, నగదు రవాణా ఏజెన్సీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షల నగదు స్వాధీనం

గచ్చిబౌలి: రాయదుర్గంలో రూ.50 లక్షల హవాల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రాయదుర్గం సీఐ సీహెచ్ వెంకన్న తెలిపారు. గురువారం తెల్లవారుజామున సికింద్రాబాద్‌కు చెందిన హెచ్‌పీ గ్యాస్ డీలర్ విక్రం నగేష్ రూ.50 లక్షల నగదు తీసుకువెళుతున్నట్లు సమాచారం అందడంతో ఖాజాగూడలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమీపంలో ఎస్‌ఓటీ, రాయదుర్గం పోలీసులు వారి కారును తనిఖీ చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి ఆధారాలు చూపకపోవడంతో సీజ్‌చేసి ఇన్‌కంట్యాక్స్ అధికారులకు సమాచారం అందించారు. సికింద్రాబాద్ నుంచి గుల్బర్గాకు నగదు తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

అపోలో హాస్పిటల్స్ అసిస్టెంట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి



హఫీజ్‌పేట్ : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని అపోలో హాస్పిటల్స్ అసిస్టెంట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి అన్నారు. గురువారం చందానగర్‌లోని మహిళా దక్షిత సమితి విద్యా సంస్థల్లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, వైద్యం, వాయు, నౌక వివిధ రంగాల్లో మహిళలు దూసుకుపోతున్నారన్నారు. అనంతరం కవయిత్రి పుష్ప బన్సల్‌ను, కళాశాల యోగా విద్యార్థినులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ అలుగు వర్షిని, అర్చన హాస్పిటల్స్ ఎండీ స్పందన రెడ్డి, పల్లవి కటియర్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రమాకుమారి, సుశీల పాటిల్, మహిళా దక్షిత సమితి సొసైటీ సభ్యులు సుష్మ గోయంకా, మున్నా జకేతీయ, లక్ష్మి, లక్ష్మీకుమారి, అనురాధ, అనసూయ, నైనాదేవి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ బీభత్సం

- కారును ఢీకొనడంతో చిన్నారి మృతి
- మరో ముగ్గురికి గాయాలు



చిన్నారి మృతదేహం



ప్రమాదానికి కారణమైన వాటర్ ట్యాంకర్

రాజేంద్రనగర్: కారును వాటర్ ట్యాంకర్ ఢీకొనడంతో ఓ చిన్నారి మృతి చెందగా... మరో ముగ్గురికి గాయాలైన సంఘటన గురువారం ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని సర్వీసు రోడ్డుపై చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర బాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పాతబస్తీ నవాబ్‌సాబ్‌కుంట ప్రాంతానికి చెందిన సలీం, భార్య మెహజబీన్ ఫాతిమా, కుమార్తె సిబ్రా ఫాతిమా (3)తో పాటు మరో నలుగురు బంధువులతో కలిసి టయోటా క్వాలిస్‌లో బుధవారం సాయంత్రం మోయినాబాద్ సమీపంలోని ఏపీఆర్ ఫామ్‌హౌజ్‌లో బంధువుల శుభకార్యానికి వెళ్లాడు. రాత్రి 12 గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వెళుతుండగా హిమాయత్‌సాగర్ ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు వద్ద వేడంగా వచ్చిన వాటర్ ట్యాంకర్ వీరు ప్రయాణిస్తున్న క్వాలిస్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కుమార్తెను ఒడిలో కూర్చోబెట్టుకున్న మెహజబీన్ ఫాతిమాతో పాటు సలీంలకు గాయాలయ్యాయి. చిన్నారని సిబ్రా ఫాతిమా తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడిన సలీం, మెహజబీన్ ఫాతిమాతో పాటు మరొకరిని పోలీసులు చికిత్స నిమిత్తం పాతబస్తీలోని ఆస్రా ఆసుపత్రికి తరలించారు. కాగా మెహజబీన్ ఫాతిమా పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఒబేదుల్లా కొత్వాల్ బాధ్యతల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత ఒబేదుల్లా కొత్వాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. హజ్ హౌజ్‌లో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్వాల్ మాట్లాడుతూ, మైనారిటీల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎంపీ మధు యాష్కీ, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL-II, 1st Floor, Triveni Complex, Abids, At: Hyderabad

O.A.No.417 of 2023

Summons under sub-section (4) of section 19 of the Act, read with Sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993

Between: Bank of India, Secunderabad Branch .... Applicant

And

1. M/s. The Brew Cafe Restaurant & Bar, 2. Sri. Sundeep Bollineni 3. Sri. Raj Kumar Medhi 4. Sri. Rajender Bodla 5. Sri Narendar Dommati ... Defendants

To Sri. Sundeep Bollineni S/o. Sri Bollineni Narasimha Rao Age 34 years, Occ: Business, Partner of M/s. The Brew Cafe Restaurant & Bar, R/o Flat No.305, Pamidi Towers, VIP Hills, Silicon Valley, Ayyappa Society, Madhapur, Hyderabad-500081. And Also at: R/o #10, Sri Lakshmi Nivas 7th Main Road, Raghavendra Circle, M.V. Ramnamurthy Nagar, Bangalore North, Karnataka - 560016 ... Defendant No.2

Sri Raj Kumar Medhi, S/o. Sri. Pradip Medhi, Age:35 Years, occ: Business, Partner of M/s The Brew Cafe Restaurant & Bar, R/o. H.No.8-2-603/30/8/A, Road No.10, Banjara Hills, Khairtabad, Hyderabad, Telangana - 500034 And Also at: R/o. H.No.53, Bakul Path, Jalukhbari, Guwahati, Assam State - 781014 ... Defendant No.3

SUMMONS BY PAPER PUBLICATION

Whereas, OA/417/2023 was listed before Hon'ble presiding officer / Registrar on 28-02-2024 in accordance with sub-section (4) of section 19 of the Act, You, the defendants are directed as under:-

(i) To show cause within thirty days of the service of summons to why relief prayed for should not be granted;
(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original applications.
(iii) You are restrained from dealing with or disposing of secured or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the oridinary course of his business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the oridinary course of business and deposit such sale proceeds in such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Registrar on10-04-2024 at 10.30 A.M. failing which the application shall be heard and decided in your absence.

Given under my hand the seal of this Tribunal on this the 29th day of Feb.2024

Sd/-REGISTRAR
DEBTS RECOVERY TRIBUNAL-II HYDERABAD

శివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు



ఆలయం వద్ద చెత్తను శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ వనం సంగీత

శ్రీనగర్‌కాలనీ: శివరాత్రి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు, పూర్తి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులను పూర్తి చేశామని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత అన్నారు. గురువారం ఎల్లారెడ్డిగూడ హనుమాన్ దేవాలయం, విజయదుర్గా దేవాలయాల పరిసర ప్రాంతాల్లో మట్టికుప్పలు, చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో పరిశుభ్రపరిచారు. నేతలు వనం శ్రీనివాసయాదవ్, నరేందర్‌యాదవ్, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులతో మధ్యాహ్నం వరకే పని చేయించాలి

వెంగళరావునగర్: జీహెచ్ఎంసీ కార్మికులను మధ్యాహ్నం వరకే పనులు చేయించాలని సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కమిటీ కన్వీనర్ రాపర్తి అశోక్ డిమాండ్ చేశారు. వెంగళరావునగర్ డివిజన్ యాదగిరినగర్ చౌరస్తాలో గురువారం జీహెచ్ఎంసీ కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ... ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉన్నాయన్నారు. మున్సిపల్ కార్మికులు అనేకమంది ఎండలో పడిపోతున్నారని చెప్పారు. కార్మికులకు కనీస సౌకర్యాలను కల్పించాలని, మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే పని చేయించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం జీహెచ్ఎంసీ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఐటీయు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. సీఐటీయూ, జీహెచ్ఎంసీ కార్మిక నేతలు నగేష్, సుగుణమ్మ, యాదగిరి, జ్యోతి, స్వప్న, గోపమ్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఉన్నత శిఖరాలు



సర్టిఫికెట్స్ అందుకున్న విద్యార్థులు

శ్రీనగర్‌కాలనీ: విద్యార్థులు కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకొని దేశానికి ఖ్యాతి తీసుకురావాలని ఎల్లారెడ్డిగూడ సిద్ధార్థ డిగ్రీ కళాశాల చైర్మన్ డాక్టర్ జి.నాగయ్య, కవి సాహిత అవార్డు గ్రహీత జయరాజు అన్నారు. గురువారం సిద్ధార్థ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం, గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక, జానపద, ఆధునిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుష్ప, లెక్చరర్స్ పాల్గొన్నారు.

నియామకం...



సమావేశంలో కృష్ణ మాదిగ తదితరులు

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణ మాదిగ హక్కుల దండోరా గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్‌గా ఎల్లారెడ్డిగూడకు చెందిన కొమ్ము కృష్ణ మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ఫౌండర్ ట్రస్టీ జన్ను కనకరాజు మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు వేముల బలరాం మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కోరిపల్లి శ్రీనివాస మాదిగ సమక్షంలో అందుకున్నారు. మాదిగల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు కృషి చేస్తానని కొమ్ము కృష్ణ మాదిగ స్పష్టం చేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గౌస్‌ఖాన్

బంజారాహిల్స్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి దూసుకెళ్తున్న వాహనదారులకు పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గౌస్‌ఖాన్‌తో పాటు ట్రాఫిక్ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. గురువారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3లో ముఫకంజా కాలేజ్ ముందు రాంగ్‌రూట్‌లో వస్తున్న స్కూటరిస్టులను ఆపి తనిఖీ చేయడమే కాకుండా రాంగ్‌రూట్‌లో రావడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా సెల్‌ఫోన్ డ్రైవ్ చేస్తూ, నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనదారులపై కేసులు నమోదు చేశారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్: డివిజన్‌లో ప్రధాన కూడలి అయిన వై జంక్షన్ వద్ద డ్రైనేజీ పొంగిపొర్లుతూ రోడ్లపైకి మురికి నీరు చేరడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆ సమస్యను పరిష్కరించారు. తక్షణం సంబంధిత సీవరేజీ అధికారులకు సమాచారం అందించి, సిబ్బందిని పిలిపించి ఆ దాన్ని మరమత్తులు చేయించి, ఆ సమస్యను పరిష్కరించారు.

క్రెడిట్ కార్డు పేరుతో రూ. 79 వేలు స్వాహా

రహమత్‌నగర్: క్రెడిట్ కార్డు పేరుతో ఓ వ్యక్తిని నమ్మించి ఆయన బ్యాంకు ఖాతాలోని డబ్బును లాగేసిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... స్వరాజ్‌నగర్‌కు చెందిన కతార్ అనే వ్యక్తికి ఈ నెల 2 పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నానని ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. క్రెడిట్ కార్డు వచ్చిందని బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత వివరాలు అడిగి తెలుసుకున్నాడు. వెనువెంటనే కతార్ సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యింది. ఆ తరువాత కతార్ మొబైల్ ఆన్ చేసి చూడగా తన ఖాత నుంచి రూ. 79 వేల ట్రాన్స్‌ఫర్ కావడంతో తను మోసపోయాయని తెలుసుకున్న కతార్ బుధవారం బోరబండ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడ్తున్నారు.

సత్తాచాటుతున్న మహిళలు

- ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరీ ఎస్ స్వరూప్
- పలు ప్రాంతాల్లో ఘనంగా మహిళా దినోత్సవం
- సంబరాల్లో పాల్గొన్న పలువురు ప్రముఖులు



బీఎన్ఐ క్యాపిటల్ చాప్టర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

బంజారాహిల్స్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరీ ఎస్ స్వరూప్ తెలిపారు. బీఎన్ఐ క్యాపిటల్ చాప్టర్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ పార్క్ హయత్ హోటల్‌లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్లోరీ మాట్లాడుతూ... బీఎన్ఐ నెట్‌వర్కింగ్ శక్తి అద్భుతమైనదన్నారు. ఎంఎస్ఎంఈ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ రంగంలో అగ్రగామిగా ఉందన్నారు. ఈ సంస్థ ప్రధానంగా కెపాసిటీ బిల్డింగ్, రీసెర్చ్ కన్సల్టెన్సీ, స్కిల్లింగ్, ఎడ్యుకేషన్, ఎక్స్‌టెన్షన్‌పై దృష్టి పెట్టి అనేక సేవలు అందిస్తుందన్నారు.బీఎన్ఐ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా మాట్లాడుతూ జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు సమాన హక్కులు ఉండాలన్నారు. కార్యక్రమంలో బీఎన్ఐ క్యాపిటల్ అధ్యక్షుడు సందీప్‌జైన్, ఉపాధ్యక్షుడు పురుషోత్తం ఆది, కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

- ఖైరతాబాద్ నియోజకవర్గంలో పలుచోట్ల అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మహిళలు అన్ని రంగాల్లో శిఖరాగ్రానికి చేరుకుంటున్నారంటూ మహిళా ప్రతిభను ఎలుగెత్తి చాటారు. మహిళలు తమకు అందివచ్చిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని వక్తలు సూచించారు.

బీజేఆర్‌నగర్‌లో...

- బీజేఆర్‌నగర్ బస్తీలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షురాలు మల్లేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు హాజరై కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. సీఈఓ బిచ్చమ్మ, డాక్టర్ ఫాతిమా, బస్తీ అధ్యక్షులు నల్లపు యాదగిరి, ప్రధాన కార్యదర్శి దామోదర్, ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు



బీజేఆర్‌నగర్‌లో...

హలీమ్ తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కాడే



మాట్లాడుతున్న జెడ్‌సీ హేమంత్

బంజారాహిల్స్: రాంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని హలీమ్ తయారీదారులతో గురువారం ఖైరతాబాద్‌లోని తన కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కాడె జీహెచ్ఎంసీ వివిధ విభాగాల అధికారులు, హలీమ్ తయారీదారులతో సమావేశం అయ్యారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ వెటర్నరీ అధికారి డాక్టర్ మోహన్ రెడ్డితో పాటు, జోనల్ పరిధిలోని జూబ్లీహిల్స్, ఖైరతాబాద్‌తో పాటు కార్వాన్, మెహిదీపట్నం, గోషామహల్ ఎంఎంఓహెచ్‌లు, వెటర్నరీ అధికారులు, ఫుడ్ సెఫ్టీ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు. హలీమ్ బట్టీలను మొదటి, రెండవ అంతస్తులలో కాకుండా గ్రౌండ్ ఫ్లోర్లలో ఏర్పాటు చేయాలని, పిల్లర్ల వద్ద బట్టీలు ఉండకుండా చూసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నాణ్యత గల మాంసాన్ని, చికెన్‌ను మాత్రమే హలీమ్ తయారీకి ఉపయోగించాలని, హలీమ్‌కు వాడే ఇతర సరుకులు నాణ్యతతో ఉండాలని సూచించారు. వీటిని ఎప్పటికప్పుడు ఫుడ్ సెఫ్టీ అధికారులు తనిఖీలు చేయాలన్నారు. హలీమ్ బట్టీల వద్ద చెత్తను ఎప్పటికప్పుడూ తొలగించాలన్నారు. ఈ సమావేశంలో 20 మంది హలీమ్ తయారీదారులు పాల్గొన్నారు.

మహిళల్లో డి-విటమిన్ లోపం



వేడుకల్లో పాల్గొన్న ఆస్పత్రి వైద్యులు

బంజారాహిల్స్: భారతీయ మహిళలు విటమిన్ 'డి' లోపంతో పోరాడుతున్నారని అపోలో క్రెడిల్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ వైద్యులు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'స్ట్రాన్ ఉమెన్ స్ట్రాంగ్ భారత్' థీమ్‌తో జూబ్లీహిల్స్‌లోని అపోలో క్రెడిల్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నటి కుశిత కల్లాపు హాజరయ్యారు. వైద్యులు మాట్లాడుతూ... 90 శాతం మంది మహిళలు విటమిన్ డి లోపంతో బాధపడుతున్నారని, ఇది స్త్రీ ఎముకల ఆరోగ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుందన్నారు. హాస్పిటల్ కన్సల్టెంట్ పీడియాట్రిషియన్ డాక్టర్ షర్మిల, కన్సల్టెంట్ ప్రసూతి, గైనకాలజిస్ట్ డాక్టర్ స్వాతి గోగినేని, ల్యాప్ సర్జన్ డాక్టర్ హారిక బోనం తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహనకు చేయూత

బంజారాహిల్స్: ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కేన్సర్‌పై అవగాహన కలిగించేందుకు బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు క్రిటికల్ రివర్ టెక్నాలజీ రూ. 20 లక్షల ఆర్థిక సాయాన్ని అందించింది. గురువారం ఉదయం హాస్పిటల్‌లో జరిగిన కార్యక్రమంలో క్రిటికల్ రివర్ టెక్నాలజీస్ ప్రతినిధులు చంద్రగిరి రూ. 20 లక్షలకు సంబంధించిన చెక్కును ఆస్పత్రి సీఈఓ డాక్టర్ కృష్ణయ్యకు అందజేశారు. డైరెక్టర్ వినాయకుల్లా షేక్, మార్కెటింగ్ డైరెక్టర్ రీత్‌గ్వారి, ఆపరేషన్స్ హెడ్ పట్నాని, అడ్మిన్ మేనేజర్ సంపత్‌పతి, హాస్పటల్ మెడికల్ డైరెక్టర్ టీఎస్‌రావు, కల్పనా రఘునాథ్, సెంథిల్ రాజప్ప పాల్గొన్నారు.

రేపు గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్

బంజారాహిల్స్: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు, వారి తల్లి దండ్రుల సందేహాలు నివృత్తి చేసేందుకు గ్లోబల్ ట్రీ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ అండ్ ఇమ్మిగ్రేషన్ కన్సల్టెంటీ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్‌లో ఉచితంగా గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ 2024 నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు శ్రీకర్ ఆలపాటి తెలిపారు. సోమాజిగూడ లోని సంస్థ కార్యాలయంలో గురువారం ఫెయిర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూకే, ఆస్ట్రేలియా, సింగపూర్, దుబాయి, ఐర్లాండ్, యూరప్ దేశాల్లోని ప్రముఖ యూనివర్సిటీల నుండి సుమారు 50 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నేరుగా యూనివర్సిటీ ప్రతినిధులతో మాట్లాడి వారి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చునని తెలిపారు. ఫెయిర్‌లో పాల్గొనే విద్యార్థులకు వీసా రుసుము తీసుకోవడం లేదని, స్పాట్ ఆఫర్ లెటర్లు ఇస్తారని, ఎలాంటి సెక్యూరిటీ లేకుండా రూ. 60 లక్షల వరకు స్కాలర్‌షిప్ పొందవచ్చని వివరించారు. ఫెయిర్‌లో పాల్గొనేందుకు ఎలాంటి రుసుము లేదన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సత్కారం



హిమాయత్‌నగర్: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్ట ఆధ్వర్యంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. గురువారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్ రెడ్డి బందం శ్రీనివాస్ రెడ్డిని కలిసి చేనేత శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం గాంధీ సంస్థలు చేస్తున్న ఏకాదశి సూత్రాలు, సామాజిక మహాపాపాలు ప్రతిపాదించిన ఐక్యరాజ్యసమితి 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై చైర్మన్ డాక్టర్ గున్నా రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సభ్యులు, ప్రముఖ సంఖ్యా శాస్త్రవేత్త ఎనుగుల వెంకటరెడ్డి, కె.సుభాష్ చంద్ర, వై.చైతన్య, కె.శేఖర్, ఎన్జీవో ఎ.శంకర్ రెడ్డి, వై.శివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ: సుమన్



బ్లాక్ బెల్ట్‌లు తీసుకున్న క్రీడాకారులతో హీరో సుమన్

పంజగుట్ట: ప్రతి పిల్లలు తనను తాను కాపాడుకోవడమే కాకుండా, కుటుంబ సభ్యులను కాపాడుకునేందుకు తప్పకుండా కరాటే నేర్చుకోవాలని ప్రముఖ సినీ హీరో సుమన్ తల్వార్ పిలుపునిచ్చారు. షాటోకాన్ కరాటే, కుంగ్‌ఫూ అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బ్లాక్ బెల్ట్ అవార్డింగ్ సెర్మని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కరాటే, కుంగ్‌ఫూ క్రీడాకారులకు బ్లాక్ బెల్ట్, సర్టిఫికెట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ జయంత్ రెడ్డి, ఆర్.కె.కృష్ణ, శ్రీనివాస్, సాయి కుమార్, కృష్ణ గౌడ్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సత్కారం



క్రీడాకారిణి నందినిని సత్కరిస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ బంజారా ప్రతినిధులు

బంజారాహిల్స్: మహిళలను ప్రోత్సహిస్తే ఎన్నో అద్భుతాలు సృష్టిస్తారని ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ బంజారా అధ్యక్షురాలు కృష్ణవేణి సింగ్ అన్నారు. గురువారం ఉమెన్స్ డేను పురస్కరించుకొని యువ క్రీడాకారిణి నందిని అగసారాను క్లబ్ సభ్యులతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నందిని అగసార 2023 ఏషియన్ గేమ్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించిందని త్వరలో జరగబోయే ఒలింపిక్స్‌లో నందినికి ఎటువంటి ఆర్థిక సాయం కావాలన్నా తమ క్లబ్ అండగా ఉంటుందని ఈ సందర్భంగా వారు నందినికి భరోసానిచ్చారు. నందిని తన కెరీర్‌లో వివిధ టోర్నమెంట్లలో హెప్టథ్లాన్‌లో 13 బంగారు పతకాలు, 9 రజత పతకాలు, 8 కాంస్య పతకాలు సాధించిందని అన్నారు. పేద, యువ క్రీడాకారులకు తమ ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ బంజారా అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు డాక్టర్ దేవిక, సుమన్, రోజి బజాజ్, శాంతి, స్మిత తదితరులు పాల్గొన్నారు.

10న జాతీయ సదస్సు

ఖైరతాబాద్: ఎస్సీ, ఎస్టీ, బీసీ సమస్యలపై ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో ఉదయం 9 గంటల నుంచి జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎ.శివరాజ్ తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అభిమానులు, వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనే జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌లతో పాటు ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సమస్యలపై జాతీయ సదస్సులో చర్చించడంతో పాటు పలు తీర్మానాలు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై చర్చాగోష్ఠి

ఖైరతాబాద్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల సైన్స్, పరిశోధనా విభాగం ఆధ్వర్యంలో గురువారం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్‌పై చర్చాగోష్ఠి కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా పాల్గొన్న ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ శేషం ఆనంద్ మాట్లాడుతూ... డిగ్రీ, పీజీ కోర్సుల్లో ఉన్న విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మిషన్ లెర్నింగ్ రానున్న కాలంలో ఏ విధంగా సమాజంలో మార్పు తెస్తుందో తెలుసుకునేలా కార్యక్రమం ఉందన్నారు. ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ మాట్లాడుతూ... అన్ని రంగాల్లో కృత్రిమ మేధస్సు, యాంత్రిక అభ్యసం ఏ విధంగా మార్పు తెస్తుందో తెలియజేశారన్నారు. చర్చా గోష్ఠికి వివిధ కళాశాలల నుంచి 140 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 55 పరిశోధనా పత్రాలపై విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సదస్సులో ఉత్తమ పరిశోధనా ప్రతాలకు నగదు బహుమతులు అందజేశారు.

ముదిరాజ్‌ల హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలి

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని ముదిరాజ్‌లు ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన హక్కులను సంఘటితంగా పోరాడి సాధించుకోవాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. గురువారం హైదర్‌గూడలోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా చాట్ల మల్లేశం ముదిరాజ్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దెల సంతోష్, నాయకులు వెంకటస్వామి, తీగల సైదయ్య, కందుల శ్రీనివాస్,మహేందర్, సాయికృష్ణ, ఆర్.శ్రీనివాస్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'పీసీఓఎస్' మేనేజ్‌మెంట్‌పై అవగాహన

బంజారాహిల్స్: ఫెర్నాండెజ్ హాస్పిటల్‌కు చెందిన క్లినికల్ న్యూట్రిషన్ డిపార్ట్‌మెంట్, డైటిక్స్ ఇండియా అసోసియేషన్ ఫర్ పెరెంటరల్, ఎంటరల్ న్యూట్రిషన్ (ఐఏపీఈఎన్) సంయుక్తంగా 'పీసీఓస్' (పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్స్) మేనేజ్‌మెంట్‌పై గురువారం సీఎంఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 'డయాగ్నసిస్ టు వెల్‌బీయింగ్-రీసెంట్ అప్‌డేట్స్' పేరిట జరిగిన అవగాహన కార్యక్రమంలో పీసీఓస్ వైద్య ప్రతినిధులు హాజరయ్యారు. ముఖ్యంగా హార్మోనల్ ఇంబ్యాలెన్స్, న్యూట్రియేమంట్ మేనేజ్‌మెంట్, పీసీఓస్ ఇన్సులిన్ సెన్సిటివిటీ మరింత వృద్ధిపర్చడంపై సీఎంఈ ప్రధానంగా దృష్టిపెట్టిందని నిర్వాహకులు తెలిపారు. పీసీఓస్ కాంప్రహెన్సివ్ మేనేజ్‌మెంట్‌పై చర్చలో వివిధ విభాగాలకు చెందిన నిష్ణాతులు హాజరయ్యారు. జంట నగరాల నుంచి 100 మందికి పైగా డైటిక్టివ్ ప్రొఫెషనల్స్ ఇందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫెర్నాండెజ్ హాస్పిటల్ చీఫ్ డైటీషియన్ అండ్ హెచ్‌ఓడీ లతాశశి పాల్గొన్నారు.

ఘనంగా త్రిమూర్తి శివ జయంతి



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ కవితారెడ్డి, బ్రహ్మకుమారీస్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14లోని నందినగర్‌లోని బ్రాహ్మకుమారీస్‌లో 88వ త్రిమూర్తి శివ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరమాత్మకు పూజలు నిర్వహించి అమూల్య సందేశాన్ని అందించారు. ప్రముఖ గాయని రమ్య బెహారా పాడిన పాటలు భక్తులను ఆనంద పారవశ్యంలో ముంచెత్తాయి. వేడుకల్లో కార్పొరేటర్ వెంకటేశ్వరరెడ్డి, గచ్చిబౌలి శాంతిసరోవర్ డైరెక్టర్ కులదీప్, బంజారాహిల్స్ సెంటర్ ముఖ్య అధిపతి శివానీ తదితరులు పాల్గొన్నారు.

మురుగుమయంగా దేవరకొండబస్తీ



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం.5లోని దేవరకొండ బస్తీని మురుగు సమస్య వేధిస్తున్నది. గడిచిన వారం రోజులుగా బస్తీలోని కమ్యూనిటీ హాల్ రోడ్డు నుంచి ప్రధాన జంక్షన్ మ్యాన్‌హోళ్ళ నుంచి మురుగు పొంగుతుండటంతో రోడ్డుంతా బురదమయంగా మారింది. స్థానికంగా ఉన్న ఈ సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా మురుగు ప్రవహిస్తుండటం వాసన భరించలేక పోతున్నామంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెళ్లి.. ప్రేమ పేరుతో మోసగించారంటూ మహిళ ఫిర్యాదు

వెంగళరావునగర్: ఒకడు పెళ్లిచేసుకుని మద్యానికి బానిసై వదిలేయగా, ఇంకొకడు నమ్మించి మోసం చేశాడంటూ ఓ మహిళ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల సమాచారం మేరకు... ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ మహిళ 2005లో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన నారాయణ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. వారికి ఇరువురు పిల్లలు. జీవనోపాధి కోసం కొన్నేళ్ల కిందట నగరానికి వచ్చారు. ఇక్కడ నారాయణ మద్యానికి బానిసై హింసించేవాడు. దాంతో 2020లో ఆమె అతనిని వదిలేసి యాదగిరినగర్‌లో ఉంటూ సినిమాల్లో హెయిర్, మేకప్ పనులు చేసుకుంటూ జీవిస్తుంది. ఈ క్రమంలో కెమెరా అసిస్టెంట్‌గా పనిచేసే ప్రకాశం జిల్లా కోనపల్లి ప్రాంతానికి చెందిన శ్యామ్‌కుమార్‌తో పరిచయం అయింది. అతను ఆమెను ప్రేమించానన్నాడు. రెండేళ్లు సహజీవనం చేశాడు. ఆరు నెలల నుంచి వేధించడం మొదలు పెట్టాడు. అదేమని ప్రశ్నిస్తే వేరే పెళ్లి చేసుకుంటానని బెదిరించాడు. అయినా ఆమె సహించేది. ఈ నెల 4న శ్యాంకుమార్ తల్లిదండ్రులు, మామ, బావమరిది వచ్చి శ్యామ్‌ను ఆస్పత్రిలో చూపించాలని తీసుకెళ్లారు. మూడురోజులైనా తిరిగి రాలేదు. శ్యామ్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా జవాబు ఇవ్వలేదు. అతని బామమరిదికి ఫోన్ చేయగా అతనితో పాటుగా శ్యామ్ బంధువులు బెదిరించారు. ఇకపై శ్యామ్ నీ ఇంటికి రాడు. నీ ఇష్టం వచ్చింది చేసుకో అంటూ దుర్భాషలాడారు. దాంతో ఆమె మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

ముధురానగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం



కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న బాబా ఫసీయుద్దీన్

రహమత్‌నగర్: మధురానగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పి.వీరయ్య, అధ్యక్షుడిగా చెట్టి దేవేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాబ్లు, వైస్ ప్రెసిడెంట్‌గా ముత్యాల మహేష్, జనరల్ సెక్రటరీగా శివ శంకర్ ముదిరాజ్, కోశాధికారిగా ఆంజనేయులగౌడ్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని సన్మానించారు. డివిజన్ కాంగ్రెస్ నాయకులు అశోక్, నర్సింహ, మహేష్‌గౌడ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ నేత చెన్నారెడ్డి గుండె పోటులో మృతి



చెన్నారెడ్డి (ఫైల్)

రహమత్‌నగర్: కార్మికనగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు చెన్నారెడ్డి(నర్సింగ్‌గౌడ్-73) బుధవారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో చెన్నారెడ్డి కీలకంగా పనిచేశారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలో ఆయన చేరారు. చెన్నారెడ్డి మరణించిన విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సి.ఎస్.రెడ్డి, గౌడ సంఘం నాయకులు వినోద్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్ తదితరులు మృతుని నివాసానికి వెళ్లి నివాళులు అర్పించారు. అకింత భావంతో పనిచేసిన చెన్నారెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానీశంకర్, డివిజన్ నాయకులు గ్యార నాగరాజు అన్నారు.


అనకాపల్లి జిల్లా పిసినికాడలో నిర్వహించిన వైఎస్సార్ 'చేయూత' సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

'చేయూత' పండుగ

- మహిళా దినోత్సవ వేళ అక్కచెల్లెమ్మలకు సాయాన్ని అందించడం ఎంతో సంతోషాన్నిస్తోంది: అనకాపల్లి సభలో ఏపీ సీఎం జగన్
- వైఎస్సార్ చేయూతతో 2,698,931 మంది లబ్ధిదారులకు రూ.5,060.49 కోట్లు సాయం
- 14 రోజుల పాటు పండుగ వాతావరణంలో 'చేయూత' కార్యక్రమాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: అక్కచెల్లెమ్మల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా మనందరి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, మహిళా దినోత్సవం ముందు రోజు 'వైఎస్సార్ చేయూత' ద్వారా ఆర్థిక సాయం అందించడం ఎంతో సంతోషం కలిగిస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. మహిళా సాధికారత పట్ల ఇంత చిత్తశుద్ధి చూపిన ప్రభుత్వం దేశ చరిత్రలోనే మరొకటి లేదన్నారు. 45 – 60 ఏళ్ల వయసున్న మహిళలకు నాలుగో విడత ఆర్థిక సాయం అందించే వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన అనకాపల్లి జిల్లాలోనే నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ ఆర్థిక సాయంతో ఎదిగిన మహిళలంతా తమ విజయగాథలను వివరిస్తూ రానున్న 14 రోజుల పాటు సచివాలయాలవారీగా కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు – దత్తపుత్రుడు గతంలో మేనిఫెస్టోలో అక్కాచెల్లెమ్మలకు ఇచ్చిన ఏ వాగ్దానాన్నీ అమలు చేయలేదని మండిపడ్డారు. వారి పేరు చెబితే ఎనిమిది రకాల మోసాలు, దగా గుర్తురాగా మన ప్రభుత్వం పేరు చెబితే సంక్షేమం గుర్తుకొస్తుందన్నారు. చంద్రబాబును చూస్తే విశ్వసనీయతలేమి గుర్తుకొస్తుందని, దత్తపుత్రుడి పేరు చెబితే వివాహ వ్యవస్థకే కళంకం తెచ్చేలా కార్లను మార్చినట్లు భార్యలను మార్చే వ్యవహారం గుర్తుకొస్తుందని విమర్శించారు. వారిని నమ్మితే కాటేసే పాముని నమ్మినట్టేనని, తినేసే పులిని ఇంటిని తెచ్చుకోవడమేనని హెచ్చరించారు. ప్రతి ఇంటికీ మేలు చేసిన మీ బిడ్డకు మీరే స్టార్ క్యాంపైనర్లుగా నిలిచి మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ చేయూత నాలుగో విడత కింద రాష్ట్రవ్యాప్తంగా 26,98,931 మంది అక్కచెల్లెమ్మలకు రూ.5,060.49 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించే కార్యక్రమాన్ని గురువారం అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడలో సీఎం జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

14 రోజులు పండుగ వాతావరణంలో..

మహిళా సాధికారతకు గుర్తుగా రాష్ట్రవ్యాప్తంగా 14 రోజుల పాటు పండగ వాతావరణంలో నిర్వహించే వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులందరూ పాలుపంచుకుంటారు. అక్కచెల్లెమ్మలకు జరిగిన మంచి, వారి జీవితాలు ఎలా బాగుపడ్డాయి? అనే స్ఫూర్తిదాయక కథనాలను ప్రతి సచివాలయం, ప్రతి మండలంలో చర్చించుకునేలా తెలియచేయాలని ప్రతి అక్కనూ, చెల్లెమ్మనూ కోరుతున్నా. 45 ఏళ్లు పైబడిన అక్కచెల్లెమ్మలు ఎలా బతుకుతున్నారు? వారి కుటుంబాలు ఎలా జీవిస్తున్నాయి? వారికి తోడుగా ఉండేందుకు ఏం చేస్తే బాగుంటుందని కనీస ఆలోచనను కూడా గత ప్రభుత్వాలు ఎప్పుడూ చేయలేదు.

మాట ఇచ్చిన చోటే...

అత్యంత బాధ్యతగా వ్యవహరించే 45 – 60 ఏళ్ల వయసు అక్క చెల్లెమ్మల చేతిలో డబ్బులు పెడితే వారే కాకుండా ఆ కుటుంబాలన్నీ బాగుపడతాయని మనస్ఫూర్తిగా ఆలోచన చేశాం. క్రమం తప్పకుండా ఏటా రూ.18,750 చొప్పున వారి చేతిలో పెట్టి జీవనోపాధి మార్గాలు చూపిస్తూ ముందుకు సాగుతున్నాం. చేయూత ద్వారా మొత్తం రూ.75 వేలు ఆర్థిక సహాయం చేస్తానని ఇదే జిల్లాలోని మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడులో నాడు చెప్పా. ఆ మాటను నిలబెట్టుకుంటూ ఇవాళ్టితో నాలుగు విడతల్లో రూ.75 వేలు అందిస్తూ ఇదే అనకాపల్లి జిల్లాలో కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది.

ఇంటిని నిలబెడుతూ..

ప్రతి అక్కచెల్లెమ్మ సొంత కాళ్లపై నిలబడేలా క్రమం తప్పకుండా చేయూత సాయంతోపాటు బ్యాంకు రుణాలు ఇప్పిస్తూ అమూల్, ఐటీసీ, పీ అండ్ జీ, రిలయన్స్, హిందుస్తాన్ లీవర్ తదితర కంపెనీలతో అనుసంధానించి తోడ్పాటునిస్తున్నాం. ప్రభుత్వం ఏటా రూ.18,500 చొప్పున ఇస్తోంది కాబట్టి కంపెనీలు, బ్యాంకులు కూడా వారికి అండదండలు అందించాయి. 1.69 లక్షల మంది అక్క చెల్లెమ్మలు కిరాణా షాపులు నిర్వహిస్తుండగా 85,630 మంది వస్త్ర వ్యాపారాలు చేస్తున్నారు. 3,80,466 మంది గేదెలు, ఆవులు కొనుగోలు చేశారు. 1,34,514 మంది మేకలు కొనుగోలు చేశారు. 88,923 మంది ఆహార ఉత్పత్తులకు సంబంధించిన వ్యాపారం చేస్తుండగా మరో 3,98,422 మంది వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారాల్లో ఉన్నారు. ఇంకో 2,59,997 మంది రకరకాల వ్యాపారాలతో సొంత కాళ్లపై నిలబడ్డారు. 16,55,991 మంది అక్క చెల్లెమ్మలు ఏదో ఒక వ్యాపారం చేస్తూ నెలకు కనీసం రూ.6 వేల నుంచి రూ.10 వేలు సంపాదించుకుంటూ కుటుంబానికి తోడుగా ఉంటున్నారు.

నాడు ఛిన్నాభిన్నం.. నేడు నెంబర్ వన్..

వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ ద్వారా పొదుపు సంఘాలకు మనం మళ్లీ ఊపిరి పోశాం. నాడు చంద్రబాబు రుణమాఫీ మోసానికి పొదుపు సంఘాలన్నీ ఏకంగా 18.36 శాతం ఎన్‌పీఏలు, ఔట్ స్టాండింగ్‌లుగా చిన్నాభిన్నమయ్యాయి. ఇవాళ ఎన్‌పీఏలు కేవలం 0.17 శాతం మాత్రమే ఉన్నాయి. ఏకంగా 99.83 శాతం రుణాల రికవరీతో మన పొదుపు సంఘాలు దేశంలోనే నంబర్ 1 స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ చేయూత ద్వారా నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు నాలుగేళ్లలో ఏకంగా రూ.19,190 కోట్లు మీ బిడ్డ ప్రభుత్వం అందించింది. కాపు, ఈబీసీ అక్కచెల్లెమ్మలకు ఏటా రూ.15 వేలు చొప్పున ఆర్థిక పటిష్టతకు తోడ్పాటు ఇస్తున్నది కూడా మీ బిడ్డ ప్రభుత్వమే. అక్కచెల్లెమ్మలను మోసం చేసిన చరిత్ర చంద్రబాబుదైతే ప్రతి అడుగులో అండగా నిలిచిన ఘనత మనది.గతానికి, ఇప్పటికి తేడా చూడమని కోరుతున్నా.

మహిళల పేరిట 31 లక్షల ఇళ్ల పట్టాలు..

సొంతిల్లు లేని పేదింటి అక్క చెల్లెమ్మల పేరిట ఏకంగా 31 లక్షల ఇళ్ల స్థలాలు అందచేశాం. అందులో 22 లక్షల ఇళ్లు నిర్మిస్తున్న ప్రభుత్వం కూడా మనదే. ఇది దేశ చరిత్రలో ఎప్పుడూ జరగని విశేషం. చంద్రబాబు ప్రభుత్వంలో కనీసం ఒక్కరికైనా ఒక్క సెంటైనా ఇచ్చారా అంటే ఇచ్చింది సున్నా. తొలిసారిగా అక్కచెల్లెమ్మల రక్షణ కోసం సచివాయాల్లో మహిళా పోలీసును నియమించాం. దిశ యాప్, భద్రత కోసం దిశ పోలీస్ స్టేషన్లు, దిశ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు.. ఇలాంటి వ్యవస్థను తెచ్చింది మీ బిడ్డ ప్రభుత్వమే. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలో ఏకంగా 50 శాతం వరకు మన ఇరుగు పొరుగు చెల్లెమ్మలే సేవలందిస్తున్నారు.

పదేళ్ల బ్యాంక్ స్టేట్‌మెంట్ చూడండి..

చంద్రబాబు పాలనకు మన పాలనకు వ్యత్యాసం కళ్లకు కట్టినట్లు తెలియాలంటే గత పదేళ్లుగా మీ బ్యాంకు స్టేట్‌మెంట్లను తీసుకుని ఒక్కసారి పరిశీలించండి. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో మీ అకౌంటుకు వచ్చింది ఒక్క రూపాయి అయినా కనిపిస్తుందా? అదే మీ బిడ్డ పాలనలో ఎన్ని లక్షలు మీ ఖాతాల్లోకి వచ్చాయో మీరే గమనించండి. లక్షాధికారులైన



మహిళల జాబితాలో దేశంలోనే మన రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని ఇటీవల కేంద్ర ప్రభుత్వ గణాంకాలు కూడా వెల్లడించాయి. మేనిఫెస్టోలో హామీలలో ఏకంగా 99 శాతం అమలు చేసి మరోసారి ఆశీస్సులు కోరుతున్న ఏకైక ప్రభుత్వం మనదే. ఈ 58 నెలల కాలంలో మీ ఇంటికి మంచి జరిగితే మీ బిడ్డకు మీరే సైనికులుగా, స్టార్ క్యాంపెయినర్లుగా ముందుకు రావాలని కోరుతున్నా. చెడిపోయిన వ్యవస్థను మార్చడం కోసం మీ బిడ్డ అడుగులు ముందుకు వేస్తూ ప్రయాణం చేస్తున్నాడు. మీ బిడ్డ ఒక్కడే ఆ పని చేయలేడు. దేవుడి దయ, మీ చల్లని ఆశీస్సులు ఉంటేనే సాధ్యం.

బాబు – దత్తపుత్రుడు 8 మోసాలివిగో..

చంద్రబాబు పేరు చెబితే మోసాలు, వంచన, పొదుపు సంఘాలకు చేసిన దగా గుర్తుకొస్తుంది. విశ్వసనీయతలేని మనిషి గుర్తుకొస్తాడు. దత్తపుత్రుడి పేరు చెబితే వివాహ వ్యవస్థకే ఓ కళంకం. ఓ మాయని మచ్చగా గుర్తుకొస్తుంది. కార్లు మార్చినట్లు భార్యలను మార్చేది ఈ విలువలు లేని దత్తపుత్రుడేనని గుర్తుకొస్తుంది. 2014లో చంద్రబాబు – దత్తపుత్రుడు కలసి ఫొటోలు దిగి సంతకాలు పెట్టి మేనిఫెస్టోలో ఏం వాగ్దానాలిచ్చారో ఒకసారి గుర్తు చేసుకుందామా?

- రూ.14,205 కోట్ల పొదుపు సంఘాల రుణాలన్నీ మొదటి సంతకంతోనే రద్దు చేస్తామన్నారు. అక్కచెల్లెమ్మలు బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం అంతా విడిపిస్తామని వాగ్దానాలు చేశారు. అప్పట్లో టీవీల్లో ఒక అడ్వర్టైజ్‌మెంట్ వచ్చేది. ఒక చెయ్యి మెడలో తాళిబొట్టు లాగేది. ఇంకో చేయి వచ్చి పట్టుకుని.. బాబు వస్తున్నాడు, బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపిస్తాడని హామీలు గుప్పించారు. ● ప్రతి ఇంటికీ ఏటా 12 గ్యాస్ సిలిండర్లపై రూ.1,200 సబ్సిడీ, ఐదేళ్లలో రూ.6 వేల సబ్సిడీ ఇస్తామని 2014 మేనిఫెస్టోలో వారిద్దరూ హామీ ఇచ్చారు.● మహిళల రక్షణ కోసం ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ● ఆడబిడ్డ పుట్టిన వెంటనే రూ.25 వేలు బ్యాంకులో డిపాజిట్ చేస్తామని వాగ్దానం చేసి మహాలక్ష్మి అని అమ్మవారి పేరు కూడా పెట్టారు. ● మొదటి సంతకంతో బెల్ట్ షాపులు రద్దు చేస్తామన్నారు.
- పండంటి బిడ్డ అనే పథకం పేరుతో పేద గర్భిణీ స్త్రీలకు రూ.10 వేలు ఇస్తామన్నారు.
- బడికి వెళ్లే ప్రతి ఆడపిల్లలకు సైకిళ్లు, ప్రతి అక్కచెల్లెమ్మకు స్మార్ట్ ఫోన్ ఉచితంగా ఇస్తామన్నారు. ● మహిళా పారిశ్రామికవేత్తల కోసం 'కుటీర లక్ష్మి' అనే వాగ్దానం చేశారు.

కాల్ మనీ సెక్స్ రాకెట్లు..

2014 ఎన్నికల వాగ్దానాల్లో ఒక్కటైనా చంద్రబాబు, దత్తపుత్రుడు అమలు చేశారా? పొదుపు సంఘాల రుణాలు తీర్చకుండా మోసగించారు. అప్పటి దాకా అమల్లో ఉన్న సున్నా వడ్డీ పథకాన్ని సైతం అక్టోబర్ 2016 నుంచి రద్దు చేశారు. అక్క చెల్లెమ్మల బంగారాన్ని బ్యాంకులు వేలం వేస్తుంటే చంద్రబాబు చోద్యం చూశారేగానీ ఆదుకోవాలన్న మనసు రాలేదు. గ్యాస్ సిలిండర్ల మీద ఐదేళ్లలో రూ.6 వేలు సబ్సిడీ ఇస్తామని నమ్మించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ సెల్ ఏర్పాటు చేయకపోగా విజయవాడలో కాల్ మనీ సెక్స్ రాకెట్లు నడిపించారు. మీకు తెలిసిన ఏ ఒక్కరికైనా ఆడబిడ్డ పుడితే ఒక్క రూపాయి అయినా డిపాజిట్ చేశారా? అమ్మవారి పేరుతో వాగ్దానాలు చేసి మోసగించి వీరిద్దరూ ఈ రోజు మహాశక్తి అనే కొత్త మోసానికి తెరతీస్తున్నారు. బెల్ట్ షాపులను రద్దు చేయకపోగా ఎక్కడ పడితే అక్కడ ప్రోత్సహించడం మరో మోసం. అవ్వాతాతలకు చివరి రెండు నెలలు మాత్రమే పెన్షన్ పెంచడం మరో గజ మోసం. ఎన్నికలు వచ్చినప్పుడే చంద్రబాబుకు బీసీలు గుర్తుకొస్తారు. బాబు, దత్తపుత్రుడు 2014లో బీసీలకు ఏకంగా 143 వాగ్దానాలు చేసి నెరవేర్చింది మాత్రం ఏకంగా పెద్ద సున్నా.

10 మందితో కాంగ్రెస్ తొలి జాబితా!

- ఢిల్లీలో సమావేశమైన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ
- సర్వేలు, సమీకరణాలు పరిగణనలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక

సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై తొలి విడత కసరత్తును ఏఐసీసీ అగ్ర నాయకత్వం పూర్తి చేసింది. తెలంగాణలోని సుమారు పది స్థానాలకు అభ్యర్థులను ఫైనల్ చేసింది. ప్రాంతీయ, కుల సమీకరణలు, రాజకీయ నేపథ్యం, సర్వేల్లో విజయావకాశాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసింది. అభ్యర్థుల ప్రకటన ఏక్షణమైనా వెలు వడవచ్చని ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. పెద్దపల్లిలో గడ్డం వంశీ, మహబూబ్‌నగర్‌లో వంశీచంద్‌రెడ్డి, నిజామాబాద్‌లో టి.జీవన్‌రెడ్డి, మహబూబాబాద్‌లో బలరాంనాయక్, చేవెళ్లలో సునీత మహేందర్‌రెడ్డి, నల్లగొండలో రఘువీర్‌రెడ్డి, కరీంనగర్‌లో ప్రవీణ్‌రెడ్డిల పోటీకి ఎవరి నుంచి ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో వారి అభ్యర్థిత్వాలకు సీఈసీ ఆమోదం తెలిపినట్లు తెలిసింది. జహీరాబాద్ స్థానానికి సురేశ్ షెట్కార్, ఉజ్వల్‌రెడ్డిల పేర్లను పరిశీలించినట్లు సమాచారం.

కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై చర్చించేందుకు గురువారం సాయంత్రం కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ ఏఐసీసీ కార్యాలయంలో భేటీ అయ్యింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, అంబికా సోని, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఈసీ సభ్యుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి పరిశీలనలోకి వచ్చిన అభ్యర్థుల వివరాలు, స్క్రూటినీ అనంతరం మిగిలిన అభ్యర్థుల వివరాలను సీఈసీ ముందుంచారు. రెండున్నర గంటల పాటు జరిగిన భేటీలో సునీల్ కనుగోలు సహా ఏఐసీసీ స్థాయిలో చేసిన సర్వేల నివేదికలు ముందుపెట్టుకొని నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల జాబితాను పరిశీలించారు. మొదటగా సింగిల్ పేర్లతో కూడిన స్థానాలను కమిటీ పరిశీలించింది. మొత్తంగా 8–10 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు జాబితాను ఏ క్షణమైనా విడుదల చేసే అవకాశం ఉందని అంటున్నారు.

మరిన్ని స్థానాలపై చర్చ

మిగతా స్థానాలపై కూడా చర్చించినా, మరోమారు సమావేశమై సర్వేల ఆధారంగా అభ్యర్థులను ఫైనల్ చేద్దామనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. సికింద్రాబాద్‌లో ఇటీవలే పార్టీలో చేరిన బొంతు రామ్మోహన్ దంపతులు, నాగర్‌కర్నూల్‌లో మల్లురవి, సంపత్ కుమార్, వరంగల్‌లో దారా సాంబయ్య సహా మరో పేరు, మల్కాజిగిరిలో చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు, మెదక్‌లో మైనంపల్లి హన్మంతరావు, నీలం మధు, ఆదిలాబాద్‌లో ఆదివాసీలైన ఇద్దరి పేర్లపై చర్చ జరిగినట్లు తెలిసింది. ఆయా స్థానాలపై వచ్చే వారంలో తుది నిర్ణయం చేసే అవకాశాలున్నాయని అంటున్నారు.

4 రోజుల్లో 850 ఎకరాలా!

▶ మొదటి పేజీ తరువాయి

ఐఎంజీ భారత్‌తో ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. క్రీడల్లో రాష్ట్ర యువతను చాంపియన్లుగా తీర్చిదిద్దడం కోసం అంటూ ఈ ఎంవోయూ చేసుకుంది. ఇందులో భాగంగా స్పోర్ట్స్ అకాడమీలను నిర్మించడం, అభివృద్ధి చేయడం, నిర్వహించడం కోసం అంటూ రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి సర్వే నంబర్ 25లో 400 ఎకరాలు ఇచ్చేందుకు అంగీకరించింది. అలాగే రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం మామిడిపల్లి సర్వే నంబర్ 99/1లోని మరో 450 ఎకరాలు అప్పగించేందుకు కూడా ఒప్పందం చేసుకుంది. అంతేకాకుండా ఐఎంజీ భారత్ అంతర్జాతీయ స్థాయిలో ప్రధాన కార్యాలయాన్ని నిర్మించుకునేందుకు బంజారాహిల్స్ నుంచి మాదాపూర్ వెళ్లే మార్గంలో ఎకరం నుంచి 5 ఎకరాలు కూడా ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు 2004, ఫిబ్రవరిలో గచ్చిబౌలిలో ఎంతో విలువైన 400 ఎకరాలను స్వల్ప మొత్తానికి అంటే కేవలం రూ.2 కోట్లకే ఐఎంజీ భారత్‌కు అప్పగించింది (సేల్ డీడ్ చేసింది). అయితే 2006లో ప్రభుత్వ ఆస్తులను కాపాడే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చింది. 2007లో దీన్ని చట్టబద్ధం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్తి (పరిరక్షణ, రక్షణ, పునఃప్రారంభం) చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్ట ప్రకారం ఐఎంజీ భారత్‌తో అంతకుముందు ప్రభుత్వం చేసుకున్న ఎంఓయూ, ఆ మేరకు సేల్‌డీడ్ కూడా రద్దయ్యాయి. ఈ క్రమంలో 2007 చట్టంలోని సెక్షన్ 2 ప్రకారం సంబంధిత లావాదేవీలు రద్దు చేయడమే కాకుండా ఐఎంజీ చె ల్లించిన మొత్తాన్ని ఏడాదికి 12 శాతం వడ్డీతో తిరి గి ఇచ్చేయడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. అయి తే ప్రభుత్వ చట్టాన్ని సవాల్ చేస్తూ ఐఎంజీ భారత్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

పూర్తి కేబినెట్ ఆమోదం లేదు: ఏజీ

'పూర్తి కేబినెట్ ఆమోదం లేకుండా నాటి ప్రభుత్వం ఎంఓయూపై సంతకాలు చేసింది. ఆ సమయంలో భూమి విలువ ఎకరం రూ.13 లక్షలు ఉండగా, పిటిషనర్‌కు రూ.50 వేల స్వల్ప మొత్తానికే సరైన ఎలాంటి కారణం లేకుండా విక్రయించారు. ఐఎంజీ భారత్‌కు అమెరికన్ కంపెనీ అయిన ఐఎంజీతో ఎలాంటి సంబంధం లేదు. కానీ దానికి అనుబంధ సంస్థ అంటూ మోసగించారు. అందుకే తదుపరి ప్రభుత్వం ఎంవోయూను రద్దు చేసింది. పరిహారం ఇవ్వాలని కూడా నిర్ణయించింది. 2007లో ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ఒక్క ఐఎంజీ కోసమే కా దు. ఇది ఇతర భూ లావాదేవీలకు కూడా వర్తిస్తుంది. ఇలా చట్టం తీసుకొచ్చే అధికారం రాజ్యాంగంలోని ఏడవ షె డ్యూల్ ప్రకారం శాసనసభకు ఉంది. రాష్ట్రపతి ఆ మోదం పొందిన తర్వాత 2007లో చేసి న చట్టం అమల్లోకి వచ్చింది..' అంటూ అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కాగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వేదు ల వెంకటరమణ..' ఒక ఐఎంజీ భారత్ కోసమే చట్టాన్ని తేవడం సమర్థనీయం కాదు. ఎంవోయూ ను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి లేదు..' అంటూ వాదించారు.

ఎలాంటి విచారణ చేయకుండానే ఆమోదం: ధర్మాసనం

'2003 ఆగస్టు 5న ఐఎంజీ భారత్ ఏర్పాటైన తర్వాతి రోజే, ఎలాంటి విచారణ చేసుకోకుండానే 6న నాటి యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, కల్చరల్ డిపార్ట్‌మెంట్ కంపెనీకి ఆమోదం తెలుపుతూ సర్క్యులర్ జారీ చేసింది. అదే రోజు నలుగురు మంత్రులతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దీనికి ఆగమేఘాలపై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆ తర్వాత 9వ తేదీన ఎంవోయూ కుదుర్చుకున్నారు. స్పోర్ట్స్ అకాడమీ, స్టేడియాల నిర్వహణకయ్యే ఖర్చు ఏడాదికి రూ.2.5 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ అయితే ఆ మొత్తాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తుందని ఒప్పందంలో పేర్కొన్నారు. తొలి మూ డేళ్లపాటు విద్యుత్, నీటి, సీవేజ్, డ్రైనేజీ బిల్లులనూ 100 శాతం తిరిగి చెల్లిస్తామని చెప్పా రు. ఆ తర్వాత క్రమంగా దీన్ని తగ్గిస్తామని తెలిపారు. ముఖ్యంగా పిటిషనర్‌కు అంతర్జాతీయ క్రీడా సంస్థ (ఐఎంజీ, అమెరికా)తో సంబంధం గానీ, గతంలో క్రీడా రంగంలో అనుభవం గానీ లేవు. ఉన్నట్లుగా పిటిషనర్ ఐఎంజీ ఎలాంటి పత్రాలను ప్రభుత్వానికి సమర్పించలేదు.

ప్రభుత్వం రద్దయ్యాక 400 ఎకరాలకు సేల్‌డీడ్!

2003, నవంబర్ 14నే చంద్రబాబు ప్రభుత్వం రద్దయ్యింది. తర్వాత ఆపద్ధర్మ ప్రభుత్వంగా మాత్రమే కొనసాగింది. ఈ ఆపద్ధర్మ ప్రభుత్వ హయాంలోనే 400 ఎకరాలను నామమాత్రపు ధరకు ఐఎంజీ భారత్‌కు అప్పగిస్తూ సేల్‌డీడ్ చేసింది. అయితే 2007లో భూములపై రాష్ట్ర శాసనసభకు ఉన్న అధికారాలతోనే ప్రభుత్వం చట్టాన్ని రూపొందించింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో సరైన కారణాలు ఉన్నప్పుడు రాజ్యాంగం ప్రభుత్వానికి ఈ అధికారం కల్పించింది. జాగ్రత్తగా గమనిస్తే.. కంపెనీ ఏర్పాటైన కేవలం 4 రోజుల్లోనే వేల కోట్ల విలువచేసే వందల ఎకరాల భూములు అప్పగించారు. మరే ఇతర కంపెనీకి రాష్ట్రంలో అంత స్వల్ప సమయంలో ఇలా భూములు ధారాదత్తం చేయలేదు. పిటిషనర్‌కు పరిహారం కోరే హక్కు ఉంది. అయితే 2007లో తీసుకొచ్చిన చట్టాన్ని తన ఒక్క కంపెనీ కోసమే అంటూ సవాల్ చేయలేరు.

ప్రజా ఆస్తుల పరిరక్షణకే వైఎస్ సర్కార్ చట్టం..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ప్రభుత్వం ఉల్లంఘించిందన్న వాదన కూడా సరికాదు. ప్రజల ఆస్తులను కాపాడటం కోసమే 2007లో వైఎస్ సర్కార్ చట్టం తీసుకొచ్చింది. అది ఎవరి వ్యక్తిగత అవసరాల కోసం కాదన్న విషయం గ్రహించాలి. కంపెనీ ఏర్పాటు చేసిన నాలుగు రోజుల్లో వేల కోట్ల భూములు గతంలో మరే ఇతర కంపెనీకి ప్రభుత్వం కేటాయించినట్లుగా ఐఎంజీ నిరూపించలేకపోయింది. అలాగే ప్రభుత్వం చేసిన చట్టం చెల్లుబాటును అడ్డుకునేందుకు ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు కూడా జరగలేదు. సేల్ డీడ్‌ను రద్దు చేయకూడదనే వాదన ఆమోదానికి అర్హమైనది కాదు. ఎంఓయూనే రద్దయినప్పుడు సేల్‌డీడ్ అమల్లో ఉండటం సాధ్యం కాదు..' అంటూ ధర్మాసనం తన తీర్పులో వ్యాఖ్యానించింది.

సీబీఐ విచారణకు లేఖ రాశామన్నారుగా..

'ఐఎంజీ భారత్‌కు భూముల అప్పగింతపై సీబీఐ విచారణ కోరుతూ గతంలో లేఖ రాశాం అన్నారు.. ఎంత వరకు వచ్చింది? మీరు విచారణ కోరతారా? లేక మమ్మల్నే సీబీఐకి అప్పగిస్తూ ఆదేశాలు ఇవ్వమంటారా?' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణలోగా ఏదో ఒకటి చెప్పాలని ఆదేశిస్తూ, విచారణను వారం పాటు వాయిదా వేసింది. ఐఎంజీ భారత్‌కు భూము ల కేటాయింపు, ఎంవోయూ, సేల్ డీడ్.. ఇలా అన్ని అంశాలపై కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ)తో విచారణ జరిపించాలని కోరుతూ టి.శ్రీరంగారావుతో పాటు మరొకరు 2012లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ ఒప్పందం వెనుక పెద్ద ఎత్తున ప్రజాధనం దుర్వినియోగం చేసే ప్రయత్నం జరిగిందని, దీని వెనుక ఉన్న కుట్రదారులెవరో తేల్చాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ పిటిషన్లను గురువారం మరోసారి సీజే ధర్మాసనం విచారించింది. సీబీఐకి అప్పగించే విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ అభిప్రాయం ధర్మాసనం కోరింది. ఆయన తమకు కొంత సమయం కావాలనడాన్ని, ప్రభుత్వాన్ని సంప్రదించిన తర్వాత తెలియజేస్తాననడాన్ని తప్పుబట్టింది. ఇంకా ఎంతకాలం ఆగాలని, వారంలోగా ఏదో ఒకటి తేల్చిచెప్పాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది. కాగా గతంలో ఇదే పిల్‌పై విచారణ సందర్భంగా ప్రభుత్వం కోరితే దర్యాప్తు చేయడానికి సిద్ధంగా ఉన్నామని న్యాయస్థానానికి సీబీఐ తెలియజేయడం గమనార్హం.

ఏపీలో పొత్తుపై నేడు స్పష్టత!

అమిత్ షా, నడ్డాలతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష పార్టీల పొత్తుల వ్యవహారంలో శుక్రవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. న్యూఢిల్లీలో గురువారం రాత్రి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో అమిత్ షా నివాసంలో టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. పొత్తులు, సీట్ల సర్దుబాటుపై వీరు చర్చించినట్లు సమాచారం. తమకు 8–10 లోక్‌సభ స్థానాలు, 15–20 అసెంబ్లీ స్థానాలు ఇస్తేనే పొత్తుకు ఓకే చెబుతామని బీజేపీ పెద్దలు కరాఖండిగా చెప్పారని తెలిసింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై శుక్రవారం ఒక స్పష్టత రానుండగా.. సీట్ల సర్దుబాటు విషయంలో బీజేపీ పెద్దలతో జరిగిన భేటీకి సంబంధించి ఏ క్షణానైనా ఒక అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. గతంలో రెండుసార్లు పొత్తుల విషయంలో బీజేపీ అధిష్టానంతో చర్చలు జరిగినా ఏమాత్రం లాభం లేకపోవడంతో.. వారు విధించే ఏషరతులైనా అంగీకరించి పొత్తు ఖరారు చేసుకోవాలని టీడీపీ, జనసేన విశ్వప్రయత్నం చేశాయి. ఆ రెండు పార్టీల అధ్యక్షులు తమతో పొత్తు విషయంలో ఏ విధంగా అర్రులు చాస్తున్నారు అనే విషయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు బుధవారం జేపీ నడ్డా, అమిత్ షా, బీఎల్ సంతోష్‌ల దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో చంద్రబాబు, పవన్‌లకు ఢిల్లీ నుంచి పిలుపువచ్చింది. దీంతో చంద్రబాబు, పవన్ గురువారం ఢిల్లీ వచ్చారు. రాత్రి 10:20 గంటలకు చంద్రబాబు, 10:35 గంటలకు పవన్ కళ్యాణ్‌లు అమిత్ షా నివాసానికి చేరారు. సుమారు గంట సేపు సమావేశం అయ్యారు. 2018లో ఎన్డీఏ నుంచి టీడీపీ బయటికి వెళ్లిపోయిన తర్వాత విశాఖపట్నం, రాజంపేట. రాజమండ్రి, హిందూపురం, తిరుపతి, అరకు, విజయవాడ వంటి లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతంపై తాము ఏ విధంగా ప్రత్యేక దృష్టి సారించామన్న అంశాన్ని బీజేపీ పెద్దలు చర్చల సందర్భంగా తెరపైకి తెచ్చారు. అందువల్ల తామడిగిన లోక్‌సభ స్థానాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కేటాయించాలని బీజేపీ అగ్రనేతలు చంద్రబాబు, పవన్‌లకు స్పష్టం చేశారని తెలిసింది. మరోవైపు ఒకటి రెండు రోజుల్లో జరగనున్న బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి బరిలో నిలిచే బీజేపీ అభ్యర్థుల జాబితాపై ఆమోదముద్ర పడనుంది.

ముద్రగడతో వైఎస్సార్‌సీపీ నేతల భేటీ

- పార్టీలోకి సాదరంగా ఆహ్వానించాం
- ముద్రగడకు సీఎం జగన్ సముచిత స్థానం కల్పిస్తారు
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి


కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభంతో సమావేశమైన మిథున్‌రెడ్డి, కన్నబాబు, ద్వారంపూడి, తోట నరసింహం, అడపా శేషు, జక్కంపూడి గణేష్ తదితరులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంతో గురువారం వైఎస్సార్‌సీపీ నేతలు భేటి అయ్యారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఆ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు కిర్లంపూడిలోని ముద్రగడ ఇంటికి వెళ్లి కలిశారు. ముద్రగడ పద్మనాభం, ఆయన కుమారులు వీరరాఘవులు (బాలు), చెల్లారావు (గిరి)లతో సమావేశమయ్యారు. అనంతరం తమను కలిసిన మీడియా ప్రతినిధులతో మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభంను వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించినట్లు చెప్పారు. ఎటువంటి రాజకీయ ప్రలోభాలకు లొంగకుండా కాపుల కోసం ముద్రగడ నిజాయితీతో ఉద్యమం చేశారని ప్రశంసించారు. అటువంటి నాయకుడిని సార్వత్రిక ఎన్నికల సమయం కావడంతో మద్దతు కోరేందుకు మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలోకి ఆహ్వానించామని తెలిపారు. ముద్రగడకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తారని చెప్పారు. తమ ప్రతిపాదనపై ఆయన సానుకూల నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నామని మిథున్‌రెడ్డి పేర్కొన్నారు.

బాసర ఆలయంలో కాగ్ ఆడిట్

భైంసా: నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ ఆలయంలో గురువారం కాగ్ ఆడిట్ చేపట్టింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆలయ రికార్డులను ఆడిట్ సభ్యులు పరిశీలి స్తున్నారు. పదేళ్లలో ఆలయ లెక్కలు, ఆలయ ఆస్తులు, అమ్మవారికి సమర్పించిన బంగారు ఆభరణాలు, బ్యాంకు లాకర్లలో ఉన్న డాక్యుమెంట్లు, వ్యవసాయ భూములు.. ఇలా అన్ని వివరాలపై ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఆలయ అధికారుల సమక్షంలో రికార్డులు నిశితంగా పరిశీలిస్తూ పదేళ్లుగా ఆలయానికి వస్తున్న ఆదాయం, ఇతర వ్యయాల వివరాలు తెలుసు కుంటున్నారు. భక్తులు సమర్పించే కానుకలు, ఇతర మార్గాల్లో వచ్చే ఆదాయ మార్గాల వివరాలు పరిశీలిస్తున్నారు. కొద్ది రోజుల పాటు ఆడిట్ నిర్వహించి పూర్తిస్థాయి నివేదికను సమర్పించనున్నారు.

గజవాహనంపై శ్రీశైల మల్లన్న విహారం



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం భ్రమరాంబా సమేతుడైన మల్లన్న గజవాహనంపై విహరించారు. ఉత్సవమూర్తులను గజవాహనంపై ఆశీనులను చేసి ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, పండితులు వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక అర్చన, హారతి ఇచ్చారు. గజవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను ఆలయ ప్రదక్షిణ చేయించి క్షేత్రప్రధాన వీధుల్లోకి తోడ్కొని వచ్చి గ్రామోత్సవానికి తరలించారు. కళాకారుల ప్రదర్శనల మధ్య గ్రామోత్సవం వైభవంగా సాగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి తదితరులు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు.





వివిధ రంగాలలో విజయపథంలో దూసుకుపోతూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న మహిళలు

ప్రతి రంగంలో ప్రతిభ

వినీతసింగ్ (కాస్మెటిక్స్)

వినీతసింగ్‌కు తండ్రి తేజ్‌సింగ్ స్ఫూర్తిప్రదాత. ఆయన శాస్త్రవేత్త. ఏడాదిలో 365 రోజులూ పనిచేసేవాడు. తండ్రి ఇచ్చిన స్ఫూర్తితో డిజిటల్–ఫస్ట్ కాస్మటిక్ బ్రాండ్ 'సుగర్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయకేతనం ఎగరేసింది వినీత. ఐఐటీ–మద్రాస్, ఐఐఎం–అహ్మదాబాద్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వినీత ఒక ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులో అధిక వేతనంతో కూడిన జాబ్ ఆఫర్‌ను వదులుకొని వ్యాపారరంగంలోకి అడుగు పెట్టింది. మొదటి స్టార్టప్ 'క్వెట్జాల్' ఘోరంగా విఫలమైంది. 2012లో మన దేశంలో ఇ–కామర్స్ ఊపందుకుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని మహిళలకు ప్రతి నెలా వివిధ రకాల బ్యూటీ ప్రాడక్ట్స్ తక్కువ ధరకు అందించే 'ఫ్యాట్ బ్యాగ్' అనే సబ్‌స్క్రిప్షన్స్ వ్యాపారాన్ని ప్రారంభించింది. ఈ వ్యాపారం హిట్ అయింది. అయితే ఈ మేకప్ బ్రాండ్లు మన భారతీయ స్కిన్‌టోన్, జీవన విధానానికి అనుగుణంగా లేవని గ్రహించింది. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని 2015లో కాస్మటిక్ 'సుగర్'ను స్టార్ట్ చేసి తిరుగులేని విజయం సాధించింది.

నేహా సతక్ (ఆస్ట్రోమ్ టెక్నాలజీ)



టెక్సాస్ ఏ అండ్ ఎం యూనివర్శిటీ నుంచి పీహెచ్‌డీ, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి ఏరో స్పేస్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ చేసింది నేహా సతక్. 'ఆస్ట్రోమ్ టెక్నాలజీ'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా తన సత్తా చాటింది. 'నన్ను నేను ఒక ఇన్నోవేటర్‌గా భావిస్తాను' అంటుంది 'ఆస్ట్రోమ్ టెక్నాలజీ' కో–ఫౌండర్, సీఈవో నేహా సతక్. 'ఇన్నోవేటివ్ హై–బ్యాండ్‌విడ్త్ టెక్నాలజీని అభివృద్ధి చేయడానికి, ఇంటర్నెట్ సేవలను ప్రపంచవ్యాప్తంగా అందుబాటు ధరలోకి తీసుకురావడానికి, మారుమూల ప్రాంతాలకు కూడా ఇంటర్నెట్ అందుబాటులో ఉండాలనే ఆలోచనలో ఆస్ట్రోమ్ టెక్నాలజీ మొదలుపెట్టాం. ఆస్ట్రోమ్ గిగామెష్ డివైజ్ చుట్టుపక్కల ఉన్న నాలుగు డివైజ్‌లను కనెక్ట్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఒక పరికరాన్ని మాత్రమే కనెక్ట్ చేయగలదు' అంటుంది నేహా సతక్.

హర్దిక షా (ఫిన్‌టెక్)



ముంబైలోని మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది హర్దిక షా. చిన్నపాటి వ్యాపారం నిర్వహించడానికి తల్లి పడే కష్టాలను దగ్గరి నుంచి చూసిన షా యూఎస్‌లో కంప్యూటర్ సైన్స్ చేసింది. కొలంబియా బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ పూర్తయిన తరువాత టాప్ సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్స్‌లో పాల్గొంది. మన దేశంలో చిన్న వ్యాపారాలు చేస్తున్నవారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి నిపుణులతో మాట్లాడి ఎన్నో విషయాలు తెలుసుకుంది. ఆ తరువాత బెంగళూరు కేంద్రంగా 'కినార క్యాపిటల్' అనే ఫిన్‌టెక్‌ను ప్రారంభించింది. ఈ ఫిన్‌టెక్‌కు ఆరు రాష్ట్రాల్లో 110 శాఖలు ఉన్నాయి. 'గ్యారెంటీ లేని బిజినెస్. చాలా రిస్క్' అన్నారు హర్దిక షా ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టినప్పుడు. అయితే ఆ మాటలేవీ ఆమెపై ప్రభావం చూపలేదు. తొలి అడుగుల్లోనే కస్టమర్‌లు, ఇన్వెస్టర్‌ల విశ్వాసాన్ని గెలుచుకుంది. 'ఫిన్ టెక్' ఫీల్డ్‌లో విజయకేతనం ఎగరేసింది.

డా. ప్రియా అబ్రహం, వైరాలజిస్ట్



మన దేశంలోని ప్రసిద్ధ వైరాలజిస్ట్‌లలో డా. ప్రియా అబ్రహం ఒకరు. కేరళలోని కొట్టాయం జిల్లాలో పుట్టిన ప్రియ క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ వెల్లూరు(సీఎంసీ)లో బయాలజీలో పీహెచ్‌డీ చేసింది. సీఎంసీ 'క్లినికల్ వైరాలజీ సెక్షన్' హెడ్‌గా పనిచేసింది. వైరల్ ఇన్‌ఫెక్షన్‌లకు సంబంధించిన ఎన్నో కమిటీల్లో, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ సైంటిఫిక్ అడ్వైజరీ కమిటీలో పనిచేసింది. నేషనల్ వైరల్ ఇన్‌ఫెక్షన్ సర్వైలెన్స్ రిసెర్చ్‌లో భాగం అయింది. కోవిడ్–19కి జస్ట్ రెండు నెలల ముందు పుణెలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ హెడ్‌గా బాధ్యతలు చేపట్టింది. 'ఆ టైమ్‌లో ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాను' అని కరోనా కాలాన్ని గుర్తు తెచ్చుకుంటుంది ప్రియ. టెస్టింగ్ కిట్‌లను వివిధ టెస్టింగ్ ల్యాబ్‌లకు పంపే లాజిస్టిక్స్‌ను నిర్వహించడం నుంచి కొత్తగా పుడుతున్న వేరియెంట్లను నిశితంగా పరిశీలించడం వరకు వైరస్ వ్యాప్తిని అరికట్టే విషయంలో ప్రియ ఆమె బృందం ఎంతో కృషి చేసింది. లాజిస్టిక్స్ నిర్వహణకు మాత్రమే పరిమితం కాకుండా మన దేశంలో జరిగిన అన్ని వ్యాక్సిన్ ట్రయల్స్ పర్యవేక్షణలోనూ కీలక పాత్ర పోషించింది. 'గుర్తింపు, విజయం రావాలని ఆశగా పరుగెత్తినంత మాత్రాన రావు. మనం చేసిన కృషిని బట్టి వెదుక్కుంటూ మన దగ్గరికే వస్తాయి' అంటుంది ప్రియా అబ్రహం.

రిమ్‌జిమ్ అగర్వాల్ (న్యూరో–ఇన్‌ఫర్‌మేటిక్స్)



లైనా ఇమాన్యుయేల్‌తో కలిసి న్యూరో–ఇన్‌ఫర్‌మేటిక్స్ ప్లాట్‌ఫామ్ 'బ్రెయిన్‌సైట్'ను ప్రారంభించింది రిమ్‌జిమ్ అగర్వాల్. బ్రెయిన్‌సైట్ ఏఐ సాఫ్ట్‌వేర్ మెంటల్ హెల్త్ ప్రాక్టిషనర్స్‌కు, న్యూరోసర్జన్స్ బాగా ఉపయోగపడుతుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్‌లో పీహెచ్‌డీ చేసిన అగర్వాల్ మెంటల్ హెల్త్‌కు సంబంధించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) అప్లికేషన్‌లను స్టడీ చేసింది. 'గూగుల్ మ్యాప్ ఆఫ్ ది బ్రెయిన్'గా 'బ్రెయిన్‌సైట్' ప్లాట్‌ఫామ్ గుర్తింపు పొందింది. ఈ ప్లాట్‌ఫామ్‌ను నాలుగు రకాల టెక్నాలజీలతో రూపొందించారు. స్కిజోఫ్రెనియా, బైపోలార్ డిజార్డర్‌లాంటి మానసిక వ్యాధులకు సంబంధించి ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది.

మెదడులో ఏం జరుగుతుందో అనేదానిపై 'బ్రెయిన్‌సైట్' సాంకేతికత దృష్టి సారిస్తుంది. స్థూలంగా చెప్పాలంటే మానసిక సమస్యతో బాధపడుతున్న వారి గురించి సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. 'మా పరిశోధనలను ఎక్కువమందికి చేరువ చేయాలనే లక్ష్యంతో ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారాను. ఫంక్షనల్ అంశాలకు కృత్రిమ మేధస్సును వర్తింప చేస్తున్న ప్రపంచంలోని అతి కొద్ది కంపెనీలలో మా కంపెనీ ఒకటి' అంటుంది అగర్వాల్.

అశ్వినీ అశోకన్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)



అమెరికాలోని కార్నెగీ మెలన్ యూనివర్శిటీలో ఇంటరాక్షన్ డిజైన్ కోర్సు చదువుతున్న రోజుల నుంచి అశ్వినీ అశోకన్‌కు కంప్యూటర్‌కు సంబంధించి విషయాలపై ఆసక్తి ఉండేది. 'ఇంటెల్'లో దశాబ్దం పాటు వివిధ రకాల ఇంటర్నెట్ ఆధారిత ఉత్పత్తులకు సంబంధించిన విభాగాల్లో పనిచేసింది. ఈ అనుభవ జ్ఞానంతో 'మ్యాడ్‌స్ట్రీట్ డెన్'ను ప్రారంభించింది. డిజిటల్, ఏఐ ట్రాన్స్‌ఫర్‌మేషన్‌కు సంబంధించి కంపెనీల జర్నీలో 'మ్యాడ్‌స్ట్రీట్' ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుంది. 2020–2021లో కంపెనీలో రకరకాల పరిశ్రమలలోకి విస్తరించింది. వ్యాపార విజయాలకు మాత్రమే కాదు ఉద్యోగాలలో జెండర్ ఈక్వాలిటీకి కూడా ప్రాధాన్యత ఇస్తోంది అశ్విని. కోవిడ్ సమయంలో ఉద్యోగాలు మానేసిన ఎంతోమందిని తిరిగి పనిలో చేరేలా కృషి చేసింది.

'అన్ని రకాల కంపెనీలను నడిపించడంలో మహిళలు ముందుండాలి' అని కోరుకుంటున్న అశ్వినీ అశోకన్ ఈ భూగోళంలో ప్రతి ఉద్యోగి, ప్రతి వ్యక్తిని ఏఐ నేటివ్‌గా చూడాలనుకుంటుంది.

అపర్ణ పురోహిత్ (వినోద రంగం)



మాస్ కమ్యూనికేషన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన అపర్ణ పురోహిత్ ఎన్నో కలలతో ఢిల్లీ నుంచి ముంబైలోకి అడుగు పెట్టింది. ముంబైకి వచ్చిన ఐదేళ్ల తరువాత ఇండిపెండెంట్ డైరెక్టర్–ప్రొడ్యూసర్ కావాలనే తన కలను సాకారం చేసుకుంది. కథలు చెప్పాలనే కలతో ముంబైకి వచ్చిన అపర్ణ 'అమెజాన్ ప్రైమ్ వీడియో ఇండియా ఒరిజినల్స్' హెడ్‌గా కొత్త ప్రయాణం ప్రారంభించింది.

చిన్నాపెద్దా అనే తేడా లేకుండా ఎన్నో ప్రాజెక్ట్‌లలో పనిచేసింది. 'ఇది నా పని కాదు' అని ఎప్పుడూ అనుకోలేదు. ట్యూషన్స్ చెప్పడం నుంచి వాయిస్ ఓవర్ వరకు ఎన్నో పనులు చేసింది. 'అమెజాన్ ప్రైమ్‌వీడియో–ఇండియా' హెడ్ హోదాలో పాతాళ్ లోక్, మీర్జాపూర్ మేడ్ ఇన్ హెవెన్, ది ఫర్‌గొటెన్ ఆర్మీలాంటి ఒరిజినల్ ఇండియన్ బ్లాక్‌బస్టర్ కంటెంట్‌తో మంచి పేరు తెచ్చుకుంది.

'సూపర్‌మెన్‌లాగా సూపర్ ఉమెన్ అనే మాట ఎందుకు వినిపించదు' అనే మాటకు అపర్ణ పురోహిత్ ఇచ్చిన జవాబు...

'తమ దైనందిన జీవితంలో మహిళలు ఎప్పుడూ సూపరే'

ఒక మహిళ శక్తిమంతురాలు... అని చెప్పడానికి ఒక నిదర్శనం ఆమె కుటుంబాన్ని నిర్వహించే తీరు. శక్తిమంతురాలైన మహిళ తన ఇంట్లో వ్యక్తుల మధ్య ఉండాల్సిన కుటుంబ బంధాలను చక్కగా నిర్వహించగలుగుతుంది. ఏ ఇంట్లో అయినా బంధాలు, బాంధవ్యాల నిర్వహణ బాధ్యత మహిళ భుజాల మీదనే ఉంటుంది. మగవాళ్లు పని ఒత్తిడిలో క్షణికావేశానికి లోనైనప్పుడు ఆ పరిస్థితిని చక్కదిద్దగలిగింది మహిళ మాత్రమే. ఆ మహిళ ఆ మగవ్యక్తికి తల్లి కావచ్చు, భార్య కావచ్చు, ఇంటి కోడలు కావచ్చు. ఒక ఇంట్లో తల్లి, కోడలు, కొత్తతరం కోడలు అందరూ అనుబంధాలకు విలువ ఇచ్చేవారైతే ఆ కుటుంబం ఎంత ఆనందంగా ఉంటుందో ఈ ఫొటో చెప్తోంది. ఉపాసన, సురేఖ, అంజనాదేవి... కొణిదెల ఇంటి మూడు తరాల కోడళ్లు. తమ ఇంటి రుచుల అనుబంధాలను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి'తో పంచుకున్నారు.


సురేఖ, ఉపాసన, అంజనాదేవి

ఆహారంలోనే ఆరోగ్యం

మూడుతరాల కోడళ్ల ముచ్చట్లు

పిల్లలు తింటేనే నాకు బలం

నాకు వంట చేయడం చాలా ఇష్టం. అయితే పెద్దగా ఓపిక లేదిప్పుడు. పిల్లలు ఫోన్ చేసినప్పుడు 'ఏమైనా వండి పంపించమంటావా' అని అడుగుతాను. మొన్నొక రోజు చరణ్ 'నాయనమ్మా రొయ్యల పలావు చేస్తావా' అన్నాడు. రేపు ఎలా ఉంటుందో, చేయగలనా లేదా అని ఆ రోజు రాత్రి నిద్రపట్టలేదు. రొయ్యల పలావు వండి, చరణ్ తిని బాగుందన్న తర్వాత నెమ్మదించాను. ప్రతిదీ రుచిగా ఉండాలనుకుంటాను. హైదరాబాద్‌కి వచ్చిన తర్వాత కూడా మంచి కాఫీ కోసం నెల్లూరు, నిర్మలా కేఫ్ నుంచి కాఫీ పొడి తెప్పించుకునేదాన్ని. పిల్లలందరికీ చక్కగా వండి పెట్టడమే నాకు సంతోషం, అదే నా బలం.

– అంజనాదేవి

మా కోడలు నన్ను మార్చేసింది

గత ఏడాది మహిళాదినోత్సవానికి – ఈ మహిళా దినోత్సవానికి మధ్య నా జీవితం ఓ కీలకమైన మలుపు తీసుకుంది. గృహిణిగా ఉన్న నన్ను ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది ఉపాసన. 'అత్తమ్మాస్ కిచెన్' ప్రారంభానికి మూలం కోసం నాలుగు దశాబ్దాల వెనక్కి వెళ్లాలి. మా పెళ్లయిన కొత్తలో చిరంజీవి షూటింగ్ కోసం పారిస్ వెళ్లినప్పుడు నేనూ వెళ్లాను. 47 రోజులు అక్కడ ఆయన మీట్, సాస్‌లు తినలేక ఇబ్బంది పడ్డారు. బయటి దేశాలకు వెళ్లినప్పుడు ఇంటి భోజనాన్ని ఎంజాయ్ చేయడం కోసం నేను కనుక్కున్న ఫార్ములానే ఈ ప్రీ కుక్‌డ్ ఫుడ్. అలాగే ఉపాసన ఆస్కార్ అవార్డు వేడుకలకు వెళ్లినప్పుడు తను ప్రెగ్నెంట్. భోజనం సరిగా తింటుందో లేదోనని ఇదే ఫార్ములా ఇన్‌స్టంట్ మిక్స్‌లు చేసిచ్చాను. తను చాలా సంతోషపడింది. ఇండియా వచ్చిన తరవాత తన ఆలోచన నాతో చెప్పింది. ఎంటర్‌ప్రెన్యూర్ అనే మాటే అప్పుడు నాకు అర్థం కాని విషయం. అయితే వంట వరకు నా పర్యవేక్షణలో జరుగుతుంది. ప్రభుత్వ అనుమతులు, మార్కెటింగ్ వంటివన్నీ ఉపాసన చూసుకుంటుంది. ఈ సందర్భంగా అరవై దాటిన మహిళలకు నేను చెప్పే మాట ఒక్కటే. యాభై దాటే వరకు మన ఆరోగ్యం గురించి పెద్దగా పట్టించుకున్నా పట్టించుకోకపోయినా గడిచిపోతుంది. అరవైలలోకి వస్తున్నారంటే దేహం మీద దృష్టి పెట్టాలి. రోజుకో గంట సమయం వ్యాయామం కోసం కేటాయించాలి. ఎన్నాళ్లు బతుకుతామనేది కాదు, బతికినన్నాళ్లూ ఆరోగ్యంగా ఉండాలి. అలాగే మా ఉపాసన మాటలను విన్న తర్వాత నాకు తెలిసిందేమిటంటే... ఈ తరం మహిళలు ముఖ్యంగా గృహిణులు తమకంటూ ఓ గుర్తింపును కోరుకుంటారు. అలాగని అందరికీ పెద్ద పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించే వెసులుబాటు ఉండదు. ఆర్థిక సౌలభ్యం లేదని దిగులు చెందవద్దు. ఇంట్లోనే చేయగలిగే పచ్చళ్లు, హోమ్ ఫుడ్‌తో చిన్నస్థాయిలో మొదలుపెట్టండి. మీ కృషితో మీ కుటీర పరిశ్రమను విస్తరించండి. మీకంటూ గుర్తింపు దానంతట అదే వస్తుంది.

– సురేఖ

అత్తమ్మ నా రోల్‌మోడల్

మీకు తెలుసా... అత్తమ్మ వెయిట్ లిఫ్టర్! రోజూ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా వెయిట్ లిఫ్ట్ చేస్తారు. ఆమె ప్రతి విషయంలో ఎంత నిదానంగా, ఎంత జాగ్రత్తగా ఉంటారో, మాట్లాడే ముందు ఎంత ఆలోచిస్తారో... అన్నీ నాకు గొప్పగా అనిపిస్తాయి. ప్రీ కుక్‌డ్ ఫుడ్ ఫార్ములా తెలిసి ఎంత ఎగ్జయిట్ అయ్యానో చెప్పలేను. ట్రావెల్ చేసే వాళ్లకు ఎంత బాగా ఉపయోగపడుతుందో కదా, దీనిని అందరికీ పంచుదామన్నాను. ఇప్పటికే మార్కెట్‌లో ఉప్మా, పులిహోర వంటి మిక్స్‌లు ఉన్నప్పటికీ వాటిలో ప్రిజర్వేటివ్స్ కూడా ఉంటాయి. అలా కృత్రిమ ప్రిజర్వేటివ్స్ ఏమీ లేకుండా చేసిన మా అత్తమ్మ రెసిపీలను విస్తృతంగా ప్రాచుర్యంలోకి తీసుకురావాలనేదే నా ప్రయత్నం. ఇప్పుడు ఉప్మా, పులిహోర, రసం, పొంగల్ నాలుగు ఉత్పత్తులతో మార్కెట్‌లోకి వచ్చాం. మరో మూడు ప్రయోగాల దశ పూర్తి చేసుకుని సిద్ధంగా ఉన్నాయి. ఇప్పుడు మా పాపకు అందిస్తున్న చిరుధాన్యాలు, పప్పులతో ఇన్‌స్టంట్ ఫుడ్ పౌడర్‌ను కూడా మార్కెట్‌లోకి తీసుకువస్తాం. ఈ ఐడియాకి అత్తమ్మ గారింట్లో ఆశ్చర్యపోయారు. కానీ మా పుట్టింట్లో మహిళలందరూ ఎంటర్‌ప్రెన్యూర్‌లే కావడంతో వాళ్లు విన్న వెంటనే సంతోషంగా స్వాగతించారు. హెల్త్ ఇండస్ట్రీ నుంచి వచ్చిన అమ్మాయిని ఫుడ్ ఇండస్ట్రీలోకి రావడంలో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. ఆహారంలోనే ఆరోగ్యం ఉంది.

– ఉపాసన

ఇంటర్వ్యూ: వాకా మంజులారెడ్డి; ఫొటో: నోముల రాజేశ్‌రెడ్డి


ప్రతీకాత్మక చిత్రం

* స్త్రీ శక్తి

'మహిళలను గౌరవిద్దాం' అనే మాట తరచూ వింటుంటాం. మహిళ గురించి మాట్లాడే ఉన్నతమైన పదాలు మహిళా దినోత్సవం వరకే పరిమితం అవడం కూడా చూస్తుంటాం. 'సమాజంలో వస్తున్న మార్పులను ఆహ్వానించే క్రమంలో స్త్రీ గౌరవానికి, రక్షణకు వెన్నుదన్నుగా నిలిచేది కూడా మొదట మహిళే అయి ఉండాలి' అంటూ వివిధ రంగాలలోని మహిళలు తమ మాటల ద్వారా ఇలా వినిపిస్తున్నారు. మహిళా దినోత్సవ స్ఫూర్తితో ఆ మాటలను ఆచరణలోనూ పెట్టి మంచి ఫలితాలను చూద్దాం.

– నిర్మలారెడ్డి

మనల్ని మనం గౌరవించుకుందాం..

ప్రయత్నించడం మానకూడదు



మగవారితో పోల్చితే ఇంట్లో, ఆఫీసులోనూ స్త్రీల పాత్ర ఎక్కువే. రెండుచోట్లా నిబద్ధతతో పని చేస్తుంటారు. కానీ, రెండు చోట్లా అర్థం చేసుకునేవారుండరు. విసుగు అనిపిస్తుంటుంది. అలాగని, మన ప్రయత్నాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదలకూడదు. ముప్పై ఏళ్ల క్రితం నేను పీజీ విద్యార్థిగా ఉన్నప్పుడు క్లాసులో అమ్మాయిలు ఐదు శాతం కన్నా తక్కువే ఉండేవారు. ఇప్పుడు.. పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్టూడెంట్స్‌లో 60 నుంచి 70 శాతం మంది అమ్మాయిలు ఉంటున్నారు. బాయ్స్ హాస్టల్స్‌లో కొన్నింటిని గర్ల్స్ హాస్టల్‌గా మార్చేద్దామని కూడా చూస్తున్నాం. పీహెచ్‌డి చేసే అమ్మాయిల సంఖ్యా పెరిగింది. పోరాడి సీట్లు, పదవులు దక్కించుకుంటున్నాం. అయితే, ఎంత పెద్ద చదువులు చదివినా, ఏ హోదాలో ఉన్న ముందు ఎవరిని వారు గౌరవించుకోవాలి. చదువులో, హోదాలో సమానత్వం కోసం పాటుపడాలనే కాదు మన ఆత్మగౌరవాన్ని కోల్పోకుండా ఆత్మస్థైర్యంతో ఎదగాలనుకోవాలి. కుటుంబంలో ఏ కష్టం వచ్చినా ఆ కుటుంబాన్ని కాపాడుకోగలమనే ధైర్యం ఉండాలి. రక్షించడానికి ఎవరో ఒక మగవాడైనా ఉండాలి అనే ఆలోచనను దూరం పెట్టాలి. అప్పుడే మన శక్తి ఏంటో మనకు తెలుస్తుంది. అందుకు తగిన సత్తాను సంపాదించుకోవడం మన లక్ష్యం అవ్వాలి. ఆత్మరక్షణ, కుటుంబ రక్షణ సమాజంలో మనల్ని ఉన్నతంగా చూపుతుంది.

– ప్రొఫెసర్ సి.వి. రంజని,
హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్, ఓయూ

వ్యక్తిత్వాన్ని పోస్ట్‌మార్టం చేస్తున్నారు



స్లోగన్స్ చెబుతున్నారు. కానీ, పాటించడం లేదు. మగవారితో సమానంగా కష్టపడుతున్నారు. కానీ, మగవారు స్త్రీని శారీరకంగా బలహీనులుగానే చూస్తారు. ఆమె శక్తి తెలిస్తే మగవారిలో ఆ ఆలోచనే రాదు. ఎక్కడైనా లైంగిక వేధింపులకు గురైన మహిళ ఎవరైనా ఉంటే ఆ సంఘటనను, సదరు వ్యక్తులను కాకుండా ముందు ఆమె వ్యక్తిత్వాన్ని పోస్ట్‌మార్టం చేస్తుంటారు. ఇంటి దగ్గర నుంచి పని ప్రదేశంలోకి ఒక మహిళ రావాలంటే ఎన్నో అడ్డంకులను దాటాల్సి ఉంటుంది. అక్కడా వేధింపులు తప్పవు. ప్రేమించి పెళ్లి చేసుకుని ఇంటి నుంచి బయటకు వచ్చిన అమ్మాయిలు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. పెళ్లి చేసుకున్న అబ్బాయి వదిలేసి వెళ్లిపోతే, పుట్టింటి సహకారం అందక ఆ అమ్మాయి బతుకుదెరువులో చాలా వేధింపులను ఎదుర్కొంటున్నది. ఆమె జీవనం గురించి తప్పుగా మాట్లాడే మగవాళ్లు ఉన్నారు. సమస్యను ఎదుర్కోవడంలో గొడవ తప్పక జరుగుతుంది. కానీ, సింగిల్ ఉమెన్ గొడవ పడితే ఆమె వ్యక్తిత్వాన్ని కించపరుస్తుంటారు. తల్లి తన కూతురుకి ఒంటరిగా ఎలా జీవించాలో చెబుతూనే సమాజాన్ని ఎదుర్కొనే ధైర్యం ఇవ్వాలి. సోషల్ మీడియాలో 'ఆమె'గౌరవానికి సంబంధించిన దారుణమైన వీడియోలు చూస్తున్నాం. ఏదైనా అమ్మాయికి సంబంధించిన సంఘటన జరిగినప్పుడు 'అమ్మాయి ఎలాంటిది?' అని ఆమెను నెగిటివ్‌గా ప్రాజెక్ట్ చేస్తున్నారు. స్వలాభం కోసం చేసే ఇలాంటి ఎన్నో పనులు 'ఆమె' గౌరవాన్ని తీసేస్తూ బతికేస్తున్నారు.

– డాక్టర్ జయశ్రీ కిరణ్, కాకతీయ ఫౌండేషన్, హైదరాబాద్

మన మీద మనకు నమ్మకం



మగవారితో పోల్చుకుంటే టైమ్ మేనేజ్ చేయగల శక్తి స్వతహాగా స్త్రీకి ఉంటుంది. ఒక గోల్ రీచ్ అవ్వాలని కష్టపడితే అది ఎంత దూరంలో ఉన్నా మనకు దగ్గర కావల్సిందే. మనం ఏదైనా చేయాలనుకున్నప్పుడు ఆరోగ్యం బాగా లేదనో, సరైన చదువు లేదనో, కుటుంబ బాధ్యతలు ఉన్నాయనో.. ఇలా వెనకడుగు వేయాల్సిన అవసరం లేదు. ఎంత కష్టమైన పరిస్థితులు ఎదురైనా మన కలలను మనమే డిజైన్ చేసుకోవచ్చు. ఇంట్లో ఉండి కూడా మనల్ని మనం బాగు చేసుకోవచ్చు. నాకు స్కూల్ వయసులో పెళ్లి అయింది. ఇద్దరు పిల్లలు. అయినా యోగా ట్రైనర్‌గా, బ్యూటీషియన్‌గా మేకప్ అకాడమీ నడుపుతున్నాను. పిల్లలిద్దరూ సెటిల్ అయ్యారు. ఇంటిని చక్కదిద్దుకుంటూనే నా పనులు చేసుకుంటూ వచ్చాను. సమస్యలు ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఉంటాయి. నా కెందుకు ఈ సమస్య వచ్చింది అని ఏడ్చుకుంటూ కూర్చుంటే ఎప్పటికీ పరిష్కారం అవ్వదు. సానుభూతి తప్ప బయటి నుంచి గౌరవం కూడా లభించదు. మనమీద మనకున్న నమ్మకమే మనకు గౌరవాన్ని తెచ్చిపెడుతుంది.

– రూప, యోగా టీచర్ అండ్ బ్యూటీషియన్

భయం బిడియంతో శక్తి తగ్గుతుంది



స్త్రీలను గౌరవించండి అనే మాట చాలా చోట్ల వింటూనే ఉంటాం. ఆ మాట వినటమే మన దౌర్భాగ్యం. ఎందుకంటే స్త్రీని గౌరవించాలి అని చెబితే గాని తెలియని సమాజంలో మనం జీవనం సాగిస్తున్నాం. ఉమ్మడి కుటుంబాలలో ఉన్నప్పుడు స్త్రీకి మాట్లాడే అవకాశం కూడా ఉండేది కాదు. ఇంటి పనుల్లో వంట పనుల్లో మునిగిపోయే వాళ్ళు. ప్రస్తుత పరిస్థితులు అలా లేవు. మారుతున్న టెక్నాలజీతో పాటు మనలో కూడా మార్పు రావాలి. భయం, బిడియం అనే భావాలతో స్త్రీ తన శక్తిని గుర్తించటం లేదు. ఒక తల్లి యవ్వనంలో ఉన్న తన కూతురుతోనో కొడుకుతోనో తన చిన్నప్పటి కబుర్లు, నెరవేరని కలలు, రక్తసంబంధాలు, స్నేహితుల గురించి, జీవితంలో అనుభవించిన కష్టాలు వాటిని ఎదుర్కొనే నేర్పరితనం... చర్చించడం లేదనిపిస్తోంది. నాటి పరిస్థితులు వేరు, ఇప్పటి పరిస్థితులు వేరు అనుకుంటారు. కానీ, ఏ కాలమైనా స్త్రీ ఎప్పుడూ మెలకువతో తనను తాను కాపాడుకోవాలనే స్పృహతో ఉండాలి. పాలకులు కూడా స్త్రీని అన్ని రంగాల్లో పైకి తెస్తున్నాం అని చెబుతుంటారు. కానీ, అమ్మాయిలపై అఘాయిత్యాలను మాత్రం అడ్డుకోలేకపోతున్నారు. స్వతంత్ర దేశం కోసం ఎందరో స్త్రీలు తమ ప్రాణాలర్పించారు. వారి ప్రాణత్యాగాన్ని స్మరణ చేసుకున్నా మహిళగా ఈ సమాజంలో ఎలా ఉండాలి అనేది తెలుస్తుంది. మనలో మనకు ఐకమత్యం ఉండాలి. ఏ కారణం వల్ల ఒంటరిగా ఉంటున్న స్త్రీని సాటి స్త్రీ అర్థం చేసుకొని, ఆమెకు మద్దతునివ్వగలిగితే చాలు ధైర్యం పెరుగుతుంది. స్త్రీలు ఒకరికి ఒకరుగా నిలవాలి. పనిమనిషి పనిని కూడా గౌరవించడం కుటుంబంలో వారికే అర్థమయ్యేలా తెలపాలి. పారిశుద్ధ్య కార్మికురాలి, పనిమనిషి, రోజువారీ పనుల్లో తారసపడే ప్రతి స్త్రీని గౌరవించాలని పిల్లలకు చెప్పాలి. రేపటి తరంలో వచ్చే మార్పు కూడా సమాజానికి మేలు కలుగజేస్తుంది.

– వి. ప్రతిభ, బిజినెస్ ఉమెన్

నేడు మహిళా దినోత్సవం

యువర్స్


రిధిమ పాండే


గర్విత గుల్హటి


వర్ష రైక్వార్


హీనా సైఫీ


నేహా శివాజీ నైక్వాడ్

పర్యావరణ దీపికలు

విశ్వంభర గీతికలు

'ఆట, పాట గురించే కాదు మనం నడిచే బాట గురించి కూడా ఆలోచించాలి' అంటున్నారు ఈ యువ మహిళలు. మనం ప్రయాణించే మార్గం ఏది అనేదే భవిష్యత్‌ను నిర్దేశిస్తుంది. బంగారు భవిష్యత్ కోసం పర్యావరణ స్పృహతో 'మనం నడవాల్సిన బాట ఇది' అంటూ మార్గనిర్దేశ ఉద్యమ కార్యచరణలో భాగం అవుతున్నారు యువ మహిళలు. 'అరుణోదయం ఊరుకోదు...కిరణాలను సారించనిదే ప్రసరించే నీరు ఊరుకోదు....పల్లం అంతుముట్టనిదే ప్రతిఘటించే మనసు ఊరుకోదు... ప్రశ్నలను ఎక్కుపెట్టనిదే' అంటుంది 'విశ్వంభర' కావ్యం. ప్రశ్నలు ఎక్కుపెట్టి పర్యావరణ సంరక్షణ కోసం నడుం కట్టిన యువ మహిళల గురించి...

1 రిధిమ పాండే నిగ్గదీసి అడిగే నిప్పు స్వరం

ఉత్తరాఖండ్‌కు చెందిన రిధిమ పాండే చిన్న వయసులోనే క్లైమెట్ యాక్టివిస్ట్‌గా పెద్ద పేరు తెచ్చుకుంది. పర్యావరణ కార్యకర్తలైన తల్లిదండ్రుల నుంచి స్ఫూర్తి పొందింది. ప్రకృతి విధ్వంసం, వాతావరణ మార్పులపై ప్రభుత్వం సరైన సమాధానం ఇవ్వడం లేదంటూ 2019లో రిధిమ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పర్యావరణ సంబంధిత కేసులను స్వీకరించడానికి 2010లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) ఏర్పాటు చేశారు. 'ఎన్‌జీటీ' రిధిమ కేసును స్వీకరించినప్పటికీ ఈ కేసు 'ఎన్విరాన్‌మెంట్ పాక్ట్ అసెస్‌మెంట్' పరిధిలోకి వస్తుందని కొట్టివేసింది.

వాతావరణ సంక్షోభంపై చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ బ్రెజిల్, ఫ్రాన్స్, జర్మనీ, టర్కీ, అర్జెంటీనా దేశాలపై ఐక్య రాజ్య సమితి బాలల హక్కుల కమిటీకి ఫిర్యాదు చేసిన 14 మంది యువ ఉద్యమకారులలో రిధిమ ఒకరు. ఏకైక భారతీయురాలు కూడా.

వాతావరణ సంక్షోభంపై రిధిమ గత కొన్ని ఏళ్లుగాఎన్నో వ్యాసాలు రాసింది. ఎన్నో దేశాలలో ఎన్నో ప్రసంగాలు చేసింది. వాతావరణ యువ ఉద్యమకారుల ప్రతి జాబితాలో చోటు సంపాదించింది.

'చిల్డ్రన్ వర్సెస్ క్లైమెట్ చేంజ్' పేరుతో పుస్తకం రాసింది.

2 గర్విత గుల్హటి నీరే ప్రాణాధారం

బెంగళూరుకు చెందిన గర్విత గుల్హటి ఇంజనీరింగ్ చేసింది. 'వై వేస్ట్?' స్వచ్ఛంద సంస్థ కో-ఫౌండర్‌గా నీటి సంరక్షణకు సంబంధించి ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. రెస్టారెంట్‌లలో నీటి వృథాను అరికట్టడంలో కీలక పాత్ర పోషించింది. బడి, కళాశాల, ప్రభుత్వ కార్యాలయాల్లో 'నీటి సంరక్షణ'కు సంబంధించి ఎన్నో వర్క్‌షాప్‌లు నిర్వహించింది. 'వై వేస్ట్?' సంస్థ దేశవ్యాప్తంగా 20 నగరాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

'వై వేస్ట్?' కోసం పనిచేస్తున్న తొలి దినాల్లో 'సమయం వృథా చేయవద్దు. చదువు మీద దృష్టి పెట్టు' 'పర్యావరణ కార్యక్రమాల కోసం పనిచేయడానికి ఇది సరియైన సమయం కాదు' అని గర్వితతో అనేవారు కొందరు. వారి మాటలను పట్టించుకోకుండా 'మన కోసం ప్లానెట్ వేచి చూడదు కదా. మరి ఆలస్యం చేయడం ఎందుకు?' అని ఆగకుండా ముందుకు వెళ్లింది.

'వై వేస్ట్?' ప్రారంభించడానికి కారణం గర్విత మాటల్లోనే...'మహారాష్ట్ర, బెంగళూరులో కరువు పరిస్థితులు, రైతుల ఆత్మహత్యల గురించి చదివి బాధపడ్డాను. తాగు నీటి కోసం మహిళలు ఎండలో మైళ్ల దూరం నడవడం చూశాను. మన దేశంలో కోట్లాది మంది పిల్లలకు స్వచ్ఛమైన నీరు అందుబాటులో లేదు. దీని వల్ల ఎంతో మంది పిల్లలు చనిపోతున్నారు. ఇలాంటి ఎన్నో కారణాలను దృష్టిలో పెట్టుకొని వై వేస్ట్ ఆవిర్భవించింది'

పద్దెనిమిది సంవత్సరాల వయసులో గర్విత గుల్హటి 'గ్లోబల్ చేంజ్‌మేకర్' టైటిల్‌కు ఎంపికైంది.

3 వర్ష రైక్వార్ ప్రతి ఊరుకు పర్యావరణ స్వరం

'గతంలో అద్భుతమైన పంట దిగుబడులు వచ్చేవి. క్రమక్రమంగా ఏటేటా పంట దిగుబడి క్షీణిస్తోంది. ఎందుకు ఇలా జరుగుతుంది అని ఆలోచించే క్రమంలో పర్యావరణ అంశాలపై ఆసక్తి పెరిగింది' అంటుంది మధ్యప్రదేశ్‌కు చెందిన వర్షా రైక్వార్. గతంలో చుట్టుపక్కల ఎన్నో వనాలు కనిపించేవి. అవి ఎందుకు అదృశ్యమయ్యాయి? అని స్థానికులను అడిగితే 'విధిరాత. అంతే! మనం ఏం చేయలేం' అని విధిపై భారాన్ని మోపారు. ఈ నేపథ్యంలో సామాన్య మహిళలకు 'వాతావరణ మార్పులు-కారణాలు-మన కార్యచరణ' గురించి తెలియజేయడానికి రేడియో జాకీగా ప్రస్థానం ప్రారంభించింది వర్ష. పర్యావరణ రంగంలో కృషి చేస్తున్న చేంజ్‌మేకర్‌ల అసాధారణ కథలను ఎఫ్‌ఎం 90.4 రేడియో బుందేల్‌ఖండ్ ద్వారా వెలుగులో తీసుకువచ్చి పదిమందికి తెలిసేలా చేసింది. వాతావరణ మార్పులపై అవగాహనను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లిన వర్ష 'యునైటెడ్ నేషన్స్ యంగ్ క్లైమెట్ లీడర్-2021'గా ఎంపికైంది.

4 హీనా సైఫీ వాయు కాలుష్యంపై వార్

ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో ఎంబీఏ చదువుతున్న హీనా సైఫీ 'క్లైమెట్ చేంజ్ ఛాంపియన్'గా గుర్తింపు పొందింది. ఉమెన్ క్లైమెట్ కలెక్టివ్ (డబ్ల్యూసీసీ) వేదికలో పాలుపంచుకున్న 16 మంది ఉమెన్ ఛాంపియన్స్‌లో హీన ఒకరు. ఐక్యరాజ్య సమితి 'వుయ్ ది చేంజ్' క్యాంపెయిన్‌లో కూడా హీన భాగం అయింది. ఎనిమిదవ తరగతి పూర్తయిన తరువాత 'ఇక చదివింది చాలు' అన్నారు తల్లిదండ్రులు. అయితే హీన పట్టుదల ముందు వారి నిర్ణయం ఓడిపోయింది. పర్యావరణ సమస్యలపై అవగాహన లేకపోవడానికి చదువుకోకపోవడం ఒక కారణం అని గ్రహించిన హీన, పిల్లలు ఎవరైనా స్కూల్ మానేస్తే వారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడేది. పిల్లలు తిరిగి స్కూలుకు వచ్చేలా చేసేది. అంతే కాదు...స్థానిక స్వచ్ఛంద సంస్థలో చేరి వాతావరణ మార్పులపై జరిగిన ఎన్నో సమావేశాలు, వర్క్‌షాప్‌లకు హాజరయ్యేది. 'క్లైమెట్ ఎజెండా'పై లక్నోలో జరిగిన సమావేశానికి హాజరై వాయు కాలుష్యం, ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్....మొదలైన ఎన్నో విషయాల గురించి తెలుసుకుంది. తాను తెలుసుకున్న విషయాలను ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసేది. 'సూరజ్ సే సమృద్ధి' పేరుతో సౌరశక్తి ఉపయోగాల గురించి విస్తృతంగా ప్రచారం చేసింది. బడులలో పర్యావరణ అంశాలకు సంబంధించి పోస్టర్-మేకింగ్ యాక్టివిటీస్ నిర్వహించింది.

5 నేహా శివాజీ నైక్వాడ్ గ్రీన్ రికవరీ

మన దేశంలోని కొద్దిమంది పర్యావరణ ఆధారిత డేటా సైంటిస్టులలో నేహా ఒకరు. క్లైమేట్ టెక్నాలజీ ఇంక్యుబేటర్లు, యాక్సిలరేటర్ల ద్వారా క్లైమేట్ డేటా ఫోకస్డ్ సొల్యూషన్స్ కోసం చేపట్టే కార్యక్రమాలకు సహకారం అందిస్తోంది నేహా. 'క్లైమేట్ కలెక్టివ్' ఫౌండేషన్ ద్వారా యువ ఎంటర్‌ప్రెన్యూర్‌లకు వ్యాపార పరిజ్ఞానం, మార్కెట్ కనెక్షన్లు, సాంకేతిక సామర్థ్యం విషయంలో సహాయపడుతోంది. 'క్లైమేట్ కలెక్టివ్'కు ముందు సాఫ్ట్‌వేర్, టెక్నాలజీకి సంబంధించిన మల్టీ నేషనల్ కన్సల్టింగ్ ఫర్మ్ 'జెడ్‌ఎస్ అసోసియేట్స్'లో పని చేసింది నేహా.

తన నైపుణ్యాన్ని ఉపయోగించి 140కి పైగా గ్రీన్ స్టార్టప్‌లను ప్రారంభించడంలో సహాయపడింది.

యూఎన్-ఇండియా 'వుయ్ ది చేంజెస్' క్యాంపెయిన్‌కు ఎంపికైన పదిహేడు మంది యంగ్ క్లైమేట్ చేంజ్ లీడర్‌లలో నేహా ఒకరు. 'జీరో-వేస్ట్'పై పని చేసే యూత్ సెల్ 'సెల్ పర్యావ్‌హ'కు కో-ఫౌండర్ అయిన నేహా 'గ్రీన్ రికవరీని వేగవంతం చేయడానికి నావంతుగా క్షేత్రస్థాయిలో పనిచేయాలనుకుంటున్నాను' అంటుంది.

● టెక్... టాక్



యాపిల్ న్యూ మ్యాక్‌బుక్ ఎయిర్

సైజ్	: 13.30 అంగుళాలు
రిజల్యూషన్	: 2560X1600 పిక్సెల్స్
బరువు (కేజీ)	: 1.29
మెటీరియల్	: అల్యూమినియం
స్టోరేజ్	: 256జీబి
కలర్	: గోల్డ్, సిల్వర్, స్పేస్ గ్రే

ఇన్‌స్టాలో 15 నిమిషాల ఎడిట్ ఫీచర్



మెసేజ్‌లను పంపిన తరువాత పదిహేను నిమిషాల వరకు ఎడిట్ చేయవచ్చని ప్రకటించింది ఫోటో, వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్. పదిహేను నిమిషాల ఈ ఎడిట్ విండో వాట్సాప్‌లాంటి ఇతర మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ లాగే ఉంటుంది. సరిగ్గా అనిపించని మెసేజ్‌లను సరిచేయడానికి ఇది యూజర్‌లను అనుమతిస్తుంది. యూజర్లు ఒకే సందేశాన్ని పలుమార్లు ఎడిట్ చేయవచ్చు. ఒకసారి ఎడిట్ చేసిన తరువాత మెసేజ్ ఎడిట్ చేయబడిందనే విషయం హైలెట్ అవుతుంది.

గెలాక్సీ ఎఫ్ 15



లేటెస్ట్ బడ్జెట్ 5జీ స్మార్ట్ ఫోన్ గెలాక్సీ ఎఫ్15 గురించి ప్రకటించింది శాంసంగ్. 4/6 జీబి ఆఫ్ ర్యామ్, 128 జీబి ఆఫ్ ఇంటర్నల్ స్టోరేజ్‌తో కూడిన రెండు మెమోరీ వేరియంట్స్‌తో వస్తోంది.
కొన్ని వివరాలు..
డిస్‌ప్లే: 6.5 అంగుళాలు రిఫ్రెష్ రేట్: 90 హెచ్
* ప్రైమరీ కెమెరా: 50 ఎంపీ
* బ్యాటరీ: 6,000 ఎఎహెచ్
కలర్స్: యాష్ బ్లాక్, జాజ్ గ్రీన్, వయోలెట్

సినిమా


● విశ్వక్ సేన్, విక్రమ్, అడివి శేష్

సినిమా చూడాలనే ఆసక్తి కలుగుతోంది - అడివి శేష్

''గామి' ట్రైలర్ చూసిన తర్వాత సినిమా చూడాలనే ఆసక్తి కలుగుతోంది. అలాగే అందరూ ఈ సినిమా హిట్ కావాలని కోరుకునేలా ఉంది. డైరెక్టర్ విద్యాధర్ ప్యాషన్‌కి హ్యాట్సాఫ్. విశ్వక్ సేన్ ప్రతిభ, నిజాయితీ ఉన్న నటుడు. తన నిజాయితీ గల మనసు కోసమే ఈ వేడుకకి వచ్చాను'' అని హీరో అడివి శేష్ అన్నారు. విశ్వక్ సేన్, చాందినీ చౌదరి జంటగా విద్యాధర్ కాగిత దర్శకత్వం వహించిన చిత్రం 'గామి'. వి సెల్యులాయిడ్ సమర్పణలో కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ మూవీ నేడు రిలీజవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా అడివి శేష్ పాల్గొన్నారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''గామి' సినిమా రషెస్ చూసినప్పుడు నా మనసు బరువెక్కింది. కొత్త రకం సినిమా చూడాలనుకునే ప్రేక్షకులకు 'గామి' సంతృప్తి ఇస్తుంది'' అన్నారు. ''ఇంటెన్స్ ఎమోషనల్ ఫిల్మ్ 'గామి'' అన్నారు విద్యాధర్ కాగిత.

భావోద్వేగాల దరువెయ్ - సాయిరామ్ శంకర్


● సాయిరామ్ శంకర్

''నాకు సినిమాలంటే చాలా ఇష్టం. అందుకే హరీష్, మాలాశ్రీ నటించిన 'ప్రేమ ఖైదీ' చిత్రం ఆడిషన్స్‌కి వెళ్లా. ఒక సినిమా హిట్టయితే ఎన్నో కుటుంబాల్లో సంతోషం నిండుతుంది. 'వెయ్ దరువెయ్' సినిమా పెద్ద విజయం సాధించాలి'' అని కామారెడ్డి ఎమ్మెల్యే కేవీ రమణా రెడ్డి అన్నారు. సాయిరామ్ శంకర్, యషా శివ కుమార్, హెబ్బా పటేల్ హీరో హీరోయిన్లుగా నవీన్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వెయ్ దరువెయ్'. లక్ష్మీనారాయణ పొత్తూరు సమర్పణలో దేవరాజు పొత్తూరు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి ఎమ్మెల్యే కేవీ రమణా రెడ్డి, దర్శకుడు హరీష్ శంకర్ అతిథులుగా హాజరయ్యారు. సాయిరామ్ శంకర్ మాట్లాడుతూ– ''బంపర్ ఆఫర్', అమ్మానాన్న ఓ తమిళమ్మాయి' లాంటి భావోద్వేగాలతో 'వెయ్ దరువెయ్' ఉంటుంది'' అన్నారు. ''మా చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు దేవరాజ్, నవీన్ రెడ్డి.

ఏపీ ఫైబర్‌నెట్‌లో శపథం


● రామ్‌గోపాల్ వర్మ

డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ తెరకెక్కించిన చిత్రం 'వ్యూహం'. ఈ మూవీకి సీక్వెల్‌గా 'శపథం' రూపొందింది. అజ్మల్, మానస ప్రధాన పాత్రల్లో నటించారు. దాసరి కిరణ్ కుమార్ నిర్మించిన 'వ్యూహం' ఈ నెల 2న విడుదలైంది. 'శపథం' థియేటర్స్‌లో విడుదల కావాల్సి ఉంది. కాగా 'శపథం' వెబ్ సిరీస్‌ని ఏపీ ఫైబర్ నెట్ యాప్ ద్వారా పే పర్ వ్యూలో చూసే వెసులుబాటు కల్పిస్తున్నట్లు రామ్‌గోపాల్ వర్మ ప్రకటించారు. 'శపథం ఆరంభం చాప్టర్ 1'ని గురువారం రాత్రి 8 గంటలకు రిలీజ్ చేయగా, 'శపథం అంతం చాప్టర్ 2'ని నేటి రాత్రి 8 గంటలకు విడుదల చేయనున్నారు. ప్రస్తుతం ఏపీ ఫైబర్ నెట్ యాప్‌లో విడుదలవుతున్న 'శపథం' సిరీస్‌లను అంచెలంచెలుగా అన్ని ఓటీటీల్లోకి తీసుకు రానున్నట్లు వర్మ ప్రకటించారు.

కొత్త తరం ప్రేమకథ


● ఆశిష్

''ఆర్య' సినిమాతో సుకుమార్‌ను దర్శకునిగా పరిచయం చేశాం. 'ఆర్య' కథ విన్నప్పుడు ఎలాంటి అనుభూతి కలిగిందో 'లవ్ మీ' విన్నప్పుడు కూడా అలాంటి అనుభూతే కలిగింది. ఇదొక కొత్త తరం ప్రేమకథ. ఇలాంటి కథతో ఇప్పటి వరకూ సినిమా రాలేదు'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. ఆశిష్, వైష్ణవీ చైతన్య జంటగా అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించిన చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యు డేర్' అన్నది ఉప శీర్షిక. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. ఈ సినిమా ఏప్రిల్ 27న విడుదల కానుంది. ఈ మూవీ టీజర్‌ను గురువారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా 'దిల్'రాజు మాట్లాడుతూ– ''పీసీ శ్రీరామ్ గారి విజువల్స్, కీరవాణిగారి సంగీతం ఈ సినిమాకు హైలెట్‌గా నిలుస్తాయి'' అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్ భీమవరపు, ఆశిష్ రెడ్డి, వైష్ణవీ చైతన్య మాట్లాడారు.

కామెడీ... ఎమోషన్

''నేను మొదట్నుంచి కంటెంట్‌ను నమ్మి సినిమాలు చేస్తూ వచ్చాను. ప్రేక్షకులు కూడా ఆదరించారు. కథను నమ్మి ఎమోషనల్‌గా ఫీల్ అయి చేసిన సినిమా 'రోటి కపడా రొమాన్స్'. ఏప్రిల్ 12న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఈ మూవీ ప్రేక్షకాదరణ పొందుతుందనే నమ్మకం ఉంది'' అని నిర్మాత బెక్కెం వేణుగోపాల్ అన్నారు. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘా లేఖ, ఖుష్బూ చౌదరి ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మించారు. ఈ చిత్రం విలేకరుల సమావేశంలో విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ– ''డైరెక్టర్ కావాలన్న నా 15 ఏళ్ల కల ఈ సినిమాతో తీరుతోంది. చాన్స్ ఇచ్చిన బెక్కెంగారికి థ్యాంక్స్. ఈ మూవీలో కేవలం వినోదమే కాదు.. అన్ని రకాల భావోద్వేగాలున్నాయి'' అన్నారు. ''ఇది యూత్‌ఫుల్ సినిమానే కాదు.. అన్ని వర్గాల వారికి నచ్చేలా ఉంటుంది'' అన్నారు హర్ష నర్రా.


● సుప్రజ్, హర్ష, ఖుష్బూ, మేఘ, సోను, తరుణ్

హీరోయిన్ యాక్షన్


● అనుష్క ● శ్రుతీహాసన్ ● కీర్తి సురేష్ ● కాజల్

డ్యాన్స్ మాత్రమే వచ్చా? అలా అంటారేంటీ.. ఫైట్స్ కూడా చేస్తారు. కాకపోతే ఆ ఒక్క చాన్స్ రావాలి. ఆ చాన్స్ వచ్చినప్పుడు హీరోయిన్లు యాక్షన్‌లోకి దిగుతారు. అలా కొందరు కథానాయికలు లేడీ ఓరియంటెడ్ చిత్రాలు చేస్తూ బిజీ బిజీగా ఉన్నారు. ఒకప్పటితో పోల్చితే ఇప్పుడు ఉమెన్ సెంట్రిక్ సినిమాలు పెరిగాయి. ఈ మహిళా దినోత్సవానికి కథానాయికల పరంగా ఇది ఆహ్వానించదగ్గ పరిణామం. ఇక సినిమాలో సమస్యలపై పోరాడుతున్న హీరోయిన్ 'యాక్షన్' గురించి తెలుసుకుందాం.


● రష్మిక ● అంజలి ● అనుపమా పరమేశ్వరన్

యువతి పోరాట

'అరుంధతి', 'రుద్రమదేవి', 'భాగమతి'.. ఇలా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో అనుష్కా శెట్టి సూపర్ హిట్. తాజాగా ఆమె మరో లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ సైన్ చేశారు. వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాకు క్రిష్ దర్శకుడు. ఆంధ్రా – ఒడిస్సా సరిహద్దు లొకేషన్స్‌లో ఇటీవల షూటింగ్ జరిపారు. ఓ యువతి పోరాటంతో సాగే ఈ సినిమాకు 'శీలవతి' టైటిల్‌ను అనుకుంటున్నారట.

సత్యభామ

పోలీసాఫీసర్ సత్యభామగా కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. ఓ అమ్మాయి హత్య కేసులో నిజమైన దోషులను పోలీస్ ఆఫీసర్ సత్యభామ ఏ విధంగా పట్టుకుంది? అనే అంశంతో ఈ సినిమా సాగుతుంది. సుమన్ చిక్కాల దర్శకత్వంలో బాబీ తిక్క, శ్రీనివాసరావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అలాగే హిందీలో కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్ చేసిన 'ఉమ' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది.

డిటెక్టివ్ అను

ఓ కొత్త చిత్రం కోసం చెన్నైలో డిటెక్టివ్ ఏజెన్సీ ఆరంభించనున్నారు శ్రుతీహాసన్. ఈ సినిమాకు ఫిలిప్ జాన్ దర్శకుడు. ఇందులో డిటెక్టివ్ అను పాత్రలో కనిపిస్తారు శ్రుతీహాసన్. ఈ సినిమాకు 'ది చెన్నై స్టోరీ' అనే టైటిల్ అనుకుంటున్నారట. తన నాన్న ఆచూకీ తెలుసుకోవాల్సిందిగా ఓ ఇంగ్లిష్ కుర్రాడు చెన్నైకి వచ్చి, డిటెక్టివ్ అనుని కలిశాక ఏం జరిగింది? అనే అంశం చుట్టూ ఈ సినిమా ఉంటుంది. అలాగే శ్రుతీహాసన్ నటించిన ఇంగ్లిష్ చిత్రం 'ది ఐ'. చనిపోయిన భర్త అస్థికలను సముద్రంలో కలిపేందుకు మరో చోటుకు వెళ్లిన ఓ మహిళ ఎలాంటి నిజాలు తెలుసుకుంది? ఎవరెవర్ని హత్య చేయాలనుకుంటుంది? అనే కోణంలో ఈ సినిమా సాగుతుందట.

కాలేజ్ స్టూడెంట్

రష్మికా మందన్నా తొలిసారి రెండు లేడీ ఓరియంటెడ్ సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'చిలసౌ' (2018)తో దర్శకుడిగా హిట్టైన నటుడు రాహుల్ రవీంద్రన్ ఇటీవల 'ది గాళ్ ఫ్రెండ్' కోసం మళ్లీ మెగాఫోన్ పట్టారు. ఈ సినిమాలో రష్మికా మందన్నా లీడ్ రోల్ చేస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, ధీరజ్ మొగిలినేని నిర్మిస్తున్నారు. ఇందులో రష్మిక కాలేజ్ స్టూడెంట్ రోల్ చేస్తున్నారని తెలిసింది. ఓ కాలేజ్ స్టూడెంట్ ప్రేమ, సంఘర్షణ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందన్నట్లుగా తెలుస్తోంది. రష్మిక నటిస్తున్న మరో ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'రెయిన్ బో'. ఈ సినిమాకు శాంతరూబన్ దర్శకుడు. ఓ మనిషి తన జీవితంలో ఎదుర్కొనే వివిధ దశల పరిస్థితులను 'రెయిన్ బో'లో చెబుతున్నారట.

హక్కుల కోసం పోరాటం

'మహానటి' (2018) సినిమాతో నటిగా తనలో ఎంత ప్రతిభ ఉందో నిరూపించుకున్నారు కీర్తీ సురేష్. ప్రస్తుతం ఈ బ్యూటీ చేతిలో 'రఘు తాతా', 'రివాల్వర్ రీటా', 'కన్నె వెడి' వంటి మూడు ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్ ఉన్నాయి. 'రఘు తాతా'కు సుమన్‌కుమార్ దర్శకుడు. బలవంతంగా హిందీ భాష నేర్చుకోవాలన్నప్పుడు ఓ యువతి ఏ విధంగా పోరాటం చేసింది? అనే కోణంలో ఈ సినిమా ఉంటుందట. అలాగే కీర్తి మరో ఫిల్మ్ 'రివాల్వర్ రీటా' కూడా పోరాటం నేపథ్యంలో సాగే సినిమాయే. 'కన్నె వెడి' సినిమాకు గణేశ్ రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇక హీరోయిన్‌గా 'బేబీ జాన్' చిత్రంతో హిందీకి పరిచయం అవుతున్నారు కీర్తి.

గీతాంజలి మళ్లీ వచ్చింది

తెలుగు హీరోయిన్ అంజలి నటించిన తొలి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'గీతాంజలి'. 2014లో విడుదలైన ఈ హారర్ కామెడీ ఫిల్మ్ హిట్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ సినిమాకు సీక్వెల్‌గా 'గీతాంజలి మళ్లీ వచ్చింది' వస్తోంది. అంజలి మెయిన్ లీడ్ రోల్ చేశారు. ఏప్రిల్ 11న విడుదల కానుంది. శివ తుర్లపాటి దర్శకత్వంలో ఎంవీవీ సత్యనారాయణ, కోన వెంకట్ నిర్మించిన 'గీతాంజలి 2' అంజలి కెరీర్‌లో 50వ చిత్రం కావడం విశేషం. ఓ ఇంట్లో చోటు చేసుకునే హారర్ ఎలిమెంట్స్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది.

రోడ్ ట్రిప్

హీరోయిన్లు అనుపమా పరమేశ్వరన్, దర్శనా రాజేంద్రన్, సంగీత కలిసి రోడ్ ట్రిప్‌కు వెళ్లారు. వెకేషన్ కోసం కాదు.. సినిమా కోసమే. రోడ్ ట్రిప్ నేపథ్యంలో 'సినిమా బండి' ఫేమ్ దర్శకుడు ప్రవీణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్, దర్శన, సంగీత లీడ్ రోల్స్ చేస్తున్నారు.

సెల్ఫ్ డిఫెన్స్

వరుసగా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్ చేస్తున్నారు హన్సిక. గత ఏడాది హన్సిక మెయిన్ లీడ్ రోల్ చేసిన 'మై నేమ్ ఈజ్ శ్రుతి', '105 మినిట్స్' చిత్రాలు రిలీజ్ అయ్యాయి. ఈ ఏడాది మరో రెండు రిలీజ్‌కు సిద్ధం అవుతున్నాయి. తమిళ 'గార్డియన్' చిత్రం నేడు విడుదల అవుతోంది. కాగా హన్సిక సైన్ చేసిన 'రౌడీ బేబీ' చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది. జేఎమ్ రాజ శరవణన్ ఈ మూవీకి దర్శకుడు. ఇవి కాకుండా హన్సిక చేతిలో మరో రెండో ఉమెన్ సెంట్రిక్ చిత్రాలు ఉన్నాయి.

ఇలా మరికొందరు హీరోయిన్లు ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌కి సై అన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
8-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
33	20
74,119	22,494

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,253	▲	222
డోజోన్స్	38,760	▲	99
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,692	▲	13
డాక్స్	17,843	▲	126
షాంఘై	3,027	▽	13
నికాయ్	39,599	▽	492

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
64,955	▲	462
బంగారం (99.5 స్వచ్ఛత)		
64,695	▲	460
వెండి (కిలో)		
72,265	▲	555

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భాయమ్‌కి	82.42	83.44
£	బ్రిటన్ పౌండ్	భాయమ్‌కి	104.30	106.85
€	యూరో	భాయమ్‌కి	89.21	91.56
¥	జపాన్ ఎన్ (100)	భాయమ్‌కి	55.14	56.39
AUS$	ఆస్ట్రేలియా డాలర్	భాయమ్‌కి	55.49	53.57
S$	సింగపూర్ డాలర్	భాయమ్‌కి	59.87	64.10
SAR	సౌదీ రియాల్	భాయమ్‌కి	21.17	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	భాయమ్‌కి	21.65	23.43
¥	చైనా యువాన్	భాయమ్‌కి	10.37	12.37

బంగారం మెరుపులు



న్యూఢిల్లీ: బంగారం నేషనల్ క్యాపిటల్‌లో కొత్త రికార్డులను చూసింది. 10 గ్రాములు పూర్తి స్వచ్ఛత పసిడి ధర న్యూఢిల్లీలో రూ.500 పెరిగి కొత్త గరిష్ఠ స్థాయి రూ. 65,650కి ఎగసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి పరుగు దీనికి కారణం. అంతర్జాతీయ కమొడిటీ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్స్ (31.1 గ్రాములు) భారీ స్థాయిల్లో ట్రేడవుతోంది. ఆసియా ట్రేడింగ్ సమయంలో ఒక దశలో బంగారం ధర 2,161.50 డాలర్లను తాకింది. ఫెడరల్ రిజర్వ్ చైర్ జెరోమ్ పావెల్ అమెరికా సెంట్రల్ బ్యాంక్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ సంవత్సరం వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందని పునరుద్ఘాటించిన నేపథ్యం తాజా పసిడి పరుగుకు కారణంగా మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

2023-24లో 8% వృద్ధి: శక్తికాంతదాస్



న్యూఢిల్లీ: భారత్ మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 8 శాతం వరకూ ఆర్థిక వృద్ధిని నమోదుచేసుకునే అవకాశం ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంతదాస్ పేర్కొన్నారు. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) విడుదల చేసిన మూడవ త్రైమాసికం (అక్టోబర్–డిసెంబర్) చక్కటి వృద్ధి అవకాశాలకు భరోసా ఇస్తున్నట్లు ఒక ఇంటర్వ్యూలో ఇస్తున్నట్లు పేర్కొన్నారు. భారత్ ఎకానమీ మూలాలు పటిష్ఠంగా ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ధరల కట్టడి ఆర్‌బీఐ ప్రధాన ప్రాధాన్యతగా పేర్కొన్నారు. భారత్ జీడీపీ అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో అంచనా (దాదాపు 7 శాతం)లను మించి 8.4 శాతంగా నమోదయ్యింది. అంతకుముందు రెండు త్రైమాసికాలకు సంబంధించి (ఏప్రిల్–సెప్టెంబర్) తొలి వృద్ధి అంకెలు వరుసగా 7.8 శాతం (క్యూ1), 7.6 శాతాలుగా (క్యూ2)నమోదయ్యాయి. అయితే ఈ అంకెలను ఎగువముఖంగా 8.2 శాతం, 8.1 శాతాలుగా జాతీయ గణాంకాల కార్యాలయం సవరించింది. దీనితో 2023 ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య ఎకానమీ 8.2 శాతం పురోగమించినట్లు కేంద్ర గణాంకాల కార్యాలయం పేర్కొంది. గత ఏడాది ఇదే కాలంలో ఈ వృద్ధి 7.3 శాతం.

8 శాతానికి వృద్ధి అంచనా పెంపు: మూడీస్



న్యూఢిల్లీ: భారత్ 2023–24 ఆర్థిక సంవత్సరం తొలి (2023 నవంబర్ నాటి) వృద్ధి అంచనాలను 6.6% నుంచి 8 శాతానికి పెంచుతున్నట్లు రేటింగ్ దిగ్గజం మూడీస్ తన తాజా నివేదికలో పేర్కొంది. పటిష్ఠ దేశీయ వినియోగం, మూలధన వ్యయాలు తమ అంచనాల పెంపునకు కారణంగా పేర్కొంది. జీ20 దేశాల్లో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నట్లు వివరించింది.

వచ్చే ఏడాది 6.8 శాతమే: క్రిసిల్

కాగా, ఏప్రిల్‌తో ప్రారంభమయ్యే రానున్న ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధి 6.8 శాతంగా ఉంటుందని క్రిసిల్ రేటింగ్స్ అంచనావేసింది. అధిక వడ్డీరేట్లు, ద్రవ్యలోటు కట్టడికి చర్యలు వంటి అంశాలు వృద్ధి స్పీడ్‌కు బ్రేకులు వేస్తాయని విశ్లేషించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటును క్రిసిల్ 7.6 శాతంగా అంచనావేస్తోంది.

ఒడిదుడుకులున్నా... కొత్త గరిష్టాలకు

స్వల్పలాభాలతో ముగింపు



ముంబై: రికార్డు గరిష్టాలకు చేరిన తర్వాత అధిక వెయిటేజీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో గురువారం స్టాక్ సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్‌లో 324 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 33 పాయింట్ల లాభంతో 74,119 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 159 పాయింట్లు పెరిగి 74,245 వద్ద సరికొత్త రికార్డు నమోదు చేసింది. నిఫ్టీ 96 పాయింట్ల రేంజ్‌లో 22,525 వద్ద ఆల్‌టైం గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 20 పాయింట్లు పెరిగి 22,494 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ట్రేడింగ్ ప్రారంభంలో రికార్డు స్థాయిల అందుకున్నాయి. అయితే ఎం అండ్‌ఎం(- 3.50%), రిలయన్స్(- 1.50%)తో పాటు ప్రైవేట్ రంగ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. దీంతో సూచీలు రోజంతా లాభ, నష్టాల మధ్య పరిమిత శ్రేణిలో తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి. మెటల్, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీ, ఎఫ్‌ఎంసీజీ, టెలికం, పారిశ్రామిక రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆటో, బ్యాంకులు, ఆయిల్‌అండ్ గ్యాస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

- ముక్క ప్రోటీన్స్ లిస్టింగ్ మెప్పించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.28)తో పోలిస్తే 57% ప్రీమియంతో రూ.57 వద్ద లిస్టయ్యింది. మార్కెట్ భారీ ఊగిసలాట కారణంగా స్తబ్దుగా ట్రేడైంది. చివరికి 51% లాభంతో రూ.42.26 వద్ద ముగిసింది. కంపెనీ క్యాపిటలైజేషన్ రూ.1,268 కోట్లుగా నమోదైంది.
- రెండు రోజుల వరుస పతనం నుంచి ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ కోలుకుంది. కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఇంట్రాడేలో 10% ఎగసి రూ.421 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది. చివరికి 9.82% లాభంతో రూ.420 వద్ద ముగిసింది.

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఎక్స్ఛేంజీలు పనిచేయవు. సాయంత్రం సెషన్‌లో మాత్రం కమోడిటీ మార్కెట్లలో ట్రేడింగ్ జరుగుతుంది.

SEBI లీడ్ మేనేజరుగా ఉండొద్దు..

జేఎం ఫైనాన్షియల్‌పై సెబీ ఆంక్షలు

న్యూఢిల్లీ: అనుచిత వ్యాపార విధానాలు పాటించినందుకు గాను ఆర్‌బీఐ చర్యల నేపథ్యంలో జేఎం ఫైనాన్షియల్‌పై సెబీ కీలక చర్య తీసుకుంది. ఇకపై కొత్తగా వచ్చే డెట్ సెక్యూరిటీల పబ్లిక్ ఇష్యూలకు లీడ్ మేనేజరుగా వ్యవహరించకుండా ఆంక్షలు విధించింది. కాగా, ఇప్పటికే చేపట్టిన ఇష్యూలకు 60 రోజుల వరకు యథావిధిగా కొనసాగవచ్చని మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది.

టాటా వాణిజ్య వాహనాలు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాణిజ్య వాహనాల ధరలను 2 శాతం వరకు పెంచుతున్నట్టు టాటా మోటార్స్ గురువారం ప్రకటించింది. సవరించిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయని కంపెనీ వెల్లడించింది. ముడిసరుకు ఖర్చుల ప్రభావాన్ని భర్తీ చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. అన్ని రకాల వాణిజ్య వాహనాల ధరలను అధికం చేస్తున్నామని, మోడల్, వేరియంట్‌నుబట్టి ఇది మారుతుందని వివరించింది. ట్రక్స్, బస్‌లు, తేలికపాటి వాణిజ్య వాహనాలను టాటా మోటార్స్ తయారు చేస్తోంది.

భారత్, ఇండొనేసియా మధ్య స్థానిక కరెన్సీలోనే వాణిజ్యం

ఆర్‌బీఐ, బ్యాంక్ ఇండోనేసియా ఒప్పందం



ముంబై: ద్వైపాక్షిక వాణిజ్య లావాదేవీలను స్థానిక కరెన్సీలోనే నిర్వహించుకోవడంపై భారత్, ఇండొనేసియా దృష్టి పెట్టాయి. ఇందుకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఇండోనేసియా ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్, బ్యాంక్ ఇండోనేసియా గవర్నర్ పెర్రీ వార్జియో దీనిపై సంతకాలు చేశారు. సీమాంతర లావాదేవీలను భారతీయ రూపాయి (ఐఎన్‌ఆర్), ఇండొనేషియా రూపియా (ఐడీఆర్) మారకంలో నిర్వహించడాన్ని ప్రోత్సహించే దిశగా ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించడానికి ఇది ఉపయోగపడనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
8-3-2024	
విశాఖ	475-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	463-00
విజయవాడ	463-00
రిటైల్ ధర (డజను)	72.00
7-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	469-00
వరంగల్	471-00
రిటైల్ ధర	5.30

టాప్‌గేర్‌లో వాహనాల స్పీడు



- ఫిబ్రవరిలో 13 శాతం వృద్ధి
- 20,29,541 యూనిట్ల విక్రయం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా అన్ని విభాగాల్లో కలిపి ఈ ఏడాది ఫిబ్రవరిలో 20,29,541 యూనిట్ల వాహనాలు రోడ్డెక్కాయి. 2023 ఫిబ్రవరిలో ఈ సంఖ్య 17,94,866 యూనిట్లు నమోదైంది. రిటైల్ విక్రయాలు గత నెలలో 13 శాతం పెరిగాయని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఎఫ్‌ఏడీఏ) గురువారం తెలిపింది. 'భారత్‌లో ఫిబ్రవరిలో ప్యాసింజర్ వాహన అమ్మకాలు రిటైల్‌లో 12 శాతం దూసుకెళ్లి 3,30,107 యూనిట్లు నమోదైంది. ద్విచక్ర వాహనాలు 13 శాతం ఎగసి 14,39,523 యూనిట్లు, వాణిజ్య వాహనాలు 5 శాతం అధికమై 88,367 యూనిట్లు, త్రీవీలర్లు ఏకంగా 24 శాతం పెరిగి 94,918 యూనిట్లను తాకాయి. ట్రాక్టర్ల విక్రయాలు 11 శాతం ఎగసి 76,626 యూనిట్లుగా ఉంది. ప్యాసింజర్ వాహనాలు 2024 ఫిబ్రవరి నెలలో గరిష్ఠ విక్రయాలను నమోదు చేశాయి' అని ఎఫ్‌ఏడీఏ వివరించింది. 'కొత్త ఉత్పత్తుల వ్యూహాత్మక పరిచయం, మెరుగైన వాహన లభ్యత ప్యాసింజర్ వాహనాల అమ్మకాల జోరుకు కారణమైంది. టూవీలర్ల విషయంలో గ్రామీణ మార్కెట్లు, ప్రీమియం మోడళ్లకు డిమాండ్, విస్తృత ఉత్పత్తి లభ్యత, వెల్లువెత్తిన ఆఫర్లు వృద్ధిని నడిపించాయి.

ఎయిర్‌టెల్‌లో సింగ్‌టెల్ వాటా విక్రయం

విలువ రూ. 5,849 కోట్లు

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్‌లో తాజాగా సింగపూర్ సంస్థ సింగ్‌టెల్ 0.86 శాతం వాటాను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 1,193.70 సగటు ధరలో 4.9 కోట్ల షేర్లను అమ్మివేసింది. వీటి విలువ రూ. 5,849 కోట్లుకాగా.. షేర్లను జీక్యూజీ పార్ట్‌నర్స్, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్, జీఎస్‌ఎఫ్2 గోల్డ్‌మన్ శాక్స్ తదితర సంస్థలు కొనుగోలు చేశాయి. ఎన్‌ఎస్‌ఈలో బ్లాక్ డీల్స్ ద్వారా అనుబంధ సంస్థ పాస్టెల్ లిమిటెడ్ ఈ వాటాను విక్రయించింది. పాస్టెల్, విరిడియన్ ద్వారా ఎయిర్‌టెల్‌లో సహ ప్రమోటర్‌గా సింగ్‌టెల్ వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఎయిర్‌టెల్‌లో 2023 డిసెంబర్‌కల్లా సింగ్‌టెల్ 10.43 శాతం వాటాను కలిగి ఉంది. భారతీ టెలికంకు 39.57 శాతం వాటా ఉంది.

ఎయిర్‌టెల్ షేరు గురువారం ఎన్‌ఎస్‌ఈలో 1 శాతం బలపడి రూ. 1,205 వద్ద ముగిసింది.

7సీస్‌కు ఫిక్కీ-బీఏఎఫ్ అవార్డు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గేమింగ్ కంపెనీ 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ తాజాగా ఫిక్కీ నుంచి బెస్ట్ యానిమేటెడ్ ఫ్రేమ్స్ (బీఏఎఫ్) అవార్డు అందుకుంది. ఉత్తమ భారతీయ గేమ్స్ విభాగంలో కంపెనీ అభివృద్ధి చేసిన రోలర్ కోస్టర్ సిమ్యులేటర్ గేమ్ ఈ గౌరవాన్ని దక్కించుకుంది. ముంబైలో జరిగిన కార్యక్రమంలో 7సీస్ ఎండీ ఎల్.మారుతీ శంకర్ అవార్డును స్వీకరించారు. రోలర్ కోస్టర్ సిమ్యులేటర్ గేమ్ ఇప్పటికే ఆన్‌డ్రాయిడ్ ప్లాట్‌ఫామ్‌పై దాదాపు 20 లక్షల డౌన్‌లోడ్స్ నమోదు చేసింది.

పాప్యులర్ వెహికల్స్ @ రూ. 280-295

ముంబై: ఆటోమోటివ్ డీలర్‌షిప్‌లు, సర్వీసుల సంస్థ పాప్యులర్ వెహికల్స్ అండ్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 12న ప్రారంభం కానుంది. ఇందుకు షేరుకి రూ. 280–295 ధరల శ్రేణిని కంపెనీ తాజాగా ప్రకటించింది. తద్వారా కంపెనీ మొత్తం రూ. 602 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది.

సాక్షి స్పోర్ట్స్

రన్నరప్ రాజా రిత్విక్



జాతీయ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ రెండో పతకాన్ని సాధించాడు. ర్యాపిడ్ ఫార్మాట్‌లో కాంస్య పతకం నెగ్గిన రిత్విక్ గురువారం నాసిక్‌లో జరిగిన బ్లిట్జ్ ఫార్మాట్‌లో రన్నరప్‌గా నిలిచి రజత పతకం సాధించాడు. నిర్ణీత 11 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో రిత్విక్ 9 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచాడు. రిత్విక్ మొత్తం 11 గేముల్లో ఏడింటిలో గెలిచి, నాలుగింటిని 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచాడు. 9.5 పాయింట్లతో దీప్తాయన్ ఘోష్ (రైల్వేస్) చాంపియన్‌గా నిలిచాడు.

సంజీత్ కూడా తొలి రౌండ్‌లోనే పరాజయం

పారిస్ ఒలింపిక్స్ బాక్సింగ్ వరల్డ్ క్వాలిఫయింగ్ తొలి టోర్నమెంట్‌లో భారత బాక్సర్ల పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఇటలీలో జరుగుతున్న ఈ టోర్నీలో సంజీత్ (92 కేజీలు) రూపంలో భారత్ నుంచి ఏడో బాక్సర్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. తొలి రౌండ్‌లో సంజీత్ 0–5తో ఆసియా చాంపియన్ ఐబెక్ ఒరల్‌బె (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు.

కుల్దీప్ ఫటాఫట్... ఓపెనింగ్ ధనాధన్!

ఐదో టెస్టులో ఇంగ్లండ్ 218 ఆలౌట్ • కుల్దీప్ యాదవ్‌కు 5 వికెట్లు
4 వికెట్లు తీసిన అశ్విన్ • తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 135/1



కుల్దీప్ యాదవ్ 5/72

ధర్మశాలలో తొలి రోజే వాతావరణం భారత్‌కు అనుకూలంగా మారిపోయింది. గిర్రున తిరుగుతున్న బంతులను ఎదుర్కోలేక తలవంచిన ఇంగ్లండ్ అరవై ఓవర్ల లోపే పది వికెట్లనూ స్పిన్నర్లకే అప్పగించింది. టాస్ గెలిచిన సానుకూలత, శుభారంభం తర్వాత ఒక దశలో 175/3తో మెరుగైన స్థితిలో నిలిచిన పర్యాటక జట్టు పేలవ ప్రదర్శనతో 43 పరుగులకే మిగిలిన 7 వికెట్లు చేజార్చుకుంది. ఎడంచేతి మణికట్టుతో కుల్దీప్ ఐదు వికెట్లు తన ఖాతాలో వేసుకోగా, తన వందో టెస్టు మ్యాచ్‌లో నాలుగు వికెట్లతో అశ్విన్ అండగా నిలిచాడు. మరోమారు యశస్వి జైస్వాల్ దూకుడైన బ్యాటింగ్, రోహిత్ సహకారం వెరసి సిరీస్‌లో భారత్‌కు తొలిసారి ఓపెనింగ్‌లో సెంచరీ భాగస్వామ్యం... ఆట ముగిసేసరికి కేవలం 83 పరుగుల లోటుతో ముగించిన టీమిండియా భారీ స్కోరుపై కన్నేసింది. ఇదే జోరు కొనసాగితే శుక్రవారమే చివరి టెస్టు పూర్తిగా భారత్ చేతుల్లోకి రావడం ఖాయం.

ధర్మశాల: ఇంగ్లండ్‌తో గురువారం ప్రారంభమైన ఐదో టెస్టులో భారత్‌కు అన్ని విధాలా సరైన ఆరంభం లభించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 57.4 ఓవర్లలో 218 పరుగులకే కుప్పకూలింది. క్రాలీ (108 బంతుల్లో 79; 11 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా... మిగతా వారంతా విఫలమయ్యారు. కుల్దీప్ యాదవ్ (5/72) ఐదు వికెట్ల ప్రదర్శనతో చెలరేగగా, అశ్విన్‌కు 4 వికెట్లు దక్కాయి. అనంతరం ఆట ముగిసే సమయానికి భారత్ 30 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 135 పరుగులు చేసి మరో 83 పరుగులు మాత్రమే వెనుకబడి ఉంది. యశస్వి జైస్వాల్ (58 బంతుల్లో 57; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోహిత్ శర్మ (52 బ్యాటింగ్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీలు సాధించగా... రోహిత్‌తో పాటు శుబ్‌మన్ గిల్ (26 బ్యాటింగ్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజ్‌లో ఉన్నాడు. ఆడిన మూడు టెస్టుల్లో విఫలమైన రజత్ పటిదార్ స్థానంలో భారత దేవ్‌దత్ పడిక్కల్‌ను తొలిసారి తుది జట్టులోకి ఎంపిక చేసింది. మరోవైపు 100వ టెస్టు ఆడుతున్న రవిచంద్రన్ అశ్విన్‌కు కోచ్ రాహుల్ ద్రవిడ్ చేతుల మీదుగా బీసీసీఐ ప్రత్యేక జ్ఞాపిక అందించింది.



యశస్వి

టపటపా...

ఓపెనర్లు క్రాలీ, డకెట్ (27) ఇంగ్లండ్‌కు మరోసారి శుభారంభం అందించారు. అయితే కుల్దీప్ రాకతో పరిస్థితి మారిపోయింది. గిల్ అద్భుత క్యాచ్‌తో తన తొలి ఓవర్లోనే డకెట్‌ను వెనక్కి పంపిన కుల్దీప్... కొద్ది సేపటికే పోప్ (11)ను కూడా అవుట్ చేశాడు. లంచ్ సమయానికి ఇంగ్లండ్ స్కోరు 100/2 కాగా, క్రాలీ కొన్ని చక్కటి షాట్లతో క్రీజ్‌లో పట్టుదలగా నిలబడ్డాడు. అయితే రెండో సెషన్‌లో భారత స్పిన్నర్లు మరింతగా చెలరేగిపోగా... ఇంగ్లండ్ బ్యాటర్లు పూర్తిగా చేతులెత్తేశారు. కుల్దీప్ బౌలింగ్‌లో అనూహ్యంగా టర్న్ అయిన బంతి క్రాలీ వికెట్లను ఎగరగొట్టగా, 100వ టెస్టు ఆడుతున్న బెయిర్‌స్టో (29) వికెట్ కూడా కుల్దీప్ ఖాతాలోనే చేరింది. ఆ తర్వాత ఇంగ్లండ్ పతనం వేగంగా సాగింది.

శుభారంభం...

భారత ఓపెనర్లు యశస్వి, రోహిత్ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశారు. 20 పరుగుల వద్ద రోహిత్‌ను అంపైర్ ఎల్బీగా ప్రకటించినా... రివ్యూలో అతను నాటౌట్‌గా తేలడం కలిసొచ్చింది. తొలి 27 బంతుల్లో 6 పరుగులే చేసి ఓపిక ప్రదర్శించిన యశస్వి స్పిన్నర్ల రాకతో చెలరేగిపోయాడు. బషీర్ వేసిన తొలి ఓవర్లో అతను 3 సిక్సర్లు బాదాడు. అయితే బషీర్ ఓవర్లోనే వరుసగా రెండు ఫోర్లతో అర్ధ సెంచరీని దాటిన యశస్వి అదే ఊపులో మూడో బంతికి ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌటయ్యాడు. అనంతరం 77 బంతుల్లో రోహిత్ హాఫ్ సెంచరీ పూర్తి కాగా, మరోవైపు గిల్ కూడా దూకుడుగా ఆడాడు.

పడిక్కల్ @ 314



ఈ మ్యాచ్‌తో కర్ణాటకకు చెందిన దేవ్‌దత్ పడిక్కల్ టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. భారత్ తరఫున ఇప్పటికే 2 టి20లు ఆడిన పడిక్కల్... టెస్టులు ఆడిన 314వ భారత ఆటగాడిగా నిలిచాడు.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలీ (బి) కుల్దీప్ 79; డకెట్ (సి) గిల్ (బి) కుల్దీప్ 27; పోప్ (స్టంప్డ్) జురేల్ (బి) కుల్దీప్ 11; రూట్ (ఎల్బీ) (బి) జడేజా 26; బెయిర్‌స్టో (సి) జురేల్ (బి) కుల్దీప్ 29; స్టోక్స్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 0; ఫోక్స్ (బి) అశ్విన్ 24; హార్ట్‌లీ (సి) పడిక్కల్ (బి) అశ్విన్ 6; వుడ్ (సి) రోహిత్ (బి) అశ్విన్ 0; బషీర్ (నాటౌట్) 11; అండర్సన్ (సి) పడిక్కల్ (బి) అశ్విన్ 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (57.4 ఓవర్లలో ఆలౌట్) 218. వికెట్ల పతనం:** 1-64, 2-100, 3-137, 4-175, 5-175, 6-175, 7-183, 8-183, 9-218, 10-218. **బౌలింగ్:** బుమ్రా 13-2-51-0, సిరాజ్ 8-1-24-0, అశ్విన్ 11.4-1-51-4, కుల్దీప్ 15-1-72-5, జడేజా 10-2-17-1.

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (స్టంప్డ్) ఫోక్స్ (బి) బషీర్ 57; రోహిత్ (బ్యాటింగ్) 52; గిల్ (బ్యాటింగ్) 26; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (30 ఓవర్లలో వికెట్ నష్టానికి) 135. వికెట్ల పతనం:** 1-104. **బౌలింగ్:** అండర్సన్ 4-1-4-0, మార్క్ వుడ్ 3-0-21-0, హార్ట్‌లీ 12-0-46-0, షోయబ్ బషీర్ 11-2-64-1.



ఫ్యామిలీతో అశ్విన్

14 భారత్ తరఫున 100 టెస్టులు పూర్తి చేసుకున్న 14వ ప్లేయర్‌గా అశ్విన్ ఘనత సాధించాడు. ఈ జాబితాలో సచిన్ (200), ద్రవిడ్ (163), లక్ష్మణ్ (134), కుంబ్లే (132), కపిల్‌దేవ్ (131), గావస్కర్ (125), వెంగ్‌సర్కార్ (116), గంగూలీ (113), కోహ్లి (113), ఇషాంత్ శర్మ (105), సెహ్వాగ్ (103), హర్భజన్ (103), పుజారా (103) ఉన్నారు.

17 ఇంగ్లండ్ తరఫున 100 టెస్టులు ఆడిన 17వ ప్లేయర్‌గా బెయిర్‌స్టో గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో అండర్సన్ (187), స్టువర్ట్ బ్రాడ్ (168), కుక్ (161), జో రూట్ (140), స్టివార్ట్ (133), బెల్ (118), గూచ్ (118), గోవర్ (117), అథర్టన్ (115), కొలిన్ కౌడ్రే (114), బాయ్‌కాట్ (108), పీటర్సన్ (104), బోథమ్ (102), స్టోక్స్ (102), స్ట్రాస్ (100), థోర్ప్ (100) ఉన్నారు.



ఫ్యామిలీతో బెయిర్‌స్టో

ముంబై ఘనవిజయం

42 పరుగులతో యూపీ వారియర్స్‌పై గెలుపు • రాణించిన బ్రంట్, అమెలియా, సైకా



నటాలీ సీవర్ బ్రంట్

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో ముంబై ఇండియన్స్ నాలుగో విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన ఈ పోరులో ముంబై 42 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌పై ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. ఓపెనర్లు యస్తిక భాటియా (9), హేలీ మాథ్యూస్ (4) నిరాశ పరిచినప్పటికీ తర్వాత వచ్చిన టాపార్డర్ బ్యాటర్ నటాలీ సీవర్ బ్రంట్ (31 బంతుల్లో 45; 8 ఫోర్లు) ధాటిగా ఆడింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (30 బంతుల్లో 33; 3 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి మూడో వికెట్‌కు 59 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కబెట్టింది. అనంతరం అమెలియా కెర్ (23 బంతుల్లో 39; 6 ఫోర్లు), సజీవన్ సజన (14 బంతుల్లో 22 నాటౌట్; 4 ఫోర్లు) స్కోరు వేగాన్ని పెంచారు. చమరి ఆటపట్టు 2 వికెట్లు తీసింది. తర్వాత 161 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూపీ వారియర్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 118 పరుగులకే పరిమితమైంది. ముంబై బౌలింగ్‌కు యూపీ ఏ దశలోనూ ఎదురునిలువలేకపోయింది. ఆరంభంలోనే టాపార్డర్ వికెట్లను 15 పరుగుల స్కోరు వద్దే కోల్పోయింది. కెప్టెన్ అలీసా హీలీ (3), కిరణ్ నవ్‌గిరే (7), చమరి ఆటపట్టు (3) నిరాశపరిచారు. క్రీజులోకి వచ్చిన 11 మందిలో గ్రేస్ హారిస్ (15), శ్వేత సెహ్రావత్ (17) మినహా ఏకంగా 8 మంది సింగిల్ డిజిట్ స్కోర్లకే వెనుదిరిగారు. దీంతో దీప్తి శర్మ (36 బంతుల్లో 53 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) చేసిన ఒంటరి పోరాటం సరిపోలేదు. ముంబై బౌలర్లలో సైకా ఇషాక్ (3/27) యూపీని దెబ్బ తీయగా, నాట్ సీవర్ 2 వికెట్లు పడగొట్టింది. నేడు జరిగే మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడుతుంది.

క్వార్టర్స్‌లో సింధు

డబుల్స్‌లో గాయత్రి జోడీ సంచలనం



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్లోకి వెళ్లింది. ప్రపంచ 10వ ర్యాంకర్ బీవెన్ జాంగ్ (అమెరికా)తో జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు 13–21, 21–10, 21–14తో గెలిచింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) ద్వయం 21–18, 21–13తో ప్రపంచ 7వ ర్యాంక్ జంట యూకీ ఫుకుషిమా–సయాక హిరోటా (జపాన్)ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్ చేరింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత స్టార్ కిడాంబి శ్రీకాంత్ 78 నిమిషాల్లో 21–19, 12–21, 20–22తో గ్వాంగ్ జు (చైనా) చేతిలో ఓడిపోయాడు.

అర్జున్‌కు మూడో స్థానం



సాక్షి, హైదరాబాద్: షెన్‌జెన్ లాంగాంగ్ మాస్టర్స్ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. చైనా వేదికగా ఎనిమిది మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య నిర్ణీత ఏడు రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో జియాంగ్జి బు (చైనా), యాంగీ యు (చైనా), అర్జున్ 4.5 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంక్‌ను వర్గీకరించగా... జియాంగ్జి టైటిల్ గెల్చుకోగా... యాంగీ యు రన్నరప్‌గా నిలిచాడు. అర్జున్‌కు మూడో స్థానం ఖరారైంది. ఏడు గేమ్‌లు ఆడిన అర్జున్ మూడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, ఒక గేమ్‌లో ఓడిపోయాడు.

జోగిని వ్యవస్థపై పోరాటం చేస్తూ..

ఆదర్శం



➤ జోగిని వ్యవస్థ నిర్మూలన కోసం మొక్కవోని పోరాటం.. ఈ ఆచారాన్ని అడ్డుకుంటూనే, అప్పటికే జోగినులుగా మారినవారికి వివాహాలు జరిపించిన ధీరత్వం.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఊట్కూరుకు చెందిన దళిత మహిళ హాజమ్మ సొంతం. ఆశ్రయ్ సంస్థ నిర్వాహకురాలు గ్రేస్ నిర్మలతో కలసి 'జోగిని వ్యవస్థ వ్యతిరేక పోరాట సంఘటన' సంస్థను ఏర్పాటు చేసిన ఆమె.. ఓఎంఐఎఫ్, ఏహెచ్‌టీయూ వంటి సంస్థల సహకారంతో ఉద్యమం చేస్తున్నారు. ఇప్పటివరకు 30 మంది జోగినులకు వివాహాలు జరిపించి, వారి జీవితాల్లో వెలుగులు నింపారు. "మేం ముగ్గురు అక్కాచెల్లెళ్లం. కూలీపని చేసి బతికేవాళ్లం. నేను ఆరో తరగతిలో ఉన్నప్పుడే (1985లో) జోగినిగా మార్చారు. ఆ ఆచారం గురించి మా అమ్మానాన్నకు పెద్దగా తెలియదు. 1995లో వారు లక్ష్మయ్య అనే వ్యక్తితో నాకు పెళ్లి నిర్ణయిస్తే.. చాలామంది గ్రామస్తులు, జోగినులు వ్యతిరేకించారు. తర్వాత అందరినీ ఎదిరించి పెళ్లి చేసుకున్నా.. ఆ ఆచారాన్ని నిర్మూలించేందుకు, బతుకు భారంగా మారిన జోగినుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వంతో పోరాడుతున్నా.." అని హాజమ్మ చెప్తున్నారు.

- మక్తల్



చేనేత 'సరస్వతి'

ఆశయం

ఎక్కువగా పురుషులే కనిపించే చేనేత రంగంలో తనదంటూ ప్రతిభను చాటిన కళాకారిణి భూదాన్‌పోచంపల్లికి చెందిన భోగ సరస్వతి. మగ్గం నేస్తూ, చిటికి కడుతూ, రంగు లద్దుతూ, భర్త బాలయ్యతో కలిసి కొత్తకొత్త డిజైన్లను రూపొందిస్తూ ప్రశంసలు పొందుతున్నారు. తమ కృషితో ముగ్గురు పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము నుంచీ ప్రశంసలు పొందారు. 2023లో 10వేల రంగుల చీరను తయారు చేసి.. అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ పురస్కారం పొందారు. చేనేతకు సంబంధించి మరెన్నో అవార్డులూ అందుకున్నారు.

- భూదాన్‌పోచంపల్లి



మహిళల భద్రతలో ఎవరెక్కడ?

కొన్నాళ్లుగా మహిళలపై నేరాలు మితిమీరుతున్నాయి. ఇక్కడా అక్కడా అని కాకుండా చాలా దేశాల్లో మహిళలపై వేధింపులు, దాడుల ఘటనలు ఆందోళన రేపుతున్నాయి. మన దేశంలోనూ ఇటీవల ఒక విదేశీ పర్యాటకురాలిపై జరిగిన అఘాయిత్యం కలకలం సృష్టించింది. మరి ప్రపంచవ్యాప్తంగా ఏ దేశాలు భద్రమనే చర్చ మొదలైంది. ఈ అంశానికి సంబంధించి అమెరికాకు చెందిన జార్జ్‌టౌన్ ఇనిస్టిట్యూట్ ఫర్ విమెన్ పీస్ అండ్ సెక్యూరిటీ సంస్థ తాజా ఒక నివేదిక (విమెన్ పీస్ అండ్ సెక్యూరిటీ ఇండెక్స్–2023)ను విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో మహిళలపై వేధింపులు, దాడులను మాత్రమేగాకుండా.. జీవన పరిస్థితులు, ఆర్థిక స్వాతంత్ర్యం, విద్య, ఉద్యోగ అవకాశాలు, భద్రత, ప్రజాప్రతినిధులుగా దక్కుతున్న అవకాశాలు వంటి అంశాలను పరిశీలించి ర్యాంకులు ఇచ్చింది. ఆయా అంశాలకు బేసిస్ పాయింట్లను ఇస్తూ.. భద్రమైన దేశాలకు గరిష్ఠంగా ఒక పాయింట్‌ను కేటాయించింది.


➤ ఈ ఇండెక్స్‌లో మొత్తం 177 దేశాలకు ర్యాంకులివ్వగా.. ఇండియా 0.595 పాయింట్లతో 128వ స్థానంలో నిలిచింది. మన దేశంలో ఆర్థిక స్వాతంత్రం, విద్య, ఉద్యోగావకాశాలు తగిన స్థాయిలో అందడం లేదని పేర్కొంది.

➤ మెక్సికో, కొలంబియా, గ్వాటిమాలా, ఎల్‌సాల్వెడార్ వంటి దేశాల్లో మహిళల పరిస్థితి దారుణంగా ఉందని నివేదిక పేర్కొంది.

➤ ప్రాంతాల వారీగా చూస్తే.. మధ్య ఆఫ్రికా, దక్షిణాసియా, పశ్చిమాసియా, లాటిన్ అమెరికా దేశాలు మహిళలకు భద్రం కాదని తెలిపింది. యూరప్ ఖండానికి వస్తే.. ఆగ్నేయ యూరప్ దేశాలు, ఇటలీలలో మహిళలకు అనువైన పరిస్థితులు లేవని పేర్కొంది.

➤ అమెరికా, కెనడా, పశ్చిమ–ఉత్తర యూరప్ దేశాలు, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్ తదితర దేశాల్లో మహిళలకు భద్రత ఎక్కువని వెల్లడించింది.

దేశాల వారీగా మహిళల భద్రత పాయింట్ల మ్యాప్ ఇదీ..



(జార్జ్‌టౌన్ ఇనిస్టిట్యూట్ ఫర్ విమెన్ పీస్ అండ్ సెక్యూరిటీ ఇండెక్స్-2023 ప్రకారం..)

తల్లిదండ్రులకూ తల్లిలా నిలిచి..



ఆధారం

➤ ఆస్తుల కోసం బంధాలు, బంధుత్వాలనూ వదులుకుంటున్న రోజులివి. కానీ పేద తల్లిదండ్రుల దుస్థితిని చూడలేక జీవితాన్నే త్యాగం చేసిన మహిళ యంగల నాగేంద్ర. ఖమ్మం జిల్లా వైరా మండలం పుణ్యపురం గ్రామానికి చెందిన రాములు, జానకమ్మ దంపతులకు ఆరుగురు కుమార్తెలు, ఓ కుమారుడు. వారిలో నాలుగో సంతానమైన నాగేంద్ర పదేళ్ల వయసులోనే ఏటా రూ.2,500 జీతానికి పాలేరుగా చేరింది. అప్పటినుంచీ వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబానికి అండగా నిలిచింది. ట్రాక్టర్ నడపడం నుంచి మందు పిచికారీ చేయడం దాకా అన్నీ నేర్చుకుంది. తన పెళ్లి ముచ్చటను వదిలేసి తల్లిదండ్రులతోనే ఉంటూ.. ఇద్దరు అక్కలు, ఇద్దరు చెల్లెళ్లు, తమ్ముడి చదువులు, పెళ్లిళ్లకు ఆసరాగా నిలిచింది. "మాది నిరుపేద కుటుంబం. ఒకప్పుడు తిండికీ కటకటే. ఆ పరిస్థితిలో పాలేరుగా చేరిన. వ్యవసాయ పనులన్నీ నేర్చుకున్నా.. సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా ఎదుర్కొన్నా. జీవితాంతం తల్లిదండ్రులకు తోడుగానే ఉంటా.." నాగేంద్ర తెలిపింది.



- వైరా రూరల్

ఎలక్ట్రీషియన్‌గా.. పనిచేస్తూ..



స్ఫూర్తి

అప్పుడప్పుడూ భర్త దుకాణానికి వెళ్లి ఎలక్ట్రీషియన్ పనిని కాస్త నేర్చుకుంది. దురదృష్టవశాత్తూ భర్త కన్ను మూయడంతో ఆ పనినే జీవనాధారంగా చేసుకుంది. ఇద్దరు పిల్లలను సాకుతోంది. జనగామ జిల్లా చిన్నరామంచర్లకు చెందిన ఉమామహేశ్వరి గాథ ఇది. ఆమెకు నర్మెట మండలం బొమ్మకూర్‌కు చెందిన విశ్వనాథుల సత్యనారాయణతో 1997లో వివాహమైంది. 2008 ఆయన ఎలక్ట్రిక్ పరికరాల రిపేరింగ్ షాపు ప్రారంభించగా.. ఉమామహేశ్వరి అప్పుడప్పుడు వెళ్తూ కాస్త ఎలక్ట్రీషియన్ పని నేర్చుకుంది. 2011లో రోడ్డు ప్రమాదంలో సత్యనారాయణ మృతిచెందాడు. అప్పటికే వారి 11 ఏళ్ల కుమారుడు సాయి, ఏడేళ్ల పాప సాత్వికల పోషణభారం ఆమెపై పడింది. భర్త బాటలో ఎలక్ట్రీషియన్ షాపునే నడుపుతూ ఇద్దరు పిల్లలను చదివించింది. గత ఏడాదే బిడ్డ పెళ్లి చేసింది. "ఒంటరి జీవితం ఎంత కష్టమో చెప్పలేను.. అలాగని కుంగిపోలేదు. భర్త నేర్పిన ఎలక్ట్రీషియన్ పనిని నమ్ముకున్నా.. పిల్లల్లో ఆయన్ని చూసుకుంటూ బతుకుతున్నా.." అని విశ్వనాథుల ఉమామహేశ్వరి చెప్తున్నారు.

- నర్మెట

స్త్రీలు శక్తి స్వరూపులు

గవర్నర్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాష్ట్రంలోని మహిళలకు శుభా కాంక్షలు తెలిపారు. శతా బ్దాలుగా మన వారస త్వం, సంస్కృతి, సంప్రదాయా లు స్త్రీలను శక్తి స్వరూపి ణులుగా గౌరవించి ఆరాధిస్తున్నాయన్నారు. లింగ సమానత్వం కోసం నిబద్ధతతో మహిళా రిజర్వే షన్ బిల్లును తీసుకువచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి మహిళలుగా కృతజ్ఞతలు తెలుపుదామని చెప్పారు. మహిళల హక్కుల పోరాటయోధుడిగా ప్రధాని మోదీని ఆమె కొనియాడారు.

మహిళలకు తగిన గౌరవం దక్కి ఉంటే ప్రపంచం మరోలా ఉండేది..

మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: సమాజంలో మహిళలు శతాబ్దాలుగా అణచివేతకు గురయ్యారని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. మొదటినుంచి మహిళలకు సమాజంలో సముచిత స్థానం ఉండి ఉంటే ప్రపంచ గమనం మరోవిధంగా ఉండేదని అన్నారు. మహిళలు అవమానాలకు, అణచివేతకు గురైనప్పటికీ పలు రంగాల్లో తమ ఉనికిని చాటుకుంటూ, స్వయం సాధికారతను సాధిస్తూ వారి శక్తిని చాటుతున్నారని ప్రశంసించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సచివాలయంలో జరిగిన కార్య క్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి హోదాలో ఈ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు, మహిళా హక్కులకోసం పోరాడుతున్న ప్రతి ఒక్కరికి మంత్రి సురేఖ శుభాకాంక్షలు తెలి పారు. కూతురుగా, తల్లిగా, సోదరిగా, భార్యగా ఈ సమాజాన్ని సన్మార్గంలో నడిపించే శక్తి మహిళలకుందన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం మహిళలపై అంతటి వివక్ష లేదని, వచ్చిన అవకాశాలను వినియోగించుకుని ప్రతిరంగంలోనూ మహిళలు తమ శక్తిని చాటాలని మంత్రి పిలుపునిచ్చారు.

'డిజిటల్' దారి ఇస్తే.. డెవలప్‌మెంట్



ఒకనాటి పాత కంప్యూటర్ల కాలం నుంచి ఇప్పటి కృత్రిమ మేధ (ఏఐ), వర్చువల్ రియాలిటీ (వీఆర్) దాకా.. డిజిటల్ రంగంలో మహిళలు ఎంతో కీలకంగా వ్యవహరించారు. కానీ ఆ రంగంలో వారికి దక్కుతున్న ప్రోత్సాహకాలు, అవకాశాలు చాలా తక్కువ అని ఐక్యరాజ్యసమితి అనుబంధ విభాగమైన 'యూఎన్ విమెన్' పేర్కొంది. సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యలో మహిళలు తక్కువగా ఉండటం కూడా దీనికి కారణమని తెలిపింది. స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడిసిన్) రంగాల్లో మహిళలకు విద్యావకాశాలు కల్పిస్తే.. ప్రపంచవ్యాప్తంగా సమ్మిళిత, వేగవంతమైన అభివృద్ధికి దారులు పడతాయని స్పష్టం చేసింది.

22% ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో ఉన్నవారిలో మహిళల శాతం

44.2% ఇప్పటివరకు వివిధ రంగాల్లో అందుబాటులోకి వచ్చిన 133 కృత్రిమ మేధ ప్రోగ్రామ్‌లలో లింగ వివక్ష చూపిస్తున్నవి

73% 125 దేశాల్లో చేసిన సర్వే ప్రకారం.. పని ప్రదేశంలో ఆన్‌లైన్ వేధింపులకు గురవుతున్న మహిళా జర్నలిస్టులు

వేతనంలోనూ సమానమవ్వాలి!

ఆకాశంలో సగం.. అవకాశాల్లో సగం అంటూ ఎంత ముందుకొచ్చినా ఇంకా ఎన్నో అంశాల్లో సమానత్వం రావాల్సి ఉందని భారత మహిళలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా వేతనాల విషయంలో వివక్ష కొనసాగు తోందని.. మహిళలకు సమాన పనికి, సమాన వేత నం అందాల్సి ఉందని 90 శాతం మంది అభిప్రాయపడ్డారు. అంతేకాదు మహిళలు పనికి, జీవితానికి రెండింటికీ సమాన ప్రాధాన్యమివ్వడమూ ముఖ్యమని స్పష్టం చేశారు. రిక్రూట్‌మెంట్ సంస్థ ఇండీడ్ తాజాగా 'వర్క్ నీడ్స్ విమెన్' పేరిట విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి.

➤ ప్రపంచవ్యాప్తంగా సగటున 82%మంది మహిళా ఉద్యోగులు పనికి తగిన వేతనం ముఖ్యమని స్పష్టం చేశారు.

➤ 56% మంది మహిళా ఉద్యోగులు తాము ఆశించినదానికంటే తక్కువ వేతనం పొందుతున్నామని.. పెంచాలని కోరుతూనే ఉన్నామని తెలిపారు. అదే మన దేశంలో 65శాతం మహిళా ఉద్యోగులు వేతనం పెంపు కోరుతున్నట్టు చెప్పారు. అన్నిదేశాల్లోకెల్లా ఇదే ఎక్కువ.

➤ గతంలో హార్వర్డ్ బిజినెస్ రివ్యూ అధ్యయనంలో.. మహిళలు ఉన్నత స్థానాల్లో ఉన్న కంపెనీలు ఎక్కువ లాభం ఆర్జించడంతోపాటు సామాజిక బాధ్యత అంశాల్లో ముందంజలో ఉన్నట్టు తేలిన విషయాన్ని కూడా ఈ నివేదిక ప్రస్తావించింది.

ఉద్యోగం సంతోషమివ్వాలంటే..

➤ ఉద్యోగ జీవితం సంతోషంగా ఉండాలంటే సరైన వేతనం ఉండాలని 90శాతం మహిళలు చెప్పారు.

➤ ఉద్యోగ భద్రత ఉండాలని 89శాతం, పనికి–జీవితానికి సమతౌల్యం ఉండాలని 87శాతం మంది వెల్లడించారు.

➤ కంపెనీ వ్యవహరించే తీరు, నైపుణ్య శిక్షణ–అభివృద్ధి అవకాశాలు కూడా ముఖ్యమని 87% మంది తెలిపారు.

➤ పనిచేసే స్థలం విషయంలో వెసులుబాటు ఉండాలని 39% మంది తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.